సంపుటి : 78 సంచిక : 26 పుటలు : 52

జాగృతి

కలి 5128 - శ్రీ పరాభవ చైత్ర బహుళ ఏకాదశి
13-19 ఏప్రిల్ 2026
వెల : ₹20/-



విశిష్ట వ్యక్తిత్వం.. విలక్షణ జీవనం

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

మంచులో మజా

పర్యాటకులు ఏప్రిల్ మూడవ తేదీన అటల్ సొరంగం ఉత్తర ద్వారం వద్ద మంచును ఆనందంగా ఆస్వాదించారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని లాహుల్ స్పితి జిల్లాలో ఉన్న ఈ అటల్ సొరంగం ఉత్తర ద్వారం సమీపంలో తాజాగా మంచుపడటంతో పర్యాటకులు ఆనందంగా మంచు మధ్య తిరిగారు. అటల్ సొరంగం ప్రపంచంలోనే అతి పొడవైన హైవే సొరంగాలలో ఒకటి. ఇది మనాలీ నుంచి లాహుల్ లోయ వరకు మార్గం సులభం చేస్తుంది. ఉత్తర ద్వారం సిస్సు ప్రాంతం సమీపంలో ఉంది. ఏప్రిల్ నెలలో కూడా ఇక్కడ మంచు ఉండటం సాధారణం కాదు, కానీ ఈ సంవత్సరం తాజాగా మంచు పడటంతో ఇక్కడి దృశ్యం అద్భుతంగా మారింది. పర్యాటకులు మంచు మీద నడుస్తూ ఫోటోలు తీసుకుని ఆనందం పొందారు. కుటుంబాలతో వచ్చినవారు మంచుతో ఆడుకుని సంతోషం వ్యక్తం చేశారు.ఈ సొరంగం రోహతాంగ్ కనుమను అధిగమించి రెండు వైపులా మార్గం అందిస్తుంది. ఉత్తర ద్వారం వద్ద లాహుల్ లోయ దృశ్యాలు అందంగా ఉంటాయి. తాజా మంచు కారణంగా చుట్టూ ఉన్న కొండలు తెల్లగా కప్పబడి అపూర్వమైన దృశ్యం సృష్టించాయి. పర్యాటకులు వాహనాలు ఆపి మంచు సమీపంలో నిలబడి ఆనందించారు. ఇక్కడి వాతావరణం చల్లగా ఉండటంతో శీతల ఆనందం అనుభవించారు. అయితే ఈ ప్రాంతంలో మంచు సంబంధిత ప్రమాదాలు ఉండటంతో అధికారులు కొన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. పర్యాటకులు మంచు మధ్య ఆడుకుని ఫోటోలు తీయడం ద్వారా ఈ ప్రయాణాన్ని గుర్తుండిపోయేలా చేసుకున్నారు. అటల్ సొరంగం ఉత్తర ద్వారం వద్ద ఇలాంటి ఉత్సాహం పర్యాటక రంగానికి మంచి సంకేతం. భవిష్యత్తులో కూడా ఇలాంటి అవకాశాలు పర్యాటకులకు లభించాలని ఆశిస్తున్నారు. ఈ ప్రాంతం హిమాలయ పర్వతాల అందాలను ప్రదర్శిస్తూ పర్యాటకుల హృదయాలను ఆకర్షిస్తుంది. అటల్ సొరంగం ద్వారా ప్రయాణించేవారు ఉత్తర ద్వారం వద్ద మంచు ఆనందం పొంది తమ ప్రయాణాన్ని మరింత సంతోషంగా ముగించుకున్నారు. ఈ దృశ్యాలు హిమాచల్ ప్రదేశ్‌లోని సహజ సౌందర్యాన్ని మరోసారి గుర్తు చేస్తున్నాయి. పర్యాటకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆనందం పొందారు.

వింధ్యవాసిని దేవికి గంగా జలాలు

వింధ్యాచల్ ధామ్‌లోని వింధ్యవాసిని దేవి ఆలయంలో భక్తులు ఏప్రిల్ 3న నికాశి పూజ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ పండుగ సందర్భంగా భక్తులు గంగానది పవిత్ర జలాలను తీసుకొని దేవి దర్శనానికి వరుసలలో నిలబడి ప్రార్థనలు చేశారు. ఈ దృశ్యం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మిర్జాపూర్ జిల్లాలో ఉన్న వింధ్యాచల్ ధామ్‌లో చోటుచేసుకుంది. వింధ్యాచల్ ధామ్ గంగానది తీరంలో ఉంది. ఇక్కడ మా వింధ్యవాసిని దేవి ఆలయం శక్తి పీఠాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. దేవి దుర్గా అవతారంగా భావించబడుతుంది. భక్తులు పవిత్ర గంగా జలాలతో దేవికి పూజలు చేయడం ఈ నికాశి పూజలో ముఖ్యమైన అంశం. ఈ సందర్భంగా ఆలయం వద్ద భక్తుల సంఖ్య ఎక్కువగా ఉండి వరుసలు ఏర్పడ్డాయి. భక్తులు దేవి ఆశీర్వాదం కోసం ఆసక్తిగా వేచి ఉండి ప్రార్థనలు చేశారు. ఈ పండుగ వింధ్యాచల్ ధామ్‌లో భక్తుల భక్తి భావాన్ని ప్రదర్శిస్తుంది. మా వింధ్యవాసిని దేవి మహిషాసురుడిని సంహరించిన తర్వాత ఈ ప్రాంతంలో నివాసం ఏర్పరచుకున్నట్లు ప్రతీతి. ఆలయం చుట్టూ ఉన్న వాతావరణం భక్తులకు ఆధ్యాత్మిక శాంతిని అందిస్తుంది. ఇటీవలి ఈ ఉత్సవంలో భక్తులు గంగా జలాలను తీసుకొని దేవి పాదాల వద్ద సమర్పించి మనస్సు నిండా కోరికలు వేడుకున్నారు. వింధ్యాచల్ ధామ్‌లో ఇలాంటి పండుగలు భక్తులను ఆకర్షిస్తాయి. ఈ నికాశి పూజ సమయంలో ఆలయం ప్రాంగణం భక్తి స్వరూపంగా మారింది. భక్తులు తమ కుటుంబాలతో కలిసి వచ్చి దేవి దర్శనం చేసుకుని ఆనందం పొందారు. ఈ పండుగ భక్తి మహిమను మరోసారి గుర్తు చేస్తుంది. ఉత్తరప్రదేశ్‌లోని ఈ పవిత్ర స్థలం హిందూ ధర్మానికి ముఖ్యమైన కేంద్రంగా ఉంటుంది. భక్తులు ఈ ఉత్సవాన్ని ఘనంగా జరుపుకోవడం ద్వారా దేవి అనుగ్రహం పొందుతారని విశ్వసిస్తారు.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
Editor : Dr. Goparaju Narayana Rao.

సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
040-27561453 / 9959997013

సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)

కె. దుర్గారెడ్డి :	అసోసియేట్ ఎడిటర్	-
సబ్ ఎడిటర్ :	-	9959991304

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

Link / QR Code ద్వారా మీ చందా చెల్లించినప్పుడు Remarks దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 **సంవత్సర చందా రూ.850**

బ్యాంకు ఖాతా వివరాలు

A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

- సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

గతంలో ఆర్జీకార్ ఆసుపత్రిలో వైద్యురాలిపై అత్యాచారఘటన ఒక్కటి చాలు పశ్చిమ బెంగాల్‌లో ఎంతటి అరాచకం రాజ్యమేలుతుందో చెప్పడానికి. తమకు ఓటు వేయలేదని... ప్రజలపై ప్రతికారదాడులకు పాల్పడిన తృణమూల్ కాంగ్రెస్ దాష్టీకాలను చూసి ఆనాటి గవర్నర్... స్వయంగా పర్యటించి బాధితులకు ధైర్యం చెప్పిన ఘటనలు చూశాం. ఇప్పుడు పశ్చిమబెంగాల్‌లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఓటర్ల జాబితా ప్రక్షాళన కార్యక్రమం కూడా జరుగుతుంది. చనిపోయిన వారితోపాటు, అక్రమ చొరబాటుదారుల పేర్లను సైతం తొలగిస్తున్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (సర్)పై సుప్రీంకోర్టుకు వెళ్లింది కూడా మమతా ప్రభుత్వమే. ఇప్పుడు సుప్రీంకోర్టుచే నియమింపబడి సర్ పరిశీలనకు వెళ్లిన న్యాయాధికారులపై దాడికి అరాచక శక్తులను ప్రోత్సహిస్తున్నది కూడా దీదీనే అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విచారణ జరిపేందుకు వెళ్లిన ఏడుగురు జ్యుడీషియల్ అధికారులలో ముగ్గురు మహిళా అధికారులు ఉన్నారు. వారితో పాటు వచ్చిన ఐదేళ్ల బాలుడు కూడా నిర్బంధంలో చిక్కుకుపోయాడు. కనీసం తాగునీరు, ఆహారం లేకుండా వారిని 9 గంటల పాటు అల్లరిమూక నిర్బంధించింది, ఈ ఘటన జరిగిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీనిపై కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సుప్రీంకోర్టుకు లేఖ రాశారంటే పరిస్థితి ఎంత దిగజారిందో అర్థం చేసుకోవచ్చు. ఆ లేఖను సుమోటోగా విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పశ్చిమబెంగాల్ అధికార యంత్రాంగాన్ని తీవ్రంగా అభిశంసించింది. ఇది రొటీన్‌గా జరిగిన ఘటన కాదని, న్యాయాధికారులను నైతికంగా దెబ్బతీయడానికి ఉద్దేశపూర్వకంగా పాల్పడిన దారుణ చర్య అని వ్యాఖ్యానించింది. మధ్యాహ్నం మూడున్నర గంటలకు నిర్బంధించగానే మొదట హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వెంటనే పశ్చిమబెంగాల్ ప్రభుత్వ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

శాలివాహన 1948 శ్రీ పరాభవ చైత్ర బహుళ ఏకాదశి

లోపలి పేజీలలో...



6లో

ముఖపత్ర కథనం

విశిష్ట వ్యక్తిత్వం..
విలక్షణ జీవనం

ధారావాహిక నవల

31 గణపతిదేవుడు

- మత్తి భానుమూర్తి

20లో

గళమెత్తిన గతం

రక్తసిక్తం - జలియన్ వాలాబాగ్ దురంతం

30లో

జాగృతి

సంపాదకీయం

బెంగాల్ పరిణామాలు.. హెచ్చరిక

అప్పటినుంచి ఆయన రాత్రి 8 గంటల వరకు పలుమార్లు ఫిర్యాదు చేస్తూనే ఉన్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఆ తరువాత హోం శాఖ కార్యదర్శి డీజీపీలను, రిజిస్ట్రార్ జనరల్‌ను సంప్రదించారు. వెంటనే చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు. కానీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్వయంగా జోక్యం చేసుకొని హోం శాఖ కార్యదర్శి, డీజీపీలతో గ్రూప్ కాల్ మాట్లాడారు. ఆ తర్వాత వారిద్దరూ ప్రధాన న్యాయమూర్తి ఇంటికి వచ్చారు. చివరకు అర్ధరాత్రి తర్వాత ఆ న్యాయాధికారులు విడుదల అయ్యారు. ఆ తర్వాత వారి వాహనాలపై కర్రలు, రాళ్లు, ఇటుకలతో దాడి జరిగింది. రాత్రి 11 గంటల వరకు కలెక్టర్ స్పందించలేదు. రాత్రివేళ కఠినమైన ఆదేశాలను మౌఖికంగా ఇవ్వాల్సి వచ్చిందని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు.

సర్ ప్రక్రియలో పాల్గొంటున్న ఏడుగురు జ్యుడిషియల్ అధికారులపై దాడి ఘటనను దర్యాప్తు జరుపుతున్న ఎన్ఐఏ విచారణలో విస్తుపోయే నిజాలు బయటకు వస్తున్నాయి. ఇది అప్పటికప్పుడు జరిగిన ఆకస్మిక ఆందోళన కార్యక్రమం కాదని, ముందస్తు ప్రణాళిక ప్రకారమే జరిగిన ఘటనగా ఎన్ఐఏ పేర్కొంది. నిమిషాల వ్యవధిలో బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీస్ (బీడీఓ) బయట 1500 మంది ఆందోళనకారులు గుమికూడి సమావేశం అయ్యారని, బీడీఓ కార్యాలయంలో అమర్చిన 16 సీసీటీవీ కెమెరాలలో ప్రధాన ద్వారం వద్ద ఉన్న వాటితో సహా 9 కెమెరాలను స్విచ్ ఆఫ్ చేసి ఉన్నట్లు ఎన్ఐఏ జరిపిన విచారణలో వెల్లడయింది. ఎఫ్ఐఆర్‌లో నమోదు అయిన 105 మంది వ్యక్తులలో 24 మందిని అరెస్టు చేశారు. కేంద్ర బలగాలు వారిని తరలిస్తున్నప్పుడు వారి కాన్వాయ్‌పై పలుచోట్ల రాళ్ల దాడి జరిగింది. ఈ దాడిలో డ్రైవర్ తీవ్రంగా గాయపడటంతో వాహనం బోల్తా పడింది. గాయపడిన వారిని రక్షించేందుకు సహాయ చర్యలు చేపట్టిన వారిని సైతం లక్ష్యంగా చేసుకుని దాడులు చేయటం మానవత్వాన్ని మంటగలిపినట్లైంది.

ఆందోళనకారులు మహిళలు పిల్లలను రక్షణ కవచంగా ముందు వరుసలో నిలపడమనేది అందరినీ విస్మయానికి గురిచేస్తుంది. ఇలా చేయడం వెనక అల్లరి మూకల వ్యూహం ఏమిటో అర్థమవుతుంది. ముందు వరుసలో మహిళలు, పిల్లలు ఉండడం వలన ఆందోళనకారులపై కఠిన చర్యలు తీసుకునేందుకు అధికారులు వెనకాడుతారు. ఒకవేళ అధికారులు లాఠీఛార్జి చేసి బలవంతంగా వారిని చెదరగొట్టడం వంటి కఠిన చర్యలకు దిగితే దీన్ని సాకుగా తీసుకొని పూర్తిస్థాయిలో విధ్వంసానికి పాల్పడే అవకాశం లేకపోలేదు. మహిళా నిరసనకారులపై పోలీసు బలగాలు దాడులు అంటూ ఆ దృశ్యాలను వీడియో తీసి మీడియా ద్వారా విస్తృతంగా ప్రసారం చేసి.. రాజకీయ లబ్ధి పొందడం, ఓటర్లలో సానుభూతిని రేకెత్తించి తమకు అనుకూల నెరటివ్‌లను బెంగాల్‌తోపాటు, దేశవ్యాప్తంగా మోడీ ప్రభుత్వాన్ని కార్నర్ చేసేందుకు ఉపయోగపడగలదని ఆందోళనకారులు భావించి ఉండవచ్చు.

ఈ నేపథ్యంలో సగటు బెంగాలీ ఓటరు తీర్పు ఎలా ఉండబోతుందో వేచి చూడాల్సిందే! ★

38లో

కథ

జీవన వారధులు

- డా. నరేంద్రబాబు సింగూరు

నక్సలిజం నుంచి విముక్తి (జాతీయం) - 14
రాష్ట్ర సమగ్రాభివృద్ధికి దిక్సూచి అమరావతి (ఆంధ్రప్రదేశ్) - 16
సంక్లిష్ట పరిణామాల దిశగా ప్రపంచం! (అంతర్జాతీయం) - 24
నాటి రంగస్థల వైభవం ఏది? (ప్రత్యేక వ్యాసం) - 26
కాంగ్రెస్ హయాంలో కూల్చివేతలే.. కూల్చివేతలు (తెలంగాణ) - 28
ఆధునిక కాలపు అత్యవసరం.. (ఆర్ఎస్ఎస్-100) - 32
నడిచే భూగోళం.. మన దేహం..! (దృక్కోణం) - 34
ధర్మబద్ధమైన సంపాదనే సంపద (హితవు) - 37
మనకు ఫీఫా ప్రపంచకప్ అర్హత యోగం ఎప్పుడో? (క్రీడ) - 43
శర్వా సక్సెస్ ట్రాక్‌లో 'బైకర్' (సినిమా) - 50

డా.అంబేడ్కర్ ఆలోచన, కృషి అపారమైనవి. దాదాపు ప్రతి ఒక్కరూ ఆయనను తమ తమ దృక్కోణాల నుండి చూశారు కానీ చాలా కొద్ది మంది మాత్రమే ఆయనను సమగ్రంగా అంచనా వేశారు. ఆయనపై కొన్ని దృక్కోణాలు అసంపూర్ణంగా ఉండగా, మరికొన్ని వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయి. డాక్టర్ అంబేడ్కర్ జీవితం విశాలమైనది, విస్తృతమైనది, బహుముఖమైనది. దేశానికి దురదృష్టవశాత్తు ఆయనపై సమగ్ర అధ్యయనం, విశ్లేషణ చాలా అరుదుగా జరుగుతుంది. ప్రతి ఒక్కరూ ఆయనలోని ఒక కోణాన్ని మాత్రమే చూసి, దాని ఆధారంగా తమ సొంత అభిప్రాయాలను ఏర్పరచుకోవడం ప్రారంభించారు. డాక్టర్ అంబేడ్కర్ గురించి మనం రకరకాల అభిప్రాయాలను వింటూనే ఉంటాం. ఆయన మనకు దేవుడని, సాక్షాత్తు భగవంతుని అవతారమని, మన పరిస్థితిని మెరుగుపరచడానికి ఆయన చేసిన ప్రయత్నాలు ఒక దైవిక కృషికి ఏమాత్రం తక్కువ కాదని చాలామంది అంటారు. అందువల్ల, కొందరు ఆయనను దేవుని అవతారంగా భావిస్తారు. మరికొందరు ఆయనను దేవునిగా భావించరు. ఆయన బోధనలను తిరస్కరిస్తారు. ఆయన కేవలం షెడ్యూల్డ్ కులాల వారి కోసమే ఉన్నారని కొందరు అంటారు. అయితే ఆయన యావత్ సమాజం కోసమే ఉన్నారని మరికొందరు అంటారు. ఆయనకు మహాత్మాగాంధీ, కాంగ్రెస్‌తో

విశిష్ట వ్యక్తిత్వం..

మహార్ అనే అస్పృశ్య కులంలో జన్మించిన భీమ్‌రావ్ అనే బాలుడి తండ్రి పేరు రామ్‌జీ సక్‌పాల్. ఆయన సైన్యంలో సుబేదార్‌గా పనిచేశారు. 14 మంది తోబుట్టువులలో అందరికంటే చిన్నవాడైన భీమ్‌రావ్ జీవితం కష్టాలతో, పోరాటాలతో నిండి ఉన్నప్పటికీ, అతడు మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణుడైన మొదటి మహార్ కులస్థుడిగా నిలిచాడు. అతడి ఈ విజయానికి, అంబేడ్కర్ అనే ఇంటిపేరు గల అతని బ్రాహ్మణ ఉపాధ్యాయుడి సృజనాత్మక మద్దతు ఎంతగానో దోహదపడింది. మరొక ఉపాధ్యాయుడు కృష్ణాజీ కేలుస్కర్ భీమ్‌రావ్‌కు భగవాన్ గౌతమ బుద్ధుని జీవిత చరిత్రకు సంబంధించిన చిన్న పుస్తకాన్ని చదవడానికి ఇచ్చారు. "నేను కేలుస్కర్‌ను, గౌతమ బుద్ధుడిని ఎన్నడూ మర్చిపోలేదు" అని భీమ్‌రావ్ పేర్కొన్నారు. కేలుస్కర్ భీమ్‌రావ్‌ను బరోడా రాజా సాహెబ్ వద్దకు తీసుకువెళ్లారు. అక్కడ రూ.25 ఉపకార వేతనం పొందసాగారు. 1912లో ఆయన బొంబాయి విశ్వవిద్యాలయం నుండి అర్థశాస్త్రం, రాజనీతిశాస్త్రంలో బి.ఏ. పట్టా పొందారు. బరోడా రాజు ఆయన ఉపకార వేతనాన్ని రూ.75కు పెంచారు. ఆయన

తీవ్రమైన విభేదాలు ఉన్నాయని కొందరు నమ్ముతారు, కానీ మరికొందరు మహాత్మా గాంధీ, అంబేడ్కర్ ఇద్దరి లక్ష్యం ఒకటేనని విశ్వసిస్తారు. మార్క్సిస్టు భావజాలం గలవారు ఆయన వర్గ పోరాటాన్ని విశ్వసించారని నమ్ముతారు. కానీ నేను కమ్యూనిజానికి, కమ్యూనిస్టులకు నంబర్ వన్ శత్రువునని అంబేడ్కర్ స్పష్టంగా రాశారు. కొందరు ఆయన ధర్మానికి వ్యతిరేకి అని అంటారు, కానీ డాక్టర్ అంబేడ్కర్ స్వయంగా ఇలా అన్నారు, "నేను ధర్మాన్ని నమ్ముతాను. ధార్మికపరమైన విలువలు లేకపోతే, సమాజంలోని పోరాటాలు అసూయ, అధికారం కోసం ఆరాటపడే వ్యక్తుల మధ్య జరిగే చిన్నపాటి పోరాటాలుగా మారిపోతాయి." ఆయనకు ధర్మం పట్ల ప్రగాఢ విశ్వాసం ఉండేది. ఆయన అగ్రవర్ణాలను, బ్రాహ్మణులను వ్యతిరేకించారని కొందరు నమ్ముతారు. కానీ ఆయన తన జీవితంలో ఏ ఒక్క వర్గాన్ని కూడా నిందించలేదు. ఆయన కొన్ని వ్యవస్థలకు వ్యతిరేకంగా పోరాడారు. ఆయన పోరాటం కొన్ని నమ్మకాలకు వ్యతిరేకంగా సాగింది. ఆయన పోరాటం అగ్రవర్ణ ప్రజలకు వ్యతిరేకంగా కాదు. అన్ని కులాలు, వర్గాల ప్రజలు ఆయన పోరాటంలో పాలుపంచుకున్నారు. ఆయన తన చివరి రోజులలో బౌద్ధమతాన్ని స్వీకరించారన్నది నిజం. ఆయన అన్ని మత విశ్వాసాల గురించి విస్తృతంగా రాశారు. అయితే, ఈ విషయాలు, ఆలోచనలు సమగ్రంగా విశ్లేషణకు, అధ్యయనానికి నోచుకోలేదు. ఆయన జీవితం విశాలమైనది, విస్తృతమైనది. ఆయన ఆలోచన, అధ్యయనం, రచనలు పరిశోధనాత్మకమైనవి. ఆయన పోరాటం సాటిలేనిది. దాని కోణాలు అనేకమైనవి, విస్తృతమైనవి. నేను కొన్ని విషయాలను క్లుప్తంగా వివరించడానికి ప్రయత్నిస్తాను.

విలక్షణ జీవనం

బరోడా రాజ్యంలో కొద్దికాలం ఉద్యోగం చేశారు. అక్కడ కూడా వివక్ష ఎదురవడంతో, భీమ్‌రావ్ తన ఉద్యోగాన్ని వదిలి తిరిగి వచ్చారు. కేలుస్కర్ కృషితో, ఆయన నెలకు 92.5 పౌండ్ల ఉపకార వేతనం సంపాదించి, ఉన్నత విద్య కోసం కొలంబియాకు వెళ్లారు. అక్కడ ఆయన ఎంఏ, పీహెచ్‌డీ పట్టాలను పొందారు. కొలంబియాలో చదువుతున్నప్పుడు, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో చదువుకోవడానికి కొంత సమయాన్ని కేటాయించారు. ఆయన రెండు సంస్థలలోనూ డిగ్రీలను సంపాదించారు. ఒక సంస్థ నుండి ఎంఏ, పీహెచ్‌డీ, మరొక సంస్థ నుండి ఎంఎస్సీ, డీఎస్సీ పట్టాలను పొందారు. ఇది అంత సులభమైన విషయం కాదు. ఆయన ఈ నాలుగు డిగ్రీలనూ సంపాదించడమే కాకుండా, విదేశంలో న్యాయశాస్త్రంను కూడా పూర్తి చేశారు.

ఆయన తన చదువు పూర్తి చేశాక సామాజిక జీవితంలోకి ప్రవేశించారు. ఆయనకు సామాజిక సేవ పట్ల అమితమైన ఆసక్తి ఉండేది. ఆయన ఒక ప్రఖ్యాత సంఘ సంస్కర్త, శ్రామిక నాయకుడు, బారిస్టర్, నేర్పరి అయిన రాజకీయ నాయకుడు,అనేక వార్తాపత్రికలకు సంపాదకుడు, నేర్పరి అయిన వక్త, మంచి ఆర్థికవేత్త, ప్రఖ్యాత మానవ శాస్త్రవేత్త, సాంఘిక సమస్యలపై సిద్ధాంతకర్త, అనేక దేశాల రాజ్యాంగాల నిపుణుడు, రాజ్యాంగ నిర్మాత. ఆయన కానిది ఏముంది? దీనితో ఆయన జీవితానికి అనేక కోణాలు ఉన్నాయని స్పష్టమవుతుంది.

జీవితం పోరాటాలతో నిండి ఉన్నా, ఆయనకు శత్రువులు లేరు. ఆయన పోరాడాడు కానీ ఎవరినీ తన శత్రువుగా భావించలేదు. ద్వేషం ద్వేషంతో అంతం కాదు, శత్రుత్వం శత్రుత్వంతో తొలగిపోదు, కాబట్టి ద్వేషాన్ని మనసులో పెట్టుకుని సమానత్వాన్ని, కరుణను పెంపొందించుకోవడం అసాధ్యం అని మహాత్మా బుద్ధుడు చెప్పారు. ద్వేషాన్ని మనసులో పెట్టుకోకుండానే ఇలాంటి వ్యక్తిత్వం ముందుకు సాగుతుంది.

ఆయన జీవితంలోని కొన్ని విషయాలు మాత్రమే ప్రజలకు వెల్లడయ్యాయనేది నిజం. ఆయన సంపూర్ణ జీవితం, దానికి సంబంధించిన కోణాలు, ఆయన అసాధారణ సామర్థ్యాలు అప్రకటితంగానే మిగిలి పోయాయి. మనుషుల విషయంలో ఇది సర్వ సాధారణం. ఒక వ్యక్తికి అనేక సామర్థ్యాలు ఉంటాయని, కానీ విధి వాటిలో ఒకదాన్ని ఎంచుకుని దానితోనే ముందుకు సాగుతుందని డాక్టర్ జాన్సన్ రాశారు.

లోకమాన్య తిలక్ గణితశాస్త్రంలో ప్రతిభావంతుడైన విద్యార్థి అని మనకు తెలుసు, కానీ ఆయనకు తన చదువును కొనసాగించడానికి సమయం దొరకలేదు. అటల్ బిహారీ వాజ్‌పేయి గొప్ప కవి. కానీ ఆయనకు కవిత్వం, వ్యాసాలు రాయడానికి సమయం దొరకలేదు. స్వామి రామతీర్థ, స్వామి వివేకానంద కూడా గణిత, విజ్ఞాన శాస్త్రాలలో మంచి విద్యార్థులే, కానీ సన్యాసమే వారి జీవితాలకు రాసి పెట్టి ఉంది.

విధి మనల్ని ఒక చోటు నుండి మరో చోటుకు తీసుకువెళుతుంది. అంబేడ్కర్ జీవితం కూడా అలాంటిదే. అందువల్ల, మనం ఆయన జీవితాన్ని సమగ్రంగా అధ్యయనం చేసి, దానిపై సంపూర్ణంగా ఆలోచించడానికి కృషి చేయాలి. అప్పుడే ఒక వ్యక్తిగా ఆయన్ను సరిగ్గా అంచనా వేయగలం.

ఒప్పందం ప్రకారం తన విద్యను పూర్తి చేసుకున్న తర్వాత, ఆయన బరోడాకు తిరిగి వచ్చారు. బరోడా సంస్థానానికి కార్యదర్శి అయ్యారు. అక్కడి వాతావరణం కూడా ఆయనకు అనుకూలంగా లేదు. ఆయన గుమస్తా ఆయనపై ఫైళ్లను విసిరేవాడు. ఆయన తన నీటిని తానే తీసుకొనిరావలసి వచ్చేది. క్లబ్‌లో ఆయనతో ఎవరూ ఆడేవారు కాదు. ఆయనకు ఒక ప్రత్యేక సీటు ఉండేది. ఆయనకు అద్దెకు ఇల్లు దొరకలేదు. చివరకు, ఆయన ఆదర్జీ సొరాబ్జీ అనే నకిలీ పేరుతో, ఒక పార్శీ ధర్మశాలలో గదిని అద్దెకు

డా. కృష్ణగోపాల్
సహ సర్‌కార్యవాహ, ఆర్ఎస్ఎస్

తీసుకున్నారు. ఇదే విషయమై డాక్టర్ అంబేద్కర్ ఒకానొక సందర్భంలో మాట్లాడుతూ "ఒక రోజు చాలా మంది పార్సీ పురుషులు కర్రలతో నా వద్దకు వచ్చి, వెంటనే అక్కడి నుండి వెళ్లిపొమ్మని చెప్పారు. నా వస్తువులతో నేను బయట రోడ్డు మీద ఒక చెట్టు కిందకు చేరుకున్నాను. అనేక డిగ్రీలు ఉన్నా కూడా వాటివల్ల నాకు ఏ ఉపయోగం లేదు. నేను ఎక్కడికి వెళ్లాలి? కనీసం నాతో స్నేహం చేయడానికి కూడా ఎవరూ ఇష్టపడరు. సమాజంలో నాకు గౌరవం దక్కడం లేదు" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అవమానం ఆయన హృదయాన్ని తీవ్రంగా గాయ పరిచింది. ఆయన కళ్ల నుండి నీళ్లు ధారలు కట్టాయి. ఆ రోజే ఆయన ఒక సంకల్పం చేసుకున్నారు. ఆ సంకల్పం క్రమంగా జీవితకాల సంకల్పంగా మారింది. ఆయన తన జీవితాన్ని సమాజ పరి

వర్తనకు అంకితం చేయాలని నిర్ణయించుకున్నారు. తన చివరి శ్వాస వరకు ఆయన ఆ సంకల్పానికే కట్టుబడి ఉన్నారు.

చిన్న మట్టి దీపం వెలుగులో రాత్రిళ్లు చదువు కుని, అన్నం లేకుండా కేవలం కొన్ని రొట్టె ముక్కల తోనే గడిపి, ఆ తర్వాత కొలంబియా విశ్వవిద్యా లయంలోనూ, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లోనూ చదువుకున్న ఆయన ఎంత డబ్బు అయినా సంపా దించుకోవచ్చు. కానీ అలా చేయలేదు. తన జీవిత మంతా సామాజిక మార్పునకే అంకితం చేశారు. సమాజంలోని బాధలను, దుఃఖాన్ని తొలగించడానికి, దాని వివక్షాపూరిత సంప్రదాయాలు, నమ్మకా లన్నింటినీ పరివర్తన చెందించడానికి తనను తాను అంకితం చేసుకున్నారు.

ముగ్గురు గురువుల మార్గదర్శనం

ఆయన జీవితమంతా మూడు ఆదర్శాలతో నడిచింది. ఆయన మొదటి గురువు మహాత్మా బుద్ధుడు. బుద్ధుడు తన కాలంలోని సంప్రదాయాలు, నమ్మకాలు, ఆచారాలు, కపటత్వం, కర్మకాండలకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసినప్పటికీ, ఆయన మౌలిక సారాన్ని మాత్రం గట్టిగా పట్టుకున్నారు. ఈ దేశం మౌలిక సారం ప్రేమ, ఏకత్వం, దయ, కరుణ, విశ్వాసం, విధేయత, ఆత్మీయత. ఈ మౌలిక సూత్రా లను స్వీకరించడం ద్వారా బుద్ధుడు కర్మకాండలను పక్కనపెట్టి, సంఘర్షణకు కాకుండా ప్రేమ, విశ్వాసం, కరుణ, ఆప్యాయత అనే మూలాలకు కట్టుబడిన ఈ దేశపు శాశ్వత తత్వాన్ని పునరుద్ధరించాడు. అందువల్ల, గౌతమ బుద్ధుడు ఆయనకు మొదటి గురువు అయ్యాడు.

రెండవ గురువు సామాజిక రుగ్మతల పట్ల తిరుగుబాటు చేసిన కబీర్‌దాస్. కబీర్ కూడా ధార్మికుడు. ఈ కవి రాముని భక్తుడు. అతను తనను తాను రాముని కుక్క అని పిలుచుకుంటాడు. కానీ కబీర్ ప్రేమ, కరుణ, దయ, ఆప్యాయత, భక్తి అనే భాషలో మాట్లాడతాడు. అతని ధర్మం మొత్తం ప్రేమ అనే రెండున్నర అక్షరాల మీద ఆధారపడి ఉంటుంది. అతను చేతిలో కర్ర పట్టుకుని మాట్లాడతాడు, కానీ ఎవరినీ తన శత్రువుగా భావించడు. ఆయన ధర్మం ఆధారంగా పోరాడతాడు. ఎవరిపైనా ద్వేషం పెంచుకోడు. కానీ మార్పు కోసం గళం విప్పుతాడు. గొంతు లేని వారికి గళం, వేదిక లేని వారికి వేదిక కల్పిస్తాడు. నిరాదరణకు గురైన వారిని గౌరవిస్తాడు. ఆయన పేరు కబీర్.

మూడవ గురువు మహాత్మా ఫూలే. భారతీయ సంప్రదాయంలో గాఢంగా పాతుకుపోయి ఉన్నారు. ఆయన అర్థరహితమైన ఆచారాలు, అర్థరహితమైన నమ్మకాలు, కపటత్వం, అబద్ధాలు, శాస్త్రాల తప్పుడు వ్యాఖ్యానాలను వ్యతిరేకించారు. మహాత్మా ఫూలే తిరుగుబాటు భేరీని మోగించారు. ప్రజలు నిరసన తెలిపారు. కానీ ఫూలే దృఢంగా నిలబడ్డారు.

ఈ ముగ్గురు గురువులు ఒక దృక్పథాన్ని, ఒక తత్వాన్ని అందించారు. దాని ఆధారంగానే అంబేద్కర్ తన పోరాటాన్ని ముందుకు నడిపించారు. అంబేద్కర్ పోరాటానికి మూలమైన ఆత్మ బుద్ధుడు, కబీర్, మహాత్మా ఫూలేల నుండి వచ్చింది. బుద్ధుడు, కబీర్, ఫూలేలను అర్థం చేసుకోకుండా, అంబేద్కర్‌ను అర్థం చేసుకోవడం అసంపూర్ణంగానే మిగిలిపోతుంది.

వ్యక్తిపూజకు వ్యతిరేకం

అంబేద్కర్ వ్యక్తిత్వం చాలా విప్లవాత్మకమైనది. "నేను ఎలాంటి వ్యక్తిపూజను నమ్మను. వ్యక్తులను పూజించవద్దు." అని స్పష్టం చేశారు. అందుకే, తన పుట్టినరోజు జరుపుకునే వారితో, "నా పుట్టినరోజు వేడుకలకు మీరెందుకు వస్తారు? మీరంతా ఇక్కడి నుండి వెళ్ళిపోండి," అని వారిని తరిమివేసేవారు. అంబేద్కర్ తన స్నేహితులతో, "గత పదిహేను సంవత్సరాలుగా మీరు నా పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటున్నారు, కానీ నేను ఎప్పుడూ వాటిలో పాల్గొనలేదు" అని అనేవారు. నేను దీనిని ఎల్లప్పుడూ వ్యతిరేకించాను. మీరంతా నా స్వర్ణోత్సవ పుట్టిన రోజును జరుపుకున్నారు. ఇప్పుడు అలాంటి వేడుక అవసరం లేదు అని వారికి స్పష్టం చేసేవారు. ఆయన కీర్తిని కోరుకునే వ్యక్తి కాదు. "మీ అభివృద్ధి పెద్ద నాయకుల నుండి, పెద్ద పార్టీల నుండి, ఎన్నికలలో గెలిచిన వారి నుండి రాదు. మీ అంతటా మీరే వృద్ధి చెందడానికి ప్రయత్నించండి. చదువుకోండి, సంఘటి తమవ్వండి, సరిగ్గా ప్రవర్తించండి, మీ జీవితాన్ని మెరుగుపరుచుకోండి. ఎవరిపైనా ఆధార పడకండి. వేరే ఏ వ్యక్తీ వచ్చి మిమ్మల్ని ఆదుకోడు. మీ వృద్ధి కోసం మిమ్మల్ని ఏ ఒక్క వ్యక్తిపైనా ఆధారపడేలా చేయడం నాకు ఇష్టం లేదు. మీ స్వంత ప్రయత్నాల ద్వారా, మీ స్వంత బలం ద్వారా, మీ స్వంత సంకల్పం ద్వారా మీ వృద్ధిని సాధించుకోవడానికి ప్రయత్నించండి" అని సూచించేవారు. ఆయన తనను తాను నిలబెట్టుకోవడానికి, కీర్తి గడించ డానికి, వార్తాపత్రికలలో తన ఛాయాచిత్రాలను ప్రచురితం చేసుకోవడానికి చాలా దూరంగా ఉండేవారు. ఇదే ఆయన వ్యక్తిత్వం.

స్వాతంత్ర్య ఉద్యమంలో అంబేద్కర్ ఎక్కడ ఉన్నారు అని చాలాసార్లు ప్రజలు అడుగుతుంటారు. దానికి ఆయన ఇలా అనేవారు, 'ఈ దేశానికి స్వాతంత్ర్యం రావాలని మీలాగే నేను కూడా కోరు కుంటున్నాను. కానీ నా మనసులో ఒక ప్రశ్న ఉంది, దేశానికి స్వాతంత్ర్యం వస్తే, నాకు, నా స్నేహితులకు, సోదరులకు స్వాతంత్ర్యం లభిస్తుందా లేదా, లేక మునుపటిలాగే బానిసలుగానే ఉండి పోతామా?' ఆయన కాంగ్రెస్ నాయకులను ఇలా

అడిగేవారు, “స్వాతంత్ర్యం తర్వాత నా బంధువులకు కూడా స్వేచ్ఛ లభిస్తుందని మీరు నాకు హామీ ఇవ్వగలరా? వారు స్వేచ్ఛగా ఉంటారా?” 1942 ఏప్రిల్ 26న బొంబాయిలో ఆయన కాంగ్రెస్ నాయకులతో ఇలా అన్నారు, “మీరు పోరాడుతున్న దానికంటే ఎక్కువ శక్తితో నేను స్వాతంత్ర్యం కోసం పోరాడతానని మీకు హామీ ఇస్తున్నాను, కానీ దయచేసి స్వరాజ్యంలో నా బంధువులకు ఎంత వాటా ఉంటుందో నాకు హామీ ఇవ్వండి.” ఆయన ఇలా అనేవారు, “నా సోదరులను స్వతంత్రులను చేస్తామని నాకు హామీ ఇవ్వండి. మీరు ఇవ్వకపోతే, నేను ఈ స్వరాజ్యంతో ఏం చేయాలి? నా దేశానికి స్వాతంత్ర్యం కావాలి, అదే సమయంలో నా ఈ సోదరులకు కూడా స్వాతంత్ర్యం కావాలి.”

దేశాభివృద్ధిలో పారిశ్రామికీకరణ

భారతదేశంలోని గ్రామాలలో వ్యవసాయ భూమి రోజురోజుకీ తగ్గిపోతూ, చెల్లా చెదురుగా అయి పోతోంది. చిన్న కమతాలతో ఈ దేశ ఆర్థికాభివృద్ధి సాధ్యం కాదు. ఈ దేశ పారిశ్రామికీకరణను వేగంగా చేయాలని వంద సంవత్సరాల క్రితమే చెప్పేవారు. వ్యవసాయంపై ఒత్తిడి చాలా ఎక్కువగా ఉంది. 80, 85 నుండి 90 శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. వ్యవసాయ సమస్యకు, గ్రామాల సమస్యకు భారతదేశ పారిశ్రామికీకరణే ఏకైక పరిష్కారం. 1920వ దశకంలో ఆయన, ‘భారతదేశ వ్యవసాయ సమస్యలకు పారిశ్రామికీకరణే ఉత్తమ పరిష్కారం’ అని అన్నారు. యూరప్, అమెరికాలోని రైతులు వ్యవసాయం వదిలి పారిశ్రామిక వ్యాపారాలు చేపట్టగా, మనం మాత్రం మన పరిశ్రమలను వదిలి వ్యవసాయంలో నిమగ్నమయ్యాము. 80–85 శాతం ప్రజలు వ్యవసాయం ద్వారానే తమ జీవనోపాధిని పొందుతున్నారు. ఆయన సిద్ధాంతాలు, ఆయన పరిశోధనా గ్రంథాలు ఏమయ్యాయి? వాటిపై ఒక మంచి పరిశోధన జరిగి ఉండాల్సింది. కానీ వందేళ్ల తర్వాత కూడా అది జరిగేలా కనిపించడం లేదు.

అణగారిన వారికి అండగా..

ఆయన అణగారిన వారికి సత్యం కోసం ఒక వేదికను, గొంతులేని వారికి గొంతును ఇచ్చారు. ఆయన వార్తాపత్రిక ‘మూక నాయక్’ ద్వారా మనకు ఈ విషయం తెలుసు. ఆయన వారికి ఒక ఉనికిని, ఒక పునాదిని ఇచ్చి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. క్లుప్తంగా చెప్పాలంటే, ఆయన ప్రజలలో వారి హక్కుల పట్ల చైతన్యం కలిగించి, వారిని సంఘటితం చేసి, క్రమశిక్షణ నేర్పి, పోరాటానికి సిద్ధం చేశారు. ఆయన ప్రజలలో ఆత్మగౌరవాన్ని నింపి, విద్యావంతులు కావాలని ప్రోత్సహించి, తమ హక్కులను సాధించుకోవడానికి వారిని సమీకరించి, అనేక విజయవంతమైన ఉద్యమాలకు నాయకత్వం వహించారు. మనకు మహాడ్ సత్యాగ్రహం గురించి తెలుసు. చెరువులోని నీటిని తాగడంపై చట్టం ఉంది. దాని ప్రకారం ముస్లింలు, క్రైస్తవులు నీరు తాగవచ్చు, అగ్రవర్ణాలవారు నీరు తాగవచ్చు. కానీ అంటరాని వారు మాత్రం తాగకూడదు. అలాంటివారు నిరసన తెలిపి నీరు తాగారు. అక్కడి సంప్రదాయవాదులు పంచగవ్యాన్ని కలిపి చెరువును శుద్ధి చేశారు. అక్కడికి వచ్చిన వారిని వారు కొట్టారు. “చూడండి, మేము ముస్లింలుగా మారితే, ఈ నీటిని కూడా తాగుతాము. అప్పుడు మీరు మమ్మల్ని అడ్డుకోరు. మేము క్రైస్తవులుగా మారితే, ఈ నీటిని తాగనిస్తారు; అప్పుడు కూడా మీరు మమ్మల్ని అడ్డుకోరు. మేము హిందువులం, హిందువులుగానే ఉండాలనుకుంటున్నాము, మమ్మల్ని నీళ్లు ఎందుకు తాగనివ్వడం లేదు?” అని అంబేద్కర్ ప్రశ్నించారు. నాసిక్‌లోని రామమందిరంలో ప్రవేశించడానికి ఆయన ఇలాంటి సత్యాగ్రహాన్నే చేపట్టారు. మేము హిందువులం. మేము దర్శనం కోసం గుడికి వెళ్లాలనుకుంటే, ప్రజలు నిరసన తెలిపి మమ్మల్ని కొట్టారు. ‘ఈ అంటరానితనం హిందూ సమాజానికి, హిందూ మతానికి ఒక కళంకం, మేము దానిని తొలగిస్తాము’ అని ఆయన అన్నారు. ‘ఇది హిందూ మత శరీరానికి ఉన్న కళంకం కాదు, ఈ కళంకం మన శరీరాలకు ఉంది.’ అని అన్నారు.

భగవద్గీత స్ఫూర్తిగా సత్యాగ్రహం

ఆయన జీవితం అనేక విభిన్న దశల గుండా సాగిందని చెప్పవచ్చు. కొన్నిసార్లు ఆయన, “నా సత్యాగ్రహానికి గీతే(భగవద్గీత) స్ఫూర్తి. గీత నన్ను సత్యాగ్రహం వైపు నడిపించింది” అని అనేవారు. ఆయన తన వార్తాపత్రిక పైభాగంలో “జైభవానీ” అని రాసుకునేవారు. తనను తాను హిందువు అని చెప్పుకోవడానికి ఏ మాత్రం సంకోచించేవారు కాదు. సామాజిక సంస్కరణ, రాజకీయ సంస్కరణ, ఆర్థిక సంస్కరణల కోసం పోరాట స్వరూపాలు మారిపోయాయి. మార్పునకు ధర్మమే పునాది అని, అలాగే సామాజిక సంస్కరణకు కూడా ధర్మమే పునాది అని ఆయన నమ్మేవారు. యువత ధర్మం పట్ల ఉదాసీనంగా ఉండటం చూసి ఆయన ఆందోళన

> **“కొన్నిసార్లు ఆయన, “నా సత్యాగ్రహానికి గీతే(భగవద్గీత) స్ఫూర్తి. గీత నన్ను సత్యాగ్రహం వైపు నడిపించింది” అని అనేవారు. ఆయన తన వార్తాపత్రిక పైభాగంలో “జైభవానీ” అని రాసుకునేవారు. తనను తాను హిందువు అని చెప్పుకోవడానికి ఏ మాత్రం సంకోచించేవారు కాదు.**

చెందేవారు. ధర్మం ఆశను కలిస్తుంది, విశ్వాసాన్ని ఇస్తుంది, సమాజంలో విలువలను స్థాపిస్తుంది. ధర్మం అంటే ఇతరుల సంక్షేమం గురించి ఆలోచించడం, అలాగే ఇతరుల శ్రేయస్సును పట్టించుకుంటూనే తన స్వంత శ్రేయస్సును కూడా చూసుకోవడం. తన ఆకలిని తీర్చుకుంటూనే ఇతరుల ఆకలిని కూడా తీర్చడం. భిక్షకులు సైతం కడుపు నింపుకోగలరు. కానీ ఇతరుల ఆకలిని తీర్చడం ధర్మం. ధార్మిక విశ్వాసం ఉన్నవారు అందరినీ పట్టించుకుంటూ ముందుకు సాగుతారు అని ఆయన తెలిపేవారు. సామాజిక సంక్షేమ స్ఫూర్తి ధర్మంలోనే అంతర్లీనంగా ఉంటుంది అని ఆయన అభిప్రాయం. అందుకే ఆయన మార్క్సిస్టులను వ్యతిరేకిస్తారు. ‘మార్క్సిస్టులు ధర్మాన్ని ఒక నల్లమందుగా భావిస్తారు. వారు వెన్న, టోస్ట్ లేదా చికెన్ లెగ్‌తోనే సంతోషంగా ఉంటారు. నేను వారి అభిప్రాయాలను సమర్థించను. అందువల్ల, మనం మౌలిక సూత్రాలను పరిరక్షించడం ద్వారా ఈ సమాజంలో మార్పు తీసుకురావాలి.’ అని ఆయన అనేవారు. ధర్మం పేరుతో చేసే కపటత్వం, ధర్మం పేరుతో చేసే నటన అంటే ధర్మాన్ని అపహాస్యం చేయడమే. దానిని అంగీకరించడానికి నేను సిద్ధంగా లేను అని స్పష్టం చేసేవారు. ద్వేషం, విద్వేషం ఎన్నడూ సంస్కరణలకు ఆధారం కాలేవు. ఈ దేశంలో మతమే సంస్కరణలకు ఏకైక ఆధారం అవుతుంది. రాజకీయ సంస్కరణల కన్నా సామాజిక సంస్కరణలే ముఖ్యం. మీరు రాజకీయ సంస్కరణలు అమలు చేయవచ్చు, రాజ్యాంగ హక్కులు కల్పించవచ్చు, కానీ వాటిని ఎవరు పాటిస్తారు? వాటిని పాటించే ఆధ్యాత్మిక భావన సమాజానికి లేకపోతే, సమాజం వాటికి గౌరవ మర్యాదలు ఇవ్వకపోతే, ఆ సంస్కరణలు కేవలం కాగితాలకే పరిమితమవుతాయి. మనకు సామాజిక, ఆర్థిక, రాజకీయ అనే మూడు రకాల స్వేచ్ఛలూ అవసరం. వీటిలో ఏ ఒక్కటి లేకపోయినా స్వేచ్ఛ అసంపూర్ణంగానే మిగిలిపోతుంది. దేశం స్వతంత్ర మవుతోంది, కానీ కోట్లాది ప్రజల గతి ఏమిటి? వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులు ఎలా ఉంటాయి?

ఆర్థిక పేదరికం కొనసాగితే, దీర్ఘకాలంలో రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం ఉండదు అని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు.

ఈ దేశంలో గోమాంసం తినడం క్షమించరాని నేరంగా భావిస్తున్నప్పుడే అంటరానితనం ఉనికిలోకి వచ్చిందని అంబేద్కర్ అన్నారు. అంటరానితనానికి మొదటి ఉదాహరణ దాహిర్ కుటుంబంలో జరిగింది. దాహిర్ ఓడిపోయినప్పుడు, ఈ నేరస్థులు(గోమాంస భక్షకులు) దాహిర్ రాజభవనానికి వచ్చారు. అప్పుడు దాహిర్ కుటుంబంలోని స్త్రీలు "వాళ్లు వస్తున్నారు, వాళ్లు మ్లేచ్ఛులు, వాళ్లు మనల్ని తాకితే మనం అపవిత్రులమవుతాము. వాళ్లు మనల్ని తాకకముందే మనం చనిపోవాలి. అందువల్ల, అగ్నిగుండాన్ని సిద్ధం చేయండి" అని అన్నారు. భారతదేశ చరిత్రలో మహిళలు 'అంటరాని' అనే పదాన్ని ఉపయోగించడం ఇదే మొదటిసారి.



కమ్యూనిస్టులకు బద్ధ శత్రువు

ఆయన కమ్యూనిస్టులను ఎంతగానో విమర్శించారు. 1937లో మైసూరులో జరిగిన ఒక దళిత సదస్సులో ఆయన "నేను కమ్యూనిస్టులలో చేరతానని కొందరు అంటున్నారు, కానీ అది ఏమాత్రం సాధ్యం కాదు. తమ రాజకీయ ప్రయోజనాల కోసం శ్రామికులను దోపిడీ చేసే కమ్యూనిస్టులకు నేను బద్ధ శత్రువును" అని అన్నారు. మనిషి కేవలం రొట్టెతోనే బతకడు. అతనికి మనసు ఉంది. ఆ మనసుకు ఆలోచనలనే ఆహారం కావాలి. ధర్మం మనిషి మనసులో ఆశను నింపుతుంది. అది అతడిని పనిచేయడానికి ప్రేరేపిస్తుంది, కానీ మార్క్సిస్టులు ధర్మాన్ని ఒక మత్తుమందుగా భావిస్తారు. నేటి కమ్యూనిస్టు వర్గం అంబేద్కర్ చిత్రాన్ని ప్రదర్శిస్తూ, ఆయనే వర్గ పోరాటానికి మార్గదర్శకుడని చెబుతుంది. దీన్ని ఎలా నమ్మగలం? అంబేద్కర్ 1942 నుండి 1946 వరకు వైస్రాయ్ కౌన్సిల్‌లో కార్మిక శాఖ మంత్రిగా పనిచేశారు. శ్రామిక పరిరక్షణ విధానాన్ని రూపొందించిన మొదటి వ్యక్తి ఆయనే. శ్రామిక విధానాన్ని ముసాయిదా చేసిన మొదటి మంత్రి కూడా ఆయనే. శ్రామికులు, యజమానులు, ప్రభుత్వం వేర్వేరు కారు. వారంతా కలిసి కూర్చోవాలి. శ్రామికుల ప్రయోజనాలు, పరిశ్రమల ప్రయోజనాలు, యావత్ సమాజ ప్రయోజనాలు వేర్వేరు లేదా పరస్పర విరుద్ధమైనవి కావు. వారంతా కలిసి పనిచేయాలి. అప్పటి నుంచి త్రిపక్ష చర్చలు ప్రారంభమయ్యాయి. ఆయన శ్రామికుల కోసం చట్టాలను రూపొందించారు. పారిశ్రామిక వివాదాలను పరిష్కరించడానికి ఆయన కమిటీలను ఏర్పాటు చేశారు. అంబేద్కర్ శ్రామిక రంగానికి కనీస వేతనాలు, ఫ్యాక్టరీ చట్టం, ప్రావిడెంట్ ఫండ్లు, ఓవర్‌టైమ్‌కు అదనపు చెల్లింపులు, రాయితీతో కూడిన ఆహారం, ఫ్యాక్టరీ క్యాంటీన్లు, ఫ్యాక్టరీలోనే వైద్య సహాయం వంటి నిబంధనలను ప్రవేశపెట్టారు. ప్రధాన కార్మిక కమిషనర్, ప్రాదేశిక కార్మిక కమిషనర్, కార్మిక ఇన్‌స్పెక్టర్లను నియమించిన ఘనత డాక్టర్ సాహెబ్‌దే. ప్రసూతి సెలవును సాధించడం కోసం ఆయన బొంబాయి అసెంబ్లీలో తీవ్రమైన పోరాటం చేశారు. మహిళలకు పూర్తి ప్రసూతి సెలవు లభించాలని పట్టుపట్టారు.

ఆయన గాంధీజీ వల్లే రాజ్యాంగ సభకు వచ్చారు. ఆయనకు గాంధీజీతో తరచుగా విభేదాలు వచ్చేవి. కానీ దేశ రాజ్యాంగాన్ని రూపొందిస్తున్న సమయంలో వల్లభభాయ్ పటేల్, జవహర్‌లాల్ నెహ్రూలను గాంధీజీ పిలిచి, ఆ పనిని ఎవరికి అప్పగిస్తున్నారని అడగ్గా, జవహర్‌లాల్ నెహ్రూ, "మేము జర్మనీకి చెందిన ప్రఖ్యాత రాజ్యాంగవేత్త సర్ జ్యోర్ జెరీని పిలుస్తున్నాము" అని బదులిచ్చారు. అందుకు గాంధీజీ "ఇంత పెద్ద దేశంలో రాజ్యాంగాన్ని రూపొందించడానికి ఎవరూ లేరంటే ప్రపంచం ఏమనుకుంటుంది?" అని ప్రశ్నించారు. ఆ తర్వాత గాంధీజీ "ఈ పనిని డాక్టర్ అంబేద్కర్‌కి అప్పగించండి, ఆయన చాలా విద్వత్తు ఉన్నవారు అని అన్నారు.

రాజ్యాంగం అమలులో ప్రజలు కీలకం

ఆయన రాజ్యాంగ పరిషత్తులో చేరి, ముసాయిదా కమిటీలో పనిచేసి, ఛైర్మన్ అయ్యి, రాజ్యాంగాన్ని రచించారని మనకు తెలుసు. ఆయన చివరి ప్రసంగంలోని ఒక పేరాను నేను ఇక్కడ అందిస్తున్నాను. ఈ ప్రతికూల పరిస్థితులలో కూడా ఆయన హృదయం ఎంత ఉదారంగా, విశాలంగా ఉండేదో కూడా మనం గమనిద్దాం. ఆయన ఆలోచనలు సమాజాన్ని ఏకం చేసేవిగా ఉండేవి. ఆయన కృతజ్ఞతాభావంతో నిండి ఉండేవారు. "నేను రాజ్యాంగ పరిషత్తులో చేరినప్పుడు, నా వెనుకబడిన సోదరుల (అంటే, నా అంటరాని సోదరుల) ప్రయోజనాలను కాపాడటమే నా ఏకైక లక్ష్యం. నేను డ్రాఫ్టింగ్ కమిటీలో ఉంటానని కలలో కూడా అనుకోలేదు. నాకంటే ఎక్కువ అర్హత, సామర్థ్యం ఉన్న వ్యక్తులు ఉన్నప్పటికీ, నన్ను దాని ఛైర్మన్‌గా నియమించినప్పుడు నా ఆశ్చర్యానికి అవధులు లేకుండా పోయాయి" అని ఆయన అన్నారు.

ఒక సందర్భంలో 1954లో ఆయన రేడియోలో ప్రసంగించారు. ఆయన పరిహాసంగా, కొద్దిగా వ్యంగ్యంగా మాట్లాడుతున్నా, ఆయన హృదయంలో మాత్రం తీవ్రమైన వేదన ఉంది. "హిందువులకు వేదాలు అవసరమైనప్పుడు, వారు ఆ పనిని వ్యాసుడు అనే ఒక నిమ్న కులానికి చెందిన వ్యక్తికి అప్పగించారు. వేదవ్యాసుడు వేదాలను సంకలనం చేశాడు. హిందువులకు రామాయణ ఇతిహాసం అవసరమైనప్పుడు, వారు వాల్మీకిని పిలిచి దానిని రాయించారు. హిందువులకు దేశ రాజ్యాంగం అవసరమైనప్పుడు, వారు నన్ను పిలిచారు." అని ఆ ప్రసంగంలో వ్యాఖ్యానించారు.

నవంబర్ 25, 1949న రాజ్యాంగ సభలో చేసిన తన చివరి ప్రసంగంలో, రాజ్యాంగం విజయం సాధిస్తుందా లేదా విఫలమవుతుందా అనే ప్రశ్నకు అంబేద్కర్ సమాధానమిస్తూ "అది దానిని తమ చేతుల్లో ఉంచుకునే ప్రజల స్వభావంపై ఆధారపడి ఉంటుంది. ఏ రాజ్యాంగమూ మంచిది లేదా చెడ్డది కాదు. అత్యంత చెడు ప్రజలు ఉంటారు, కానీ అత్యుత్తమ రాజ్యాంగాలు కూడా విఫలమవుతాయి. అందువల్ల, పార్లమెంటు, కార్యనిర్వాహక వర్గం,

న్యాయవ్యవస్థ, మంచి ప్రజల మద్దతుతో కలిసి రాజ్యాంగాన్ని విజయవంతం చేస్తాయా లేదా అనే దానిపై ఇది ఆధారపడి ఉంటుంది. ప్రజలు మంచివారై ఉండాలి" అని అన్నారు. "రాజకీయ పార్టీలు తమ సొంత ఆశయాలను నెరవేర్చుకోవడానికి దేశ ఆశయాలను త్యాగం చేస్తే, అది విజయం సాధించినట్టు అవుతుందా? ఏదీ కాదు" అని తెలిపారు. "భారతదేశం జనవరి 26, 1950న రిపబ్లిక్ దేశంగా అవతరిస్తుంది. కానీ మనం అంతకు ముందే స్వతంత్రులుగా లేమా? ఈ స్వాతంత్ర్యం స్థిరంగా, శాశ్వతంగా ఉంటుందా? మనం ఎందుకు బానిసలమయ్యామము?'' అని ప్రశ్నించారు. ముహమ్మద్ బిన్ ఖాసిం దండెత్తి నప్పుడు, స్థానిక సేనాపతి వెళ్లి వారిని కలిశాడు. ముహమ్మద్ ఘోరీ దండెత్తినప్పుడు, రాజా జయచంద్ర వెళ్లి మొఘలులను కలిశాడు. బ్రిటిష్ వారు సిక్కు రాజ్యాన్ని నాశనం చేస్తూ పోరాడుతుండగా, గులాబ్ సింగ్ మౌనంగా ఉండిపోయాడు. 1857లో దేశం స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నప్పుడు, చాలామంది మౌనంగా ఉండిపోయారు. మనం మన స్వాతంత్ర్యాన్ని నిలబెట్టుకోగలమా? అనే ఆలోచన నన్ను కలవరపెడుతోంది అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దేశం గురించి ఆయనకు ఎంత ఆందోళన ఉంది? స్వాతంత్ర్యం వస్తోంది, మన రాజ్యాంగం కూడా వస్తోంది. ఈ దేశ ప్రజలు ఎలా ప్రవర్తిస్తారు, వారు దేశభక్తితో ఉంటారా లేదా-ఇవే ఆయన్ను పట్టిపీడించిన అతిపెద్ద ఆందోళనలు.

భాషా ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటుకు వ్యతిరేకం

భాషా ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటు ప్రారంభం కాబోతున్నప్పుడు, అంబేద్కర్ మాట్లాడుతూ "ఒకే భాష మాట్లాడే వారందరూ ఒకే రాష్ట్రంలో ఎందుకు కలవాలో నాకు అర్థం కావడం లేదు. ఒకే భాష మాట్లాడే వారందరినీ పిలిచి ఒకే రాష్ట్రంలో సమీకరించడంలో అర్థం ఏమిటి? అందువల్ల, తెలుగు మాట్లాడేవారందరూ ఒకే తెలుగు రాష్ట్రంలో, మరాఠీ మాట్లాడేవారందరూ ఒకే మరాఠీ రాష్ట్రంలో, హిందీ మాట్లాడేవారందరూ ఒకే పెద్ద రాష్ట్రంలో నివసించాల్సిన అవసరం నాకు కనిపించడం లేదు. రాజకీయ నిర్మాణం పరిపాలనా సూత్రాలపై ఆధారపడి ఉండాలి, దేశం మొత్తం మీద అందరికీ తప్పనిసరిగా ఒక కేంద్ర అధికారిక భాషను ఏర్పాటు చేయాలి. హిందీ నా మాతృభాష కాదు. అయినప్పటికీ అన్ని రాష్ట్రాలు హిందీని స్వీకరించి, తమ తమ రాష్ట్రాలలో బోధించినప్పుడే మనం ఈ దేశాన్ని నిజంగా ఐక్యంగా, విశాలంగా ఉంచగలం." అని సూచించారు.

విదేశాంగ విధానం గురించి మాట్లాడుతూ "ఆగస్టు 15, 1947న మనకు స్వాతంత్ర్యం వచ్చినప్పుడు, మనకు శత్రువులు లేరు. 1948-49లో ఏం జరిగింది? కశ్మీర్ సమస్యతో భారతదేశం ఐక్యరాజ్యసమితికి వెళ్లినప్పుడు, అక్కడ భారతదేశానికి మద్దతు ఇచ్చే దేశం ఏదీ కనబడలేదు" అని వాపోయారు. చైనా టిబెట్‌ను ఆక్రమించుకోవడానికి వచ్చినప్పుడు అంబేద్కర్ మాట్లాడుతూ "ఏమి జరుగుతోంది? మన ప్రధానమంత్రి ఏమి చేస్తున్నారు? భవిష్యత్తులో చైనా సరిహద్దు మన సరిహద్దును దాటుతుంది. ఆయనకు ఈ ప్రమాదం కనిపించడం లేదా? చైనా మన గడప వద్దకు వస్తోంది, నెహ్రూ కలల ప్రపంచంలో జీవిస్తున్నారు. మనల్ని మనం రక్షించుకోలేము" అని హెచ్చరించారు.

ఆయన రాజ్యాంగంలోని ఆర్టికల్ 370పై షేక్ అబ్దుల్లాతో చర్చించారు. ఆయన షేక్ అబ్దుల్లాతో ఇలా అన్నారు, "మీరు నాతో ఉన్నారు. భారతదేశం కాశ్మీర్‌ను కాపాడుతుంది. కాశ్మీరీలకు భారతదేశం అంతటా సమాన హక్కులు ఉంటాయి. కానీ కాశ్మీర్‌లో భారతదేశానికి, భారతీయులకు పూర్తి హక్కులు ఇవ్వడం మీకు ఇష్టం లేదా? నేను భారతదేశ న్యాయశాఖ మంత్రిని, నా దేశానికి జరిగే ఈ రకమైన మోసంలో, ద్రోహంలో నేను పాలుపంచుకోలేను" అని అన్నారు. ఆర్టికల్ 370పై ఆయన అభిప్రాయాల గురించి నేటి రాజకీయ నాయకులకు, అన్ని పార్టీలకు తెలుసా?

అందరూ ఆర్యులే

ఆర్యులు బయటి నుండి వచ్చారన్న వాదన ప్రాథమికంగా ఒక తప్పుడు సిద్ధాంతమని ఆయన అన్నారు. ఇది ఒక పిరికి విధానం. ఐరోపావాసులు అమెరికాకు వచ్చి స్థానిక ప్రజలను చంపి తరిమివేసినట్లే, లేదా బయటివారు కెనడా, ఆస్ట్రేలియాలకు వెళ్లినట్లే, ఆర్యులు బయటి నుండి వచ్చి స్థానిక ప్రజలను చంపి తరిమివేశారని, దాని నుండి ఎస్సీలు ఉద్భవించారని ఇక్కడ నిరూపించాలని చూస్తున్నారు. ఇది తప్పు అని స్పష్టం చేశారు. నేటి సామాజిక శాస్త్రవేత్తలు, రాజకీయ నాయకులు ఆయన సిద్ధాంతం గురించి మాట్లాడరు. వారు మౌనం పాటిస్తారు. "ఈ భావననే తప్పుగా సృష్టించారు, దీనిని సమర్థించే ఆధారాలు కూడా లభించాయి. ఆర్యులు ఒక జాతి కాదు" అని అంబేద్కర్ అన్నారు. రుగ్వేదంలో 'ఆర్య' అనే పదం 33 సార్లు కనిపిస్తుం దని, కానీ ఒక్కసారి కూడా అది ఒక జాతిని సూచించదని అంబేద్కర్ రాశారు.

"భారతదేశంలోని శూద్రులందరూ ఆర్యులే, శూద్రులు, క్షత్రియులు కూడా. రుగ్వేదంలోని తొమ్మిది మండలాలలో 'శూద్ర' అనే పదం ఎక్కడా కనిపించదు. దీనిని తరువాత దశమ మండలంలో చేర్చారు. ఆ తర్వాతే 'శూద్ర' అనే పదం వచ్చింది. శూద్రులు ఆర్యులు. శూద్రులు క్షత్రియ వర్ణానికి చెందినవారు. వేణ రాజు, పురుఖ రాజు, నహుష రాజు, నిమి రాజు, సుదాస రాజు బ్రాహ్మణులతో ఘర్షణ పడ్డారు. వారు బ్రాహ్మణులను హింసించారు. ఆ అఘాయిత్యాలు ఎంత తీవ్రంగా ఉన్నాయంటే, బ్రాహ్మణులు విలపించసాగారు. దీనికి ఎలా ప్రతీకారం తీర్చుకోవాలో తెలియక, వారు ఆ క్షత్రియులకు యజ్ఞోపవీత ధారణను నిలిపివేశారు. ఆ శిక్ష సరిపోయింది. జంధ్యం స్వీకరించలేని క్షత్రియ వర్ణం క్రమంగా విద్యకు దూరమయ్యారు. వారిని పూజలు, యజ్ఞాలు, ఆచారాల నుండి దూరం చేసి, ఆస్తి హక్కును కూడా హరించారు.యజ్ఞోపవీతం ధరించాలా వద్దా అన్నది ముఖ్యం కాదు; దానిని ధరించే హక్కు ఉందా లేదా అన్నదే ముఖ్యం. వారికి అసలు ఏ హక్కులూ లేవు. క్రమంగా, వారి సామాజిక హోదా క్షీణించింది. నేటి శూద్రులందరూ పూర్వపు క్షత్రియులే. వారి వంశాలు, వంశపారంపర్యాలు అవే" అని అంబేద్కర్ తెలిపారు.

అతను ఇలా రాశాడు, "శూద్రులు ఆర్యులు. శూద్రులు సూర్యవంశీయులు. శూద్రులను క్షత్రియులుగా లెక్కించేవారు, మొత్తం మీద బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య అనే మూడు కులాలు మాత్రమే ఉండేవి. ఒకసారి ఎవరికైనా జంధ్యం అందకుండా పోతే, అతనికి జంధ్యం వేసే కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఎవరూ ముందుకు వచ్చేవారు

ఆర్యులు బయటి నుండి వచ్చారన్న వాదన ప్రాథమికంగా ఒక తప్పుడు సిద్ధాంతమని ఆయన అన్నారు. ఇది ఒక పిరికి విధానం. ఐరోపావాసులు అమెరికాకు వచ్చి స్థానిక ప్రజలను చంపి తరిమి వేసినట్లే, లేదా బయటివారు కెనడా, ఆస్ట్రేలియాలకు వెళ్లినట్లే, ఆర్యులు బయటి నుండి వచ్చి స్థానిక ప్రజలను చంపి తరిమివేశారని, దాని నుండి ఎస్సీలు ఉద్భవించారని ఇక్కడ నిరూపించాలని చూస్తున్నారు. ఇది తప్పు అని స్పష్టం చేశారు.

కాదు." అని అంబేద్కర్ రాశారు. శివాజీ మహారాజ్‌కు పట్టాభిషేకం చేయాలని నిర్ణయించినప్పుడు, కొందరు "శివాజీ మహారాజ్ క్షత్రియుడు కానప్పుడు, ఆయనకు ఎలా పట్టాభిషేకం చేయగలరు?" అని ప్రశ్నించారు. సమర్థ రామదాస్ కాశీ నుండి పండిట్ గంగాభట్‌ను పిలిపించారు. గంగాభట్ ఒక వంశవృక్షాన్ని సంకలనం చేశారు. ఆ వంశవృక్షంలో, శివాజీ మహారాజ్ కొన్ని తరాల క్రితం రాజస్థాన్ నుండి వచ్చిన ఒక క్షత్రియుడు అని గంగాభట్ ధృవీకరించారు. ఆయన ఉపనయన సంస్కారం చేసుకుని ఉండవచ్చు. శివాజీ పట్టాభిషేకానికి ముందే ఆయన ఉపనయన సంస్కారం జరిగింది. అంతకు ముందే ఆయనకు రెండుసార్లు వివాహం జరిగింది. ఆయనకు రాజారామ్, సంభాజీ అనే ఇద్దరు కుమారులు కూడా ఉన్నారు. శివాజీ ఉపనయన సంస్కారం తర్వాత, ఆయన పునర్వివాహం చేసుకుంటారని ప్రకటించారు. శివాజీ తన భార్యలు, పిల్లల సమక్షంలో పునర్వివాహం చేసుకున్నారు. దీని తర్వాత ఆయన పట్టాభిషేకం జరిగింది. ఒక సంప్రదాయం ఉద్భవించినప్పుడు, అది లోతుగా పాతుకుపోతుందని మనం చెప్పవచ్చు.

పంజాబ్‌లోని అంటరాని వారుగా పిలవబడే చుహార్లు, యునైటెడ్ ప్రావిన్సెస్ ((ప్రస్తుతం ఉత్తర్‌ప్రదేశ్) బ్రాహ్మణులకు ఒకే ముక్కు ఆకారం ఉంది. చమార్లు, బీహార్‌లోని అంటరానివారు. వారికి, బీహార్‌లోని బ్రాహ్మణులకు ఒకే ముక్కు ఆకారం ఉంది. కర్ణాటకలోని అంటరానివారు, బ్రాహ్మణులకు ఒకే ముక్కు ఆకారం ఉంది. తమిళనాడులోని చెర్మల్లు, బ్రాహ్మణులు, అయ్యంగార్లు, అయ్యర్‌లకు ఒకే నాసికా సూచిక ఉంది. అది బీహార్, పంజాబ్, మహారాష్ట్ర, లేదా తమిళనాడు ఏదైనా సరే, అక్కడి అంటరాని వారికి, అగ్రవర్ణాలకు చెందినవారికి ఒకే నాసికా సూచిక ఉందని అంబేద్కర్ పేర్కొన్నారు. ప్రముఖ మానవ శాస్త్రవేత్తలు ఈ కులాలన్నీ ఒకే గోత్రాన్ని పంచుకుంటాయని నమ్ముతారు. అంటరానివారి గోత్రం, బ్రాహ్మ ణుల గోత్రం ఒకటే. అందువల్ల, వారందరికీ ఒకే పూర్వీకులు ఉన్నారని చెప్పవచ్చు.

ముస్లింలకు తలొగ్గరాదు

భారత దేశంలో ముస్లిం సమస్య చాలా పెద్దది. ఆయన ఈ విషయంపై ఒక బృహత్తర పరిశోధనా పత్రాన్ని రాశారు. ఇది ఎలా పరిష్కారమవుతుందో మన మిత్రులు అధ్యయనం చేయాలి. "కాంగ్రెస్ ముస్లింల డిమాండ్లన్నింటికీ ఇలాగే తలొగ్గుతూ ఉంటే, అది ఏ పరిష్కారానికీరాదు. ఇలాంటి డిమాండ్లకు తలొగ్గుతూ ఉండటం ఎప్పటికీ రాజీకి గానీ, సమానత్వానికి గానీ దారితీయదు" అని ఆయన తేల్చి చెప్పారు.

"సైమన్ కమిషన్ భారతదేశానికి వచ్చినప్పుడు, ముస్లిం లీగ్ బొంబాయి ప్రెసిడెన్సీ నుండి సింధ్‌ను వేరు చేయాలని డిమాండ్ చేసింది. ఈ డిమాండ్ అవసరం ఏమిటి? బొంబాయి ప్రెసిడెన్సీ నుండి సింధ్‌ను ఎందుకు వేరు చేయాలి? కొన్ని జిల్లాల్లో ముస్లింలు అధిక సంఖ్యలో ఉన్నారన్నది నిజమే. కానీ, మెజారిటీ ప్రజలున్న చోట ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందా?" అని అంబేద్కర్ ప్రశ్నించారు. ఆ సమయంలో అంబేద్కర్ ఒక ప్రత్యేక నివేదికను సమర్పించారు. బొంబాయి ప్రెసిడెన్సీలో సభ్యుడిగా కూడా ఉన్నారు. ఆయన కాంగ్రెస్ అభిప్రాయాన్ని వ్యతిరేకించారు. తరువాత, 1932లో,

సింధ్ రాష్ట్రాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసి, కమ్యూనల్ అవార్డును ఆమోదించారు. ఈ రెండు చర్యలను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. మౌలానా ఆజాద్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక పెద్ద జాతీయవాద నాయకుడు, కానీ ఆయన ఏం చెబుతున్నారు?అని నిలదీశారు. హిందువులు మెజారిటీగా తొమ్మిది ప్రావిన్సులు ఉన్నాయి. సింధ్ అనే కొత్త ప్రావిన్స్ ఏర్పాటుతో, ఇప్పుడు ముస్లింలు మెజారిటీగా ఉన్న ప్రావిన్సులు ఐదు అవుతాయి. హిందువులు ఏదైనా చేస్తే, మీరు(ముస్లింలు) ప్రతీకారం తీర్చుకోవచ్చు అని మౌలానా ఆజాద్ అన్న మాటలను అంబేద్కర్ ప్రస్తావించారు. " ఇది మీకు జాతీయవాద భాషలా అనిపిస్తోందా? కమ్యూనల్ అవార్డు, హిందూ-మెజారిటీ ప్రావిన్సులలో ముస్లింలు మైనారిటీలుగా ఉన్నారని భావించి, వారికి అదే శాతం సీట్లను కేటాయించింది. హిందువులు మైనారిటీగా ఉన్న ముస్లిం ప్రావిన్సులలో వారికి అదే వాటా ఇస్తారా? ముస్లింలు మైనారిటీగా ఉన్న చోట వారి సీట్లను పెంచినప్పుడు, మైనారిటీలో ఉన్న హిందువుల సీట్లను ఎందుకు పెంచరు?" అని ఆయన ప్రశ్నించారు.

భారత్‌పై ముస్లిం దండయాత్రలు

"ఐక్యతను సాధించగల అంశాలు ఏమిటి? క్రీ.శ. 711 నుండి చరిత్ర యుద్ధాలు, దండ యాత్రలు, అత్యంత క్రూరమైన సంఘటనలతో నిండి ఉంది. భారతదేశంపై దాడి చేసిన వారిలో చాలా మంది ముస్లింలు ఉన్నారు. వారి ఉమ్మడి లక్ష్యం ఒక్కటే: హిందూ మతాన్ని నాశనం చేయడం. చారిత్రక, మతపరమైన, సాంస్కృతిక, సామాజిక సంఘర్షణలు కలిసి ఒక లోతైన రాజకీయ విభజనను సృష్టించాయి. హిందూ-ముస్లిం ఐక్యత గురించి మాట్లాడేవారు ఒక విషయం గుర్తుంచుకోవాలి: ఈ సంఘర్షణకు చారిత్రక, మతపరమైన, సాంస్కృతిక, సామాజిక కారణాలున్నాయి. పైకి కనిపించే రాజకీయ వ్యతిరేకత ఉపరితలమైనది మాత్రమే. ఇవన్నీ కలిసి ఒక లోతైన అగాధాన్ని సృష్టిస్తున్నాయి, దానిని పూడ్చడం అంత సులభమైన పని కాదు. మౌలానా మహమ్మద్ అలీ తనను తాను నిజమైన ముస్లింగా భావించు కుంటారు. నిజమైన ముస్లిం భారతదేశంలో ఖననం కావడానికి నిరాకరిస్తాడు. అతడిని ఖననం కోసం జెరూసలేంకు తీసుకువెళ్తారు" అని అంబేద్కర్ పేర్కొన్నారు. నిజమైన ముస్లిం భారతదేశాన్ని తన మాతృభూమిగా భావిస్తాడా? అనే అనుమానాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఒకవేళ ఆఫ్ఘనిస్తాన్ దాడి చేస్తే, భారతదేశంలోని ముస్లింలు ఎక్కడికి వెళ్తారు? ఇది మనం పరిగణించాల్సిన విషయం. మొదటి ఆఫ్ఘన్ దండయాత్ర సమయంలో ముస్లింలు ఎలా ప్రవర్తించారో మనం మర్చిపోవాలా? అని ప్రశ్నించారు. విభజన అవసరమైతే, మొత్తం జనాభాను ఒకేసారి మార్పిడి చేయాలి. అప్పుడు ఈ సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుంది. నేను ముస్లిం భారతదేశం, ముస్లిమేతర భారతదేశాన్ని విశ్వసిస్తాను. ఈ సమస్యకు యూరప్ ఒక పరిష్కారాన్ని కనుగొంది. ఈజిప్ట్, బల్గేరియా సహా ఎనిమిది దేశాలు తమ మైనారిటీలను పూర్తిగా మార్పిడి చేసుకుని ఈ సమస్య నుండి బయట పడ్డాయని అంబేద్కర్ రాసుకొచ్చారు. ఈ సందర్భంగా హైదరాబాద్ (ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉన్న హైదరాబాద్)లో నివసిస్తున్న అల్పసంఖ్యాక వర్గీయులను ఆయన హెచ్చరించారు.

"విభజనకు ముందు ప్రజల భద్రతకు హామీ ఇవ్వండి. ఆ తర్వాత ఏం చేసినప్పటికీ ఏం ప్రయోజనం ఉంటుంది?" అని కూడా ఆయన ప్రభుత్వంతో అన్నారు. చాలా మంది ప్రజలు హైదరా

బాద్‌లోనే ఉండిపోయారు. వారు ప్రమాదంలో ఉన్నారు. ముస్లిం ఐక్యత వారిని ముస్లింలుగా మారుస్తోంది. వారు నిస్సహాయులుగా ఉన్నారు. అంబేద్కర్ వారికి ఒక లేఖ పంపారు, అందులో "ఎట్టి పరిస్థితుల్లోనైనా భారతదేశానికి రండి. ఒక్కసారి మీరు హిందూ ధర్మాన్ని విడిచిపెడితే, శాశ్వతంగా దూరమైపోతారు. నేను మిమ్మల్ని పవిత్రపరిచి, తిరిగి హిందువులుగా చేస్తాను. భారతదేశానికి రండి" అని పిలుపునిచ్చారు. ఇది హైదరాబాద్‌లోని తన తోటి షెడ్యూల్డ్ కులాల వారికి అంబేద్కర్ ఇచ్చిన పిలుపు. "నేను హిందూ సమాజానికి తప్పకుండా ఒక షాక్ ఇస్తాను. అలాంటి షాక్ చికిత్స అవసరం" అని ఆయన సంకల్పించుకున్నట్లు మనం చూడవచ్చు. 1935లో ఆయన, "నేను హిందువుగా పుట్టాను" అని అన్నారు.

హిందువులు మాకు సోదరులు

1956లో, తన జీవితం ఎక్కువ కాలం లేదని ఆయనకు అనిపించడం మొదలైంది. ఆయన గాంధీజీకి "నేను దేశానికి అత్యంత ప్రయోజనం చేకూర్చే మార్గాన్ని అనుసరిస్తాను" అని వాగ్దానం చేశారు. ఈ కారణంగా, ఆయన బౌద్ధమతాన్ని స్వీకరించారు. 1935 నుండి 1956 వరకు, హిందూ సమాజం ఎలా స్పందిస్తుందో, వారు(హిందువులు) ఉదార మనఃపరిస్థితిని ప్రదర్శిస్తారో లేదో అని ఆయన వేచి చూశారు. చివరకు, ఆయన బౌద్ధమతంలోకి మారారు. పోప్, నిజాం ప్రతినిధులు కూడా ఆయన వద్దకు వచ్చారు. ఆయన వారందరినీ తిరస్కరించారు. "నేను క్రైస్తవ మతంలోకి గానీ, ఇస్లాంలోకి గానీ మారితే, ఈ దేశం గొప్ప ప్రమాదంలో పడుతుంది. అందువల్ల, ఈ దేశపు మౌలిక తత్వంతో నన్ను అనుసంధానించే మార్గాన్ని నేను అనుసరిస్తున్నాను. దలైలామా బౌద్ధులను, హిందువులను ఆధ్యాత్మిక సోదరులుగా భావిస్తారు. మనం తమ్ముళ్లం; భారతదేశంలోని హిందువులు మన అన్నలు" అని అంబేద్కర్ అన్నారు. తద్వారా దేశానికి అతి తక్కువ హాని కలిగించే మార్గాన్ని ఆయన ఎంచుకున్నారు.

ఆయన ఈ దేశపు సాంస్కృతిక, భావజాల, నైతిక, తాత్విక వారసత్వంతో అనుసంధానమై ఉన్నారు. సంక్షిప్తంగా చెప్పాలంటే, అంబేద్కర్ జీవితం బహుముఖమైనది. ఆయన తన అధ్యయనాలు, అనుభవాల ఆధారంగా అనేక విషయాలపై విస్తృతంగా రాశారు. తీవ్రమైన పేదరికంలో, అంటరానితనం అనే అవమానకరమైన వాతావరణంలో పుట్టి పెరిగిన ఆయన, ఉత్తమ డిగ్రీలు పొందిన తర్వాత కూడా గౌరవాన్ని పొందలేక పోయారు. ఇంతటి జ్ఞానంతో, కొన్ని విషయాలు ఆయన మనసులో మెదలవచ్చు. అవి ప్రజలకు ఇబ్బందికరంగా అనిపించవచ్చు. ఆయన 'రిడిల్స్ ఇన్ హిందూయిజమ్' అనే ఒక చిన్న పుస్తకాన్ని కూడా రాశారు, కానీ దానిని ప్రచురించ లేదు. చనిపోయే వరకు దానిని తన బీరువాలోనే ఉంచారు. అందులో చాలా పంక్తులు ఉన్నాయి, వాటి కింద ఉన్న సంపాదకీయ గమనికలో ఆ పంక్తులను చెదలు తినేశాయని రాసి ఉంది. ఆయన జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఉన్నాయి.

అశాంతిలోనూ ప్రశాంత చిత్తం

సమాజ పరిస్థితులు మారినకొద్దీ, ఆయన నమ్మకాలు కొద్దికొద్దిగా మారాయి, కానీ ఆయనలోని దేశభక్తి, సమాజాన్ని తనతో పాటు తీసుకువెళ్లాలనే ఆయన కోరిక మాత్రం మారలేదు. ఇది చాలా ప్రాథమికమైనది. అందువల్ల, ఆయన పుట్టినప్పటి నుండి చివరి శ్వాస వరకు భారతీయుడిగానే ఉండిపోయారు. బౌద్ధమతంలోకి మారారు. హిందూ సమాజంలోని కపటత్వం, నిందలు, మితిమీరిన కర్మకాండలు, అనైతిక ప్రవర్తన పట్ల ఆయనకు కోపం వచ్చింది. అయినప్పటికీ, ఆయన మౌలిక తత్వశాస్త్రం ద్వారా భారత నేలతో అనుబంధాన్ని నిలుపుకున్నారు.

ఆయన జీవితం తీవ్రమైన అశాంతితో నిండి ఉన్నప్పటికీ, ఆయన మనసు మాత్రం ఎల్లప్పుడూ ప్రశాంతంగా ఉండేది. ఆయన జీవితం పోరాటాలతో నిండి ఉంది, కానీ ఆయనకు శత్రువులు లేరు. ఆయన బ్రాహ్మణ్యాన్ని వ్యతిరేకించారు, కానీ బ్రాహ్మణులు అతనికి మంచి స్నేహితులుగా ఉండేవారు. మొదట్లో ఆయన శ్రీరాముని భక్తునిగా కనిపిస్తూ, రామ మందిరానికి వెళ్లడానికి ప్రయత్నించారు, కానీ తరువాత హిందూ మతంలో ఉండ

కూడదని కూడా అన్నారు. పూనా ఒప్పందం సమయంలో, మహాత్మా గాంధీ వస్తారు, వెళ్తారు, మహాత్మా గాంధీ అమరులు కారు అని చెబుతూ ఆయన గాంధీని కఠినంగా మందలించారు. గాంధీ మరణం పట్ల ఆయన తీవ్రంగా దుఃఖించారు. రాజ్యాంగ ముసాయిదాను రూపొందించడానికి మహాత్మా గాంధీ కూడా ఆయనను పిలిపించారు.

స్వాతంత్ర్య పోరాటంలో ఆయన పక్కకు తప్పుకున్నట్లు మనకు అనిపిస్తుంది, కానీ హృదయ పూర్వకంగా దానితోనే నిలబడ్డారు. హిందూ ధర్మాన్ని తృజించాలనే తన ఉద్దేశాన్ని ప్రకటించారు. కానీ ఆ పనిచేయడానికి 21 సంవత్సరాలు వేచి ఉన్నారు. ఆయన కాంగ్రెస్‌కు బద్ధ శత్రువు, అయినప్పటికీ కాంగ్రెస్ మంత్రివర్గంలో చేరారు. ఆయన పుట్టుకతోనే విశాల హృదయం గల వ్యక్తి అని, ఈ దేశానికి భాగ్యవశాత్తూ లభించిన వ్యక్తి అని మనం చెప్పవచ్చు. ఆయన అద్భుతమైన జీవితం అనేక విషయాలకు నిదర్శనం. అటువంటి అసాధారణ వ్యక్తులలో విధి నిర్దేశించిన ఒకటి లేదా రెండు గుణాలు ఉంటాయని మనం మొదట్లోనే పేర్కొన్నాం. ఇతర ప్రతిభలు గుప్తంగానే ఉండిపోతాయి.

చివరిగా, మనం డాక్టర్ అంబేద్కర్‌ను సాపేక్షతా దృక్పథంతో, సమగ్రంగా అర్థం చేసుకోవాలని నా అభ్యర్థన. ఆయన సాధించాలని సంకల్పించిన లక్ష్యం నెరవేరలేదు. ప్రతి గ్రామంలోని పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. ఆర్థిక, సామాజిక, లేదా రాజకీయమైనా సరే, సామాజిక అసమానతలను మనం వీలైనంత త్వరగా పరిష్కరించాలి. యావత్ దేశం ఐక్యంగా నిలబడాలి. దేశానికి ఉజ్వల భవిష్యత్తు ఉండాలి. దేశం తన పూర్వ వైభవాన్ని తిరిగి పొందాలి. మన సమాజం ఒకే స్ఫూర్తితో, ఒకే ఆలోచనతో, ఒకే ఆత్మగౌరవంతో ఐక్యంగా నిలవాలి. మనం వేద ఋషుల దార్శనికతతో, మహాత్మా బుద్ధుని విశ్వాసాలతో దృఢంగా నిలబడి, ప్రపంచంలో మనకంటూ ఒక ఉన్నత స్థానాన్ని ఏర్పరచుకోవాలి. ఇది డాక్టర్ అంబేద్కర్ ఆకాంక్ష కూడా.

– 'పాంచజన్య' నుంచి

నక్సలిజం నుంచి

నక్సలిజం నుంచి దేశానికి విముక్తి లభించిందని హోం మంత్రి అమిత్ షా లోక్‌సభలో ప్రకటించారు. మార్చి 31తో దేశానికి వామపక్ష తీవ్రవాదం నుంచి విముక్తి కలిగించాలనే తన లక్ష్యాన్ని ఆయన నెరవేర్చినట్టు కనిపిస్తోంది. చాలా కాలం క్రితమే ఈ లక్ష్యాన్ని నిర్దేశించుకున్న అమిత్ షా అప్పటి నుంచి దేశంలోని అడవులు, కీకారణ్యాలలో మావోయిస్టుల కోసం జల్లెడపట్టారు. భద్రతా దళాలు మూడేళ్ల పాటు నక్సలైట్ల కోసం వేటాడాయి. భద్రతాదళాల తనిఖీలు, సోదాలు, అన్వేషణలతో తీవ్రస్థాయిలో ఒత్తిడికి గురయిన మావోయిస్టులు క్రమక్రమంగా లొంగిపోవడం, ఆయుధాలు వదిలిపెట్టి జనజీవన స్రవంతిలో కలిసిపోవడం ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా 4,839 మంది పోలీస్ స్టేషన్లలోనూ, పోలీసు అధికారుల ఎదుట లొంగిపోయారు. పోలీసులు, భద్రతాదళాల గాలింపు చర్యల్లో 2,218 మంది అరెస్టయ్యారు. ఎన్‌కౌంటర్లలో 706 మంది ప్రాణాలు కోల్పోయారు.

రెండు జిల్లాల్లో మాత్రం చెదురుమదురుగా ఉన్నారు తప్ప మిగిలిన 183 జిల్లాల నుంచి మావోయిస్టుల ఉనికిని పూర్తిగా భూస్థాపితం చేశామని జరిగిందని అమిత్ షా ప్రకటించారు. భద్రతాదళాల ఒత్తిడి కారణంగా నక్సలిజం విస్తరించడం, బలపడడం, కొత్తవారు చేరడం అన్నది ఏనాడో ఆగిపోయింది. మావోయిస్టులు కూడా ఈ మధ్య కాలంలో ఎక్కడా హింసా విధ్వంసకాండలకు పాల్పడిన దాఖలాలు లేవు. నిజానికి, దేశంలో రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా వారి ప్రభావం చాలావరకు తగ్గిపోయింది. రాజకీయంగా గానీ, సామాజికంగా గానీ నక్సలిజం వల్ల దేశానికి ముప్పు కలిగే అవకాశాలు కూడా బాగా సన్నగిలాయి. దేశంలో ఉత్తర, తూర్పు, ఈశాన్య ప్రాంతాల్లో, అభివృద్ధికి ఏమాత్రం అవకాశం లేదని భావించిన ప్రాంతాల్లో కూడా అభివృద్ధి చోటు చేసుకుంటున్నందువల్ల నక్సలిజం విస్తరించడానికి, బలపడడానికి అవకాశం లేకుండా పోయింది.

మారిన పరిస్థితులు

కొద్ది దశాబ్దాల క్రితం ఉన్న దుర్భర, దయనీయ పరిస్థితులు ఇప్పుడు దేశంలో ఎక్కడా కనిపించడం లేదు. అప్పటి పేదరికం గానీ, సామాజిక అసమానతలు గానీ ఇప్పుడు కానరావడం లేదు. మావోయిస్టులు ఆధిపత్యం సాగించిన ప్రాంతాల్లో ప్రాథమిక సదుపాయాలు అభివృద్ధి చెందాయి. ఈ ప్రాంతాల మధ్య రాకపోకలు పెరిగాయి. రాష్ట్ర రాజధానులకు ప్రతి గ్రామమూ బాగా సన్నిహితమైంది. ప్రధానంగా అవసరమైనప్పుడు ప్రభుత్వాధికారులే కాక, భద్రతా దళాలు కూడా ఈ ప్రాంతాలకు తేలికగా వెళ్లడానికి అవకాశాలు పెరిగాయి. రవాణా సౌకర్యాలు బాగా అభివృద్ధి చెందాయి. ఇప్పుడు మావోయిస్టులు ఎదగడానికి, విస్తరించడానికి, బలోపేతం కావడానికి ఆర్థిక, సామాజిక పరిస్థితులు ఏమంత అనుకూలంగా లేవు. ఏ సమస్యకైనా ఉద్యమించాల్సినంత అవసరం ప్రజలకు కనిపించడం లేదు. నక్సలిజం పెరగడానికి అనువైన పరిస్థితులు ఇప్పుడు లేకపోవడం కూడా ఈ తీవ్రవాద ధోరణులు చాలావరకు అంతరించడానికి దోహదం చేసింది.

అమిత్ షా తన జాతీయ భద్రతా విధానంలో నక్సలిజాన్ని రూపుమాపడాన్ని కూడా ఒక ప్రధానాంశంగా చేసుకున్నారు. మావోయిస్టుల విషయంలో గతంలో మన్మోహన్‌సింగ్ నాయకత్వంలోని యు.పి.ఏ ప్రభుత్వం చేపట్టిన మెతక ధోరణి స్థానంలో ఆయన అత్యంత కఠినమైన విధానాన్ని చేపట్టారు. దేశాన్ని మావోయిస్టుల బెడద నుంచి విడిపించాలన్న ఏకైక లక్ష్యంతో ఆయన ప్రతి ఏటా విజయాలు, సాఫల్యాలను సాధించారు. మావో యిస్టుల అణచివేత విషయంలో ఆయన రాజీ లేని ధోరణిని అనుసరించారు. వాస్తవానికి మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం నక్సలిజాన్ని దేశ ఆంతరంగిక భద్రతకు అతి పెద్ద విఘాతంగా గుర్తించింది. ఆ తర్వాత 2009–2010లో ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో భద్రతా దళాలతో గాలింపు చర్యలు, దాడులు కూడా చేపట్టింది. అయితే,యు.పి.ఏలోని ఇతర భాగస్వామ్య పక్షాలు విమర్శించడం ప్రారంభించడంతో తన పట్టును చాలావరకు తగ్గించింది.

మెతక ధోరణికి స్వస్తి

నిజానికి, అప్పటికి నక్సలిజం లేదా మావోయిజం దేశవ్యాప్తంగా బాగా విస్తరించి ఉంది. బిహార్, జార్ఖండ్, చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని 185 జిల్లాల్లోని గిరిజన ప్రాంతాలు, అటవీ ప్రాంతాలు, ఖనిజ ప్రాంతాల్లో అది వ్యాపించి ఉంది. ఈ మావోయిస్టులను ఏరేయడంలో అప్పటి యు.పి.ఏ ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేసింది. మావోయిస్టుల మీద దాడులు జరపడంపై అనేక సందర్భాల్లో సంకోచించింది. ప్రాణాలకు, ప్రభుత్వ ఆస్తులకు, సామాన్య ప్రజానీకానికి ఏ మాత్రం నష్టం కలగకుండా ఉండాలనే దృక్పథంతో వ్యవహరించింది. అయితే, అమిత్ షా మాత్రం మావోయిస్టుల పట్ల రాజీ లేకుండా, కఠినాతికఠినంగా వ్యవహరించారు. ఆయన అనేక సందర్భాల్లో మావోయిస్టుల పట్ల తనకున్న అభిప్రాయాన్నీ, ప్రభుత్వం అనుసరించే విధానాన్ని బయటపెడుతూనే వచ్చారు. మావోయిస్టులు లొంగిపోవాలని కూడా అనేక సందర్భాలలో ఆయన పిలుపునిచ్చారు.

విముక్తి

కేంద్ర ప్రభుత్వం మావోయిస్టుల విషయంలో తన విధానాన్ని ప్రకటించిన తర్వాత ఆంత రంగిక భద్రత విషయంలో రాజీలేని పోరాటం సాగించింది. తీవ్రవాద నిరోధక చట్టాలను అత్యంత కఠినంగా అమలు చేసింది. అడవులు, చుట్టుపక్కల గ్రామాలను తీవ్రంగా గాలించింది. ప్రభుత్వం మావోయిస్టుల విషయంలో రాజ్యాంగ విరుద్ధమైన చర్యలు చేపడుతోందంటూ మానవ హక్కుల ఉద్యమ కారులు చేస్తున్న విమర్శలు, ఆరోపణలను అమిత్ షా అనేక పర్యాయాలు తిప్పికొట్టారు.

మావోయిస్టుల విషయంలో తమ ప్రభుత్వం ద్వంద్వ విధానాన్ని అనుసరిస్తున్నట్టు ఆయన ప్రకటించారు. తమంతట తాముగా లొంగిపోయిన మావోయిస్టు లతో వారి ఆకాంక్షలు, ఆశయాల మీద చర్చలు జరపడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, లొంగి పోనివారి పట్ల దయా దాక్షిణ్యాలతో వ్యవహరించే ప్రసక్తే లేదని ఆయన పదే పదే ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం నక్సలిజాన్ని కూకటి వేళ్లతో పెకలించివేయడానికి కృత నిశ్చయంతో ఉండడం, భారీ సంఖ్యలో భద్రతా దళాలను రంగంలోకి దించి మావోయిస్టులను తుదముట్టిస్తూ ఉండడం చూసి పౌర హక్కుల ఉద్యమకర్తలు, విద్యావేత్తలు, కొందరు పాత్రికేయులు ప్రభుత్వం మీద దుమ్మెత్తిపోయడం ప్రారంభించారు. మావోయిస్టులు సామాన్య ప్రజానీకం మీద దాడులు సాగించడాన్ని, వారిని హతమార్చడాన్ని, ప్రజల దగ్గర నుంచి బలవంతపు వసూళ్లు చేస్తుండడాన్ని ప్రభుత్వం ఆధారాలు, గణాంక వివరాలతో సహా చూపిం చింది. మానవ హక్కుల ఉద్యమ నాయకులు, విద్యావేత్తలకు ఈ సామాన్య ప్రజల హక్కుల సంగతి పట్టడం లేదని విమర్శించింది. సామాన్య ప్రజల హక్కులను పూర్తిగా విస్మరించి, నక్సలైట్ల హక్కుల కోసం మాత్రమే పోరాడే మేధావులు, విద్యావేత్తలు, జర్నలిస్టులు, పౌర హక్కుల ఉద్యమ నాయకులను ప్రభుత్వం అర్బన్ నక్సలైట్లుగా అభివర్ణించింది.

పటిష్ఠమైన వ్యూహం

కేంద్ర ప్రభుత్వం మావోయిస్టుల విషయంలో తన విధానాన్ని ప్రకటించిన తర్వాత అంతరంగిక భద్రత విషయంలో రాజీలేని పోరాటం సాగించింది. తీవ్రవాద నిరోధక చట్టాలను అత్యంత కఠినంగా అమలు చేసింది. అడవులు, చుట్టుపక్కల గ్రామాలను తీవ్రంగా గాలించింది. ప్రభుత్వం మావోయిస్టుల విషయంలో రాజ్యాంగ విరుద్ధమైన చర్యలు చేపడుతోందంటూ మానవ హక్కుల ఉద్యమకారులు చేస్తున్న విమర్శలు, ఆరోపణలను అమిత్ షా అనేక పర్యాయాలు తిప్పికొట్టారు. మావోయిస్టులు రాజ్యాంగానికి కట్టుబడి ఉండడం లేదన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మావోయిస్టులు తుపాకులు, మారణాయుధాలను ఉపయోగించి, ప్రజానీకాన్ని హతమార్చడం, భయభ్రాంతుల్ని చేయడం, బలవంతపు వసూళ్లకు పాల్పడడం, అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవడం వంటి చర్యలేవీ రాజ్యాంగబద్ధమైనవి కావనే విషయాన్ని విమర్శకులు గుర్తుంచుకోవాలని కూడా ఆయన పార్లమెంట్ సాక్షిగా అనేక పర్యాయాలు ప్రకటించారు. భద్రతా దళాల దాడుల్లో మావోయిస్టుల స్థావరాల్లో తుపాకులు, పేలుడు పదార్థాలు, ఇతర మారణాయుధాలు పెద్ద సంఖ్యలో పట్టుబడడం జరిగింది. ఈ ఆయుధాలను, పేలుడు పదార్థాలను భద్రతా దళాలు స్వాధీనం చేసుకోవడంతో మావోయిస్టులు నిరాయుధులు, నిస్సహాయులయ్యారు. కొన్ని రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు అత్యంత మారుమూల ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం ప్రారంభించడంతో మావోయిస్టుల మీద పేద గ్రామీణ ప్రాంతాలు ఆధార పడడం కూడా తగ్గిపోయిందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రతి గ్రామంలోనూ ఒక పాఠశాలను ఏర్పాటు చేస్తున్నామని, మారుమూల గ్రామాల్లో సైతం రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు అందజేస్తు న్నామని అమిత్ షా లోక్‌సభలో వెల్లడించారు.

సైద్ధాంతికంగా మావోయిస్టులకు పార్లమెంటరీ ప్రజాస్వామ్యమంటే పడదని, వారి ఉనికి కారణంగా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి కూడా అవకాశం ఉండడం లేదని అమిత్ షా అన్నారు. నిజానికి, సుస్థిరమైన పార్లమెంటరీ ప్రజాస్వామానికి అందరినీ కలుపుకుని పోగల అభివృద్ధి, సంక్షేమం, శాంతియుత పరిస్థితులు చాలా అవసరం. గ్రామాలు, ఖనిజ ప్రాంతాలు, అడవుల్లోని సహజ వనరులను ఉపయోగించి ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే, పేద ప్రజల అభివృద్ధిని పణంగా పెట్టి కేంద్ర ప్రభుత్వం వాణిజ్యవేత్తలు, పారిశ్రామికవేత్తలను పోషించడానికి, వారిని అభివృద్ధి చేయడానికి ప్రయత్నిస్తోందని మావోయిస్టు నాయకులే కాక, విద్యావేత్తలు, మేధావులు, పాత్రికేయులు, పౌర హక్కుల ఉద్యమ నాయకులు కూడా ఆరోపణలు సాగిస్తున్నారు. నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించినట్టు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం ఈ వర్గాల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవడం మంచిది. గిరిజనుల హక్కులను కాపాడడంతో పాటు, అడవులను సంరక్షించడం, సహజ వనరులను గ్రామీణ ప్రాంత పేదల అభివృద్ధికే ఎక్కువగా వినియోగించడం వంటివి చేపట్టాల్సి ఉంటుంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో సహజ వనరుల వినియోగంలో జవాబుదారీతనం ఉండేటట్టు కూడా చూడాలి. వామపక్ష తీవ్రవాదాన్ని అణచివేయడంలో విజయం సాధించిన ఘనత పూర్తిగా అమిత్ షాకే దక్కుతుంది. ఇక ఆయన ఇదివరకటి మావోయిస్టు ప్రాంతాల అభివృద్ధిలో రాజీలేని ధోరణిని అనుస రించడంతో పాటు, ఈ పోరాటంలో గాయపడిన వారికి సాంత్వన చేకూర్చాల్సిన అవసరం కూడా ఉంది.

జి.రాజశేఖర్
సీనియర్ జర్నలిస్ట్

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్తును అత్యున్నత శిఖరాలకు చేర్చే చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. పన్నెండేళ్ల సుదీర్ఘ నిరీక్షణ, సందిగ్ధతలకు శాశ్వత ముగింపు పలుకుతూ, అమరావతిని రాష్ట్ర ఏకైక రాజధానిగా నిర్ణయిస్తూ శాసనసభ చేసిన తీర్మానానికి పార్లమెంటు ఉభయసభలు ఆమోదముద్ర వేశాయి. ఈ చారిత్రక నిర్ణయం రాష్ట్ర ప్రగతి ప్రస్థానంలో ఒక సువర్ణాధ్యాయం. దీనివల్ల రాష్ట్రంలో సుస్థిర పరిపాలనకు అత్యంత బలమైన పునాది పడింది. ఇన్నాళ్లూ రాజధాని లేదనే లోటు తీరడమే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడులను ఆకర్షించేందుకు అనువైన, అత్యంత స్పష్టమైన, సురక్షితమైన వాతావరణం ఏర్పడింది.
పరిపాలనాపరమైన స్థిరత్వం కారణంగా దేశవిదేశాల పెట్టుబడిదారుల్లో అపారమైన నమ్మకం పెరిగి, ఆర్థిక స్వావలంబన దిశగా రాష్ట్రం వేగంగా అడుగులు వేసేందుకు మార్గం సుగమమైంది.

ఏ రాష్ట్రానికైనా రాజధాని నగరం కేవలం పరిపాలనా కేంద్రం మాత్రమే కాదు, ఆ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను నడిపించే ప్రధాన చోదక శక్తిగా పనిచేస్తుంది. పొరుగున ఉన్న కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల అద్భుతమైన ఆర్థిక ప్రగతిలో అక్కడి రాజధానులైన బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ మహానగరాలే కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఉదాహరణకు కర్ణాటక రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 40 శాతానికి పైగా ఆదాయం ఒక్క బెంగళూరు నుంచే వస్తోంది. వస్తు సేవల పన్ను, ఆదాయ పన్ను, ఆస్తి పన్ను తదితర మార్గాల ద్వారా సమకూరే ఆ సంపదను ఇతర ప్రాంతాల సంక్షేమానికి వెచ్చిస్తున్నారు. అదే స్ఫూర్తితో అమరావతిని సైతం రాష్ట్రానికి ఒక బలమైన ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దే బృహత్తర ప్రణాళిక అమలవుతోంది. 189 కి.మీ.ల

తురగా నాగభూషణం
సీనియర్ జర్నలిస్ట్

ఔటర్ రింగ్ రోడ్డుతో పాటు, అన్ని ప్రాంతాలకు దాదాపు సమాన దూరంలో, అద్భుతమైన జల, రోడ్డు, రైలు, వాయు మార్గాల అనుసంధానంతో అమరావతి రూపుదిద్దుకుంటోంది.

మౌలిక సదుపాయాలు - నిర్మాణ పనులు

తాజా పరిణామాలతో అమరావతి నిర్మాణ పనులకు అపూర్వమైన సార్థకత, స్థిరత్వం లభించాయి. రూ.58 వేల కోట్ల భారీ వ్యయంతో 94 అభివృద్ధి పనులకు భారత ప్రధానమంత్రి స్వయంగా శ్రీకారం చుట్టారు. ఇందులో రూ.49 వేల కోట్లతో అమరావతిలో చేపట్టే 74 పనులు ఉన్నాయి. శాసనసభ, సచివాలయం, ఉన్నత న్యాయస్థానం, ప్రభుత్వ శాఖల ప్రధాన కార్యాలయాల భవనాలతో పాటు న్యాయమూర్తులు, మంత్రులు, ప్రభుత్వ ఉద్యోగుల నివాస సముదాయాల నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. రాజధానిలో వరద నివారణ పనులు, జలాశయాల నిర్మాణం జరుగుతోంది. రూ.5,028 కోట్లతో తొమ్మిది కేంద్ర ప్రాజెక్టులు, రూ.3,620 కోట్లతో ఎనిమిది జాతీయ రహదారులు, మూడు రైల్వే ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు జరిగాయి.

నవ నగరాల భావన

అమరావతిని ప్రజారాజధానిగా నిర్మించ నున్నారు. అందుకోసం అన్ని ప్రాంతాలకు సమానదూరంలో ఉన్న విజయవాడ – గుంటూరు మధ్య ప్రాంతాన్ని ఎంచుకున్నారు. అమరావతిని 53,748 ఎకరాల్లో నిర్మించాలని భావించారు. భూసేకరణకు బదులు భూసమీకరణ ప్రక్రియను చేపట్టారు. ఈ ప్రాంతంలోని 29 గ్రామాలకు చెందిన 29,966 మంది రైతులు 34,400 ఎకరాల స్థలం ఇచ్చారు. రైతులిచ్చిన భూమిని అభివృద్ధి చేసి తిరిగి వారికి 25 శాతం ఇచ్చేలా ఒప్పందం జరిగింది. రైతులిచ్చిన భూమిని విక్రయించడం ద్వారా లక్ష కోట్లకు పైగా వచ్చే ఆదాయంతో రాజధానిని అభివృద్ధి చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఈ ప్రాంతానికి నీటి వసతి, రైలు, రోడ్డు, విమాన మార్గాల అనుసంధానత ఉంది. అన్ని ఆదాయ వర్గాలకు చెందిన ప్రజలూ సౌకర్యంగా జీవించేలా నగర నిర్మాణ ప్రణాళికలను సీఆర్డీఏ రూపొందించింది. అభివృద్ధిని కేవలం 217 చ.కి.మీ.ల రాజధాని ప్రాంతానికే పరిమితం చేయకుండా, 189 కి.మీ.ల పొడవునా నిర్మించే ఔటర్ రింగ్‌రోడ్డు చుట్టూ విస్తరించనున్నారు. 30 శాతం పచ్చదనం, జలాశయాలతో సరికొత్త హరిత నగరంగా నిర్మిస్తున్నారు. విశాలమైన రహదారులు, తాగునీరు, మురుగునీరు, వర్షపునీటి పారుదల వ్యవస్థలు, విద్యుత్, కేబుల్ వ్యవస్థలను భూగర్భంలోనే ఏర్పాటు చేస్తున్నారు. పర్యాటకం (నందిగామ), వారసత్వ సంపద (పాత అమరావతి), వ్యవసాయాధారిత (గుంటూరు), భారీ పరిశ్రమలు (సత్తెనపల్లి), తేలికపాటి పరిశ్రమలు (తెనాలి), ఎలక్ట్రానిక్స్ (గుడివాడ), విమానాశ్రయ అనుబంధ పరిశ్రమలు (గన్నవరం), బహుళార్థక రవాణా పార్కు (నూజివీడు), ఆహారోత్పత్తులు (నూడివీడు) ఆర్థిక రంగాలను మేళవిస్తూ నవ నగరాల భావనతో సమగ్ర ప్రణాళిక రూపొందించారు. నడిచి వెళ్లే దూరంలోనే నివాసాలు, కార్యాలయాలు ఉండేలా వసతులు కల్పిస్తున్నారు. నిర్మాణ దశలోనే ప్రభుత్వానికి సుమారు రూ.20 వేల కోట్ల ఆదాయం పన్నుల రూపంలో రానుంది. ఈ నగరం ప్రస్తుతం 20 వేల మందికి ఉపాధి లభిస్తుండగా, 35 ఏళ్లలో సుమారు 18 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని అంచనా.

రాష్ట్రవ్యాప్తంగా భారీ ప్రాజెక్టుల విస్తరణ రాజధానితో పాటు రాష్ట్రవ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పన వేగవంతమైంది. గోరంట్ల నుంచి హిందూపురం వరకు 34 కి.మీ.ల మేర రూ.809 కోట్ల రూపాయలతో నాలుగు వరుసల రహదారి విస్తరణ పనులకు కేంద్రం శ్రీకారం చుట్టింది. కృష్ణా జిల్లా నాగాయలంక మండలం గుల్లలమోద వద్ద రూ.1,459 కోట్లతో స్వదేశీ పరికరాలతో రాకెట్లను పరీక్షించే అధునాతన క్షిపణి ప్రయోగ పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర



దిక్సూచి అమరావతి

సెమి కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు పెరుగుతున్నాయి. రూ. 1,80,000 కోట్ల పెట్టుబడితో హరిత ఉదజని ప్రాజెక్టు పనులు శరవేగంగా సాగుతుండటంతో రాష్ట్రం హరిత ఇంధన కేంద్రంగా మారుతోంది.

ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రివర్గ నాయకత్వంలో జంట ఇంజిన్ల అభివృద్ధికి ఇది స్పష్టమైన నిదర్శనం. కేంద్ర ప్రభుత్వం అందిస్తోన్న లక్షన్నర కోట్ల రూపాయల ఆర్థిక సాయం ఈ ప్రగతికి ఎంతగానో దోహదపడుతోంది. రాజధాని నిర్మాణం, విశాఖలో సాంకేతిక కేంద్రాలు, రాయలసీమలో పారిశ్రామిక వాడలతో రాష్ట్రం సమగ్ర అభివృద్ధి సాధిస్తోంది. దశాబ్ద కాలం పాటు వెనుకబడిన రాష్ట్రం, ఇప్పుడు దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక శక్తిగా అవతరిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా అనేక సంస్థలు తరలి వస్తుండటంతో భవిష్యత్తులో దేశ ఆర్థిక వృద్ధిలో ఆంధ్రప్రదేశ్ సింహభాగం వహించడం ఖాయం.

ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రివర్గ నాయకత్వంలో జంట ఇంజిన్ల అభివృద్ధికి ఇది స్పష్టమైన నిదర్శనం. కేంద్ర ప్రభుత్వం అందిస్తోన్న లక్షన్నర కోట్ల రూపాయల ఆర్థిక సాయం ఈ ప్రగతికి ఎంతగానో దోహదపడుతోంది. రాజధాని నిర్మాణం, విశాఖలో సాంకేతిక కేంద్రాలు, రాయలసీమలో పారిశ్రామిక వాడలతో రాష్ట్రం సమగ్ర అభివృద్ధి సాధిస్తోంది.

జీవనాడి పోలవరం ప్రాజెక్టుతో పాటు విద్యాసంస్థలు, అత్యాధునిక ఆసుపత్రులు, విమానాశ్రయాలు, సముద్ర తీర ఓడరేవుల నిర్మాణం భారీ ఎత్తున రాష్ట్రంలో జరుగుతోంది. విశాఖపట్నం ఉక్కు కర్మాగారం అభివృద్ధికి రూ. 11,444 కోట్లు కేటాయించడం పారిశ్రామిక రంగానికి పెద్ద ఊరట.

సాంకేతిక విప్లవం - పారిశ్రామిక ప్రగతి

అమరావతే రాజధానిగా పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చొరవ, నిర్ణయాల ద్వారా సమాచార సాంకేతిక (ఐటీ) రంగంలో రాష్ట్రం పలు పెట్టుబడులను ఆకర్షిస్తోంది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో విశాఖపట్నం అంతర్జాతీయ అభివృద్ధి కేంద్రంగా, డేటా సెంటర్లకు నిలయంగా మారుతోంది. ఆసియాలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్‌ను విశాఖలో ఏర్పాటు చేసేందుకు గూగుల్ సంస్థ శంకుస్థాపన చేసింది. దీని ద్వారా ఐదేళ్లలో రూ. 1,25,000 పెట్టుబడులు రానున్నాయి. సముద్రగర్భ కేబుల్ ద్వారా 12 దేశాలకు అనుసంధానం కానున్న ఈ ప్రాజెక్టు వల్ల 1,88,000 మందికి ఉద్యోగాలు, ప్రభుత్వానికి ఏటా రూ. 10,000 కోట్ల ఆదాయం లభిస్తుందని అంచనా. భవిష్యత్ సాంకేతికతకు నిలయంగా అమరావతిలో 50 ఎకరాల విస్తీర్ణంలో క్వాంటం వ్యాలీ సముదాయాలు ఏర్పాటు కానున్నాయి. ఇప్పటికే 15 దిగ్గజ సంస్థలు ఇక్కడ తమ కార్యాలయాలను స్థాపించేందుకు అంగీకారం తెలిపాయి. మరోవైపు రాయలసీమ ప్రాంతంలో పారిశ్రామిక ప్రగతి పరుగులు పెడుతోంది. తిరుపతి, కర్నూలు జిల్లాల్లో అధునాతన

అస్థిరతకు, వితండవాదానికి పరాకాష్ట జగన్ 'మావిగన్' ప్రతిపాదన

రాష్ట్ర రాజధాని విషయంలో జగన్ మోహన్ రెడ్డి అనుసరిస్తున్న తీరు అత్యంత విమర్శనాత్మకంగా, హాస్యాస్పదంగా మారింది. తొలుత శాసనసభ సాక్షిగా అమరావతికి సంపూర్ణ మద్దతు పలికిన ఆయన, అధికారంలోకి రాగానే మాట మార్చి మూడు రాజధానుల రాగం అందుకున్నారు. ఆ తప్పుల వల్ల ఏ ఒక్క ప్రాంతాన్నీ అభివృద్ధి చేయకపోగా, ఏకైక రాజధానిగా ఎదుగుతున్న అమరావతిని దెబ్బతీసే ప్రయత్నం చేశారు. దీనితో విసిగిపోయిన అన్ని ప్రాంతాల ప్రజలు ఎన్నికల్లో ఆయనను ఘోరంగా తిరస్కరించారు. తాజాగా పార్లమెంటు ఉభయసభలు అమరావతికి చట్టబద్ధత కల్పించిన శుభ తరుణంలో, ఆయన 'మావిగన్' పేరిట మచిలీపట్నం, విజయవాడ, గుంటూరులను కలుపుతూ ఏకంగా 110 కి.మీ.ల పరిధిలో కొత్త రాజధానిని ప్రతిపాదించడం ఆయన రాజకీయ అస్థిరతకు నిదర్శనం. అమరావతి వ్యయంలో కేవలం 10 శాతంతోనే ఈ భారీ నగరాన్ని నిర్మించవచ్చని చెప్పడం పూర్తిగా అవాస్తవం. అసలు గుంటూరు నుంచి మచిలీపట్నం వరకు ఇంత భారీ విస్తీర్ణంలో రాజధాని నిర్మాణం కోసం రైతులు ఉచితంగా భూములు ఎందుకు ఇస్తారన్న కనీస వాస్తవాన్ని ఆయన విస్మరించారు. ఆచరణ సాధ్యం కాని ఇలాంటి పూటకో ప్రకటనలతో రాష్ట్ర భవిష్యత్తును గందరగోళంలోకి నెట్టడం సరికాదు. తన ఐదేళ్ల పాలనలో ఒక్క భవనం నిర్మించలేని నాయకుడు, ఇప్పుడు కొత్తగా ఊహాజనిత నగరాలను తెరపైకి తేవడం తన వైఫల్యాలను కప్పిపుచ్చు కోవడానికే తప్ప రాష్ట్ర అభివృద్ధిపై ఆయనకు ఏమాత్రం చిత్తశుద్ధి లేదని ఈ తాజా వింత ప్రతిపాదన స్పష్టం చేస్తోంది. ★



ధాన్య కటక



ప్రొ. ముదిగొండ శివప్రసాద్
విశ్రాంత ఆచార్యుడు

కామధేనువు కల్పవృక్షం
దేవతల భూమి
అమరావతి, ఆయుష్మతి
తేజోవతి మహానుతి
శాతవాహన ఇక్ష్వాకు, కాదంబ కందార
చోళ, పల్లవ కాకతీయుల రాజధాని
నాడు వాసిరెడ్డి వెంకటాద్రి పాదముద్ర
నేడు అధికార రాజముద్ర
అదిగో ఉద్దండరాయుడు
అక్కడే ఆంధ్రమహావిష్ణువు
కొండపల్లి బొమ్మ మా అమ్మ దుర్గమ్మ
క్రౌంచామరేంద్రార్థాంగి అమ్మలగన్న అమ్మ
నాగార్జునుని కాళ్లు కడిగిన కణ్ణబెణ్ణ
మనసంతా వెన్న
అదిగో ప్రతీపాల స్తూపం
శాంతి దీపం
తాడికొండ కవితల కలకండ
ధాన్యకటకం
ధనధాన్య ధన్యం మాన్యం
ఈ గుంటూరు గోంగూర
ఆయుర్వేద ప్రాణాధార కాంతిధార
అధర్మజగత్తుకు పరాభవం
అభ్యుదయానికి చంద్రోదయం
ఈ వాసంతి హసంతి విశ్వశాంతి
నూజివీడు రసాలిని
చిత్రరతుని మృణాళిని
రాచిలుకల చీరెకట్టి
అరుదెంచిందొక మధువని
ఈ సీతారామ భృంగ రాష్ట్రగానం
మా ప్రాణం అభిమానం
కుచేలపురీ లాస్యం
తెనాలి హాస్యం
ఒంగోలు పంచాస్యం
ఈ వాసంత హసంతి విశ్వశాంతి
ఈ యానం మహాయానం
సుమేధ్యగానం - ధ్యానం
అటు విజయనగరి నుండి
ఇటు నగరివరకు
విజయమే విజయం
దిగ్విజయం
వంశధార నాగావళి గోదావరి మహేంద్ర
కణ్ణబెణ్ణ మలఘ్ను పినాకిని సువర్ణ
తుంగభద్ర బాహుద గుండ్లమ్మ
కండలేరు నాగులేరు పాపనాశినీ ప్రవంతి
తాగునీటి సాగునీటి వాగులు సెలయేరులు
ప్రోలయ నాయకుని వరం
పోలవరం కాపవరం
జయంజయం దిగ్విజయం
ముక్తధాత్రి విశ్వకీర్తి

(ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని
కేంద్ర ప్రభుత్వం అధికారికంగా
ప్రకటించిన సందర్భంగా)



Dr. G. Suryanarayana Raju
M.S. Mch, FRCS, FUICC
Chief of Surgical Oncology
40+ Years of Experience

Dr. D. Raghunadharao
MD, DM, FRCP (London), FACP
Chief of Medical Oncology
40+ Years of Experience

Asvins Specialty Hospitals

6-3-903/A&B, Raj Bhavan Road, Somajiguda, Hyderabad, Telangana 500082.
www.asvinshospitals.com Ph: +91 94404 45775

40+ Years of Oncology Expertise
Over 7,00,000 Patients Treated
75,000 Successful Surgeries
99% Success Rate

ASVINS
Specialty Hospitals
Care•Cure•Comfort

SERVICES

SURGICAL SPECIALTIES:
- Anaesthesiology
- Breast Surgery
- Bone & Soft Tissue Tumors
- Gynaecology & Gynaec Oncology
- Head & Neck Oncology
- Minimal Access Surgery
- Neurosurgery
- Plastic & Reconstructive Surgery
- Surgical Oncology
- Thoracic Oncology
- Transplant Surgery
- Urology, Andrology & Endo Urology
- Vascular Surgery

MEDICAL SPECIALTIES:
- Bone Marrow Transplant
- Cardiology
- Chest Medicine
- Endocrinology
- Gastroenterology
- Hematology & Hemato Oncology
- Internal Medicine
- Intensive Care
- Medical Genetics
- Medical Oncology
- Nephrology & Dialysis
- Neurology
- Orthopaedic & Rheumatology

Book Your Consultation Now +91 9440445775 | **We do all types of Radical, Organ Sparing and Laparoscopic Surgeries**

We Expertise in Treating All Cancers | **Expert Treatment At Affordable Prices**

SCAN ME

అశ్విన్ క్యాన్సర్ కేర్, భీమవరంలో

అశ్విన్స్
స్పెషలిటీ హాస్పిటల్స్

ప్రముఖ సర్జికల్ ఆంకాలజిస్ట్
డా॥ జి. సూర్యనారాయణ రాజు
M.S. MCh, FRCS, FUICC సర్జికల్ ఆంకాలజీ అధినేత
వ్యవస్థాపక డైరెక్టర్, అశ్విన్స్ స్పెషలిటీ హాస్పిటల్స్
మాజీ సభ్యుడు, MARB, NMC, న్యూఢిల్లీ
మాజీ సహచరుడు. రీసెర్చ్ & ప్రాజెక్ట్స్ డీన్, రిజిస్ట్రార్, ప్రొఫెసర్
మరియు సర్జికల్ ఆంకాలజీ వ్యవస్థాపక అధిపతి, నిమ్స్

ప్రముఖ గైనో ఆంకాలజిస్ట్
డా॥ రమణి GSV
MS, OBG
కన్సల్టెంట్ గైనకాలజీ, గైనక్ ఆంకాలజీ &
ప్రివెంటివ్ ఆంకాలజీ

ప్రతి నెల మొదటి ఆదివారం

ప్రముఖ హేమాటో ఆంకాలజిస్ట్
డా॥ గెంటే. విక్రమ్ కుమార్
MBBS, MD ఇమ్యునో- హెమటాలజీ మరియు రక్త మార్పిడి (JIPMER),
పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ ఇన్ క్లినికల్ హెమటాలజీ (CMC వెల్లూర్)
కన్సల్టెంట్ హెమటాలజీ మరియు
హెమటో- ఆంకాలజీ

ప్రతి నెల రెండవ ఆదివారం

ఈ దిగువ లక్షణాలు కలవారు డాక్టర్ గారిని సంప్రదించగలరు.

తెల్ల బట్ట, అధిక నెలసరి, PCOS లక్షణాలు, గర్భసంచి కాన్సర్, అండాశయ కాన్సర్, అండాశయపు గడ్డలు & నీటి గడ్డలు, గర్భ సంచి కణితులు, గర్భాశయ క్యాన్సర్ వ్యాక్సిన్ (HPV) రుతువిరతి తర్వాత సమస్యలు, వీర్యకాలిక దగ్గు, దగ్గేటప్పుడు రక్తం పడటం, మూత్రంలో రక్తం, ఆహారం మింగలేకపోవడం, నోటి పూతలు, మెడలో గడ్డలు, రొమ్ము లో గడ్డలు, వాంతులు, రక్తపు వాంతులు, కామెర్లు, వీర్యకాలిక అతిసారం, మలబద్ధకం, రక్తస్రావం, తెల్లబట్ట

బ్లడ్ కాన్సర్, అధిక రక్తస్రావం (Bleeding Problem), రక్తహీనత (Anaemia), ప్లేటెలెట్స్ కణాలు తగ్గడం, రక్త కణాలు సమస్య, రక్తం అధికంగా గడ్డకట్టడం, పసకలు (Jaundice), ప్లీహం పెద్దగా అవడం (Splenomegaly), బోన్ మ్యారో మార్పిడి

అభినవ్ డయగ్నోస్టిక్స్, జెపి రోడ్, ఆనంద బ్లడ్ బ్యాంకు దగ్గర, భీమవరం
08816 224338

ఉదయం
గం॥ 10:30ల నుండి
గం॥ 2:00ల వరకు

లోటస్ డయగ్నోస్టిక్స్, జెపి రోడ్, ఆనంద బ్లడ్ బ్యాంకు దగ్గర, భీమవరం
08816 230555

గమనిక పేషెంట్స్ తమ పాత రిపోర్టులతో సంప్రదించండి | అన్ని రకాల క్యాన్సర్ల కు చికిత్స మరియు సలహాలు ఇవ్వబడును.

అపాయింట్మెంట్ కొరకు అచ్చయ్య: **98858 45775** సీత: 9618161032

గణపతిదేవుడు

31

ముదిగొండ రాజ్యం, వరదగూడెంలో దెయ్యాన్ని వదిలించే మంత్ర తంత్ర పూజా కార్యక్రమం.

జరుగులప్ప ఇంటిచుట్టూ ఎవ్వరిని రానివ్వ కుండా కట్టడిచేసి వీధిదీపాలు వెలిగించకుండా ఆపించి, భర్తను మరువలేక ఏకధాటిగా ఏడుస్తున్న సోమిదమ్మ గదిలోకి ఎవరూ వెళ్లకుండా దిగ్బంధనం చేసి దాని బయట పూజా కార్యక్రమం ప్రారంభించాడు శంకణభట్టు.

ఊరు.. ఊరంతా ఓ ఉన్మాద, పైశాచిక ఆనందంతో నిశ్శబ్దంగా ఉంది. దెయ్యం-వదలిపోయే దృశ్యం గ్రామంలో ఉత్తములకు, పాపాలు చెయ్యని గొప్ప వారికి మాత్రమే కనిపిస్తుందని ఓ గొప్ప నమ్మకం. దాని కోసం అందరూ వారి వారి ఇళ్లల్లో మేల్కొని చెవులు రిక్కించి సోమిదమ్మ ఏడుపు అంటే...ఆమెను ఆవహించిన దెయ్యం ఏడుపులను.. అంటే ఆమెను వదలిపోయేముందు ఆ దెయ్యం పెట్టే పెడబొబ్బలను వినడానికి సిద్ధంగా ఉన్నారు.

మంత్రోచ్చారణ పెద్దగొంతుతో ప్రారంభించాడు శంకణభట్టు.. ఊరు ఊరంతా భయభక్తులతో చేతులు జోడించి కళ్లు మూసుకుని ఆయన మంత్రాలను వింటున్నారు. అదొక గంటసేపు సాగింది.

హఠాత్తుగా మౌనం!! అంటే భట్టుగారు ఆమె ఉన్న గదిలోకి ప్రవేశించాడన్నమాట.

కాసేపు పెనుగులాట.. మరి కాసేపటి తర్వాత..

మత్తి భానుమూర్తి

ఆమె అరుపులు మొదలయ్యాయి. ఆమె అరుపులతో పాటు శంకణభట్టు అరుపులు కూడా వినవస్తున్నాయి. మరి కాసేపటికి ఆమె అరుపుల కంటే శంకణభట్టు అరుపులు పెరిగాయి.. అవి పెడబొబ్బలుగా ఊరివారికి తెలుస్తున్నాయి.

అంతా సంభ్రమం!!

ఇదేవిటి.. సోమిదమ్మ నోటి నుండి వినాల్సిన ఏడుపులు పెడబొబ్బలు.. భూతప్రేతపిశాచి శాఖిణీ ఢాకిణీ లాంటి మహాశక్తులను వశపరచుకున్న మహాపూజారి శంకణభట్టు నోటి నుండి వినరావడం ఊరందరికి అర్థం కావడం లేదు.

అప్పుడే జరుగులప్ప ఇంటి చుట్టూ పక్కల వాళ్లు మరికొన్ని ఊహాతీతమైన దృశ్యాలను చూశారు. ఇంటి చుట్టూ మొహరించి ఎవ్వరిని ఆ దరిదాపులకు రానివ్వని భట్టు శిష్యులపై ఎవరో మరో బృందం దాడి చేసింది. ఎవరో ఆ చీకట్లో తెలియడం లేదు కాని ఆ ఆగంతకుల బృందం దెబ్బలకు పూజల బృందం తట్టుకోలేకపోతోంది. ఆ బలిష్టులు వాళ్లను తరిమితరిమి కొడుతున్నారు. ఆ పూజారులంతా పంచెలు ఎగగట్టి పరుగులు పెడుతున్నారు.

అప్పుడే లోపల ఎవరో చావగొడుతున్నట్లు శంకణభట్టు కూడా పిచ్చికేకలు పెట్టసాగాడు. సోమిదమ్మ పెద్దగా అరుస్తూ భట్టును కొడుతున్నట్లు బయటివారు గుర్తించారు. గ్రామ పెద్దలంతా అయోమయంతో జరుగులప్ప గృహం వద్దకు పరుగు పరుగున వచ్చారు.

లోపలి నుంచి 'నాకు పట్టిన దెయ్యం నువ్వేరా..' అంటూ సోమిదమ్మ అరుపు వినిపిస్తోంది. 'అమ్మో అయ్యో..' అంటూ శంకణభట్టు ఏడవడం తెలుస్తోంది.

అంటే లోపల శంకణభట్టు సోమిదమ్మను వేపమండలతో కొడుతూ 'దెయ్యం మాయం' పూజా కార్యక్రమం నిర్వహించడంలేదు. సోమిదమ్మే అతనిని చావగొడుతున్నట్లు బయటఉన్నవారికి స్పష్టంగా తెలుస్తోంది. బయట ఆ ఆగంతకుల బృందం పూజా బృందాన్ని అప్పటికే లేవకుండా చావగొట్టి ఓ పక్కన కూర్చోబెట్టింది.

మరికాసేపటికి ఆ గృహం తలుపులు తెరుచుకున్నాయి.

పీనుగులాంటి శంకణభట్టును బయటకు ఈడ్చుకుంటూ తీసుకువచ్చి గ్రామ సమయశెట్టి కాళ్ల మీద పడేశాడొక ఆగంతకుడు.

అందరూ అతన్ని గుర్తించారు. అతడు డిండిమ!!

వేపమండలతో రొప్పుతూ బయటకు వచ్చింది సోమిదమ్మ. ఆమె స్వయంగా శంకణభట్టును చావగొట్టిందని.. లోపల ఆమెతో ఆ పని చేయించిన వాడు డిండిమ అని అందరికి అవగతమయ్యింది.

"దెయ్యం పట్టడం అనేది ఓ భ్రమ. ఎవ్వరూ అలాంటి పని చెయ్యవద్దు అని నేను ఊరూరా తిరిగి చెబుతూనే ఉన్నాను. కాని శంకణభట్టు లాంటి మూర్ఖులు చేస్తూనే ఉన్నారు. అది తప్పు అని తెలిసిన పెద్దలు కూడా.. 'ఏమో దెయ్యాలు నిజమేనేమో.. దెయ్యం నన్ను పట్టుకుంటే ఎలా..' అని ఆలోచిస్తూ ఇలాంటి దుర్మార్గాలను ప్రోత్సహిస్తున్నారు. ఇది దారుణం.. ఇది అన్యాయం. తోడపుట్టిన అక్కా చెల్లెళ్లను ఇలాగే హింసించి చంపుకుంటున్నాం. ఇకనైనా మారాలి. ఇలాంటివి మా గ్రామంలో ఇకపై జరగనివ్వమని అందరూ ప్రమాణం చెయ్యండి.." ఆయన కంఠం దృఢంగా పలికింది.

అందరూ అతని మాటలకు స్పందించి ప్రమాణం చేశారు.

ఈ వార్త గణపతిదేవుని చేరింది.. ఉలిక్కిపడ్డాడు గణపతిదేవుడు.

"ఇలాంటివి జరగకుండా మత సైనికులను కూడా ఏర్పాటు చేయమన్నాను. ఎలా జరిగింది?!" సాలోచనగా అడిగాడు సభా సహాయకుడు మయభట్టును.

"అన్ని రాజ్యాల్లో అన్ని నాడులలో కూడా ఏర్పాటు చేశాం ప్రభూ! కానీ కాని.. మతాచారాలలో దూకుడుగా ప్రవర్తించడానికి ఆ మత సైనికులు కూడా వెనుకాడుతున్నారట.. వేగుల సమాచారం.'

''కానీ కాని.. డిండిమ!! అతగాడేలా వెళ్లాడబ్బా?!"

మయభట్టు వద్దనుండి జవాబు రాలేదు. ఇద్దరి ముఖాలలో చిన్నపాటి విస్మయం.. ఓ చిటికెడు సంభ్రమంతో కూడిన విస్మయం..

కానీ గణపతిదేవునికి చేరని ఇలాంటి మరో సంఘటన వెలనాడు రాజ్యంలో చోటుచేసుకుంది. రాజధాని సనదప్రోలుకు దగ్గరగా ఉన్న నిడుబ్రోలు గ్రామంలో నిర్విఘ్నంగా జరిగింది. అక్కడికి డిండిమ వెళ్లలేదు. సమాచారం గణపతిదేవుని చేరలేదు.

అన్ని రంగాలలో గణపతిదేవుడు నిర్దేశించిన ఆదేశాలు ఖచ్చితంగా అమలు జరుగుతుండటం వల్ల కాకతీయ రాజ్యం, సామంత రాజ్యాల ప్రజలు పూర్తి

'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన

సంతోష సంబరాల్లో మునిగితేలుతూ తమ దెనందినాన్ని ప్రశాంతంగా నిర్వహించుకుంటున్నారు.

ఒక్క మత, ఆచార.. ముఖ్యంగా చాదస్తపు మంత్ర తంత్ర నమ్మకాల, క్రతువుల అంశాల్లో రాజాజ్ఞలు ధిక్కరించి మరీ!!

* * *

కాకతీయరాజ్యంలో.. గణపతిదేవుని కుటుంబంలో మరో గొప్ప సంఘటన జరిగింది.

అది రుద్రమాంబ వివాహం.

ఒకప్పుడు దక్షిణావర్తమంతా పాలించి ప్రభావితం చేసిన మహోన్నత చోళవంశం కాలగతిలో అనేకానేక చీలికలు పీలికలై చిన్నచిన్న ప్రాంతాలను పాలించే వారిగా మిగిలారు. వారిలో నిడుదవోలు రాజ్య పాలకుడు మహాదేవరాజు కుమారుడు ఇందు శేఖరుడు ప్రస్తుత జకపాలకుడు. అతడు గణపతి దేవునికి సామంతుడిగా.. మంచి మిత్రుడిగా ఉన్నాడు. ఈశాన్య రాజ్యాలపైకి దండెత్తడానికి కాకతీయ సైన్యం వెళ్లాలంటే ఇందుశేఖరుని సహాయం అవసరం. నిడుదవోలు పొలిమేరల్లోనే కాకతీయ సైన్యం స్కంధావారం ఏర్పాటు చేసుకుంటుంది.

ఇటీవల జరిగిన కొలని యుద్ధంలో రుద్రమదేవి మొదటిసారి పాల్గొంది. శత్రువులు ఆమెను చుట్టుముట్టి గాయపరచి బంధించబోతుండగా, ఆమెను రక్షించి నిడుదవోలు తీసుకెళ్లి అప్పటి కప్పుడు వైద్యం అందించి కాపాడినవాడు ఇందుశేఖరుని రెండవ కుమారుడు, నిడదవోలు యువరాజు వీరభద్రుడు.

ఇందుశేఖరుడు ఒకానొక రోజు వూర్తి సంప్రదాయబద్ధంగా పురోహిత బంధువర్గాన్ని వెంటపెట్టుకుని రాజలాంఛనాలతో అనుమకొండ వచ్చి తన కుమారుడు వీరభద్రునికి రుద్రమదేవిని ఇచ్చి వివాహం జరుపవలసిందిగా కోరాడు. అది ఇంటిల్లిపాదికి, రుద్రమాంబకు కూడా అంగీకారం కావడంతో ఆ వివాహం నిశ్చయమైంది.

మేనకోడలు వివాహానికి దేవగిరి పాలకుడు సింఘణదేవుడు..తమ్ముళ్లు, బంధువులు మొత్తం దేవగిరి నగరమే తరలివచ్చిందా అన్నట్లు వేలాది మందితో మందీమార్బలంతో అట్టహాసంగా వచ్చాడు. పెళ్లి వేడుకలు నిర్వహిస్తోన్న జాయసేనాపతి కూడా సింఘణదేవుని బంధుమిత్రపరివారాన్ని చూసి ఆశ్చర్య పోయాడు. దేవగిరి ఆస్థాన సంగీతకారుడు సారంగ దేవుడు, జాయసేనాపతి మంచి మిత్రులు. ఈ వివాహ సందర్భంగా గొప్ప సంగీత నాట్యగోష్టి, ప్రదర్శనలు జరిగాయి.

అప్పుడే పిడుగులాంటి వార్తను గణపతిదేవునికి తెలియజేశారు గూఢచారులు. 'అప్పటివరకు కన్నడరాజ్యాలను జయిస్తూ నైరుతిదిశగా జైత్రయాత్ర చేస్తున్న దేవగిరి సైన్యం హఠాత్తుగా తెలుగుచోడ రాజ్యలపై దాడిచేసి వెల్లూరు, పాకనాడు, కొణిదెల.. రాజ్యభాగాల లోపలికి చొచ్చుకు వచ్చింది' అన్నది గూఢచారుల సమాచారం.

దిగ్భ్రమకు లోనయ్యాడు గణపతిదేవుడు.

ఇక్కడ మేనకోడలు వివాహానికి హాజరయ్యి బంధుజనులతో సరససల్లాపాలతో కాలక్షేపంచేస్తూ అక్కడ తెలుగు చోడ రాజ్యాలపైకి సైనికదాడి చేయడం..??.. గణపతిదేవుడు కోపోద్రిక్తుడై పళ్లు పటపటా కొరికాడు.

జాయచోడునికి విషయం చెప్పి వివాహ వేడుకలకు ఎలాంటి అంతరాయం కలుగకూడదని ఆదేశించి వెనువెంటనే సైన్యాధ్యక్షులను సమావేశపరచాడు. అప్పుడే ఆయా రాజ్యపాలకులు గంగయదేవుడు, చక్రనారాయణుడు, నందపాలునితో పాటు నెల్లూరు పాలకుడు తిక్కభూపతి నుంచి యుద్ధ వర్తమానాలు అందాయి.

ప్రత్యేకించి తిక్కనామాత్యుని నుంచి కూడా....

''దొంగదెబ్బ తీశాడు సింఘణదేవుడు. ఇంతకాలం కన్నడరాజ్యాలను మరాఠిమయం చేస్తోన్న అతని అనుచరులు, వణిజశ్రేణులు, గ్రామ సమయ పెద్దలు ఈ దాడికి పాల్పడ్డారు. వీళ్లకు సింఘణ తరఫున ఓ మహిళ మంత్రాంగం నెరపుతోంది. చాలా కాలంగా ఆమే ఆయా సరిహద్దు నగరాల్లో, గ్రామాల్లో తిష్టవేసి గ్రామీణులను.. ముఖ్యంగా తెలుగువాళ్లను ఊచకోత కోస్తోందని నాకు తెలియవచ్చింది. కరవు కాలంలో కూడా ఆమె గంజి కేంద్రాలు తెరువనీయ లేదు సరికదా సరిహద్దులోని తెలుగువాళ్లు గంజి కోసం మన గ్రామాల్లోకి రాకుండా కంచెలు ఏర్పాటు చేయించింది. తక్షణ కర్తవ్యం ఆలోచించండి.'' అని సమాచారం అందింది.

మ్రాన్పడిపోయాడు గణపతిదేవుడు. రుద్రసేనాని, మల్యాలచౌండ లాంటి కురువృద్ధులు కూడా ఎవరో మహిళ ఇదంతా చేస్తోందని విని నోరు వెళ్లబెట్టారు.

పృథ్వీశెట్టి అశీకాలశెట్టి కూడా అప్పుడే గణపతి ఆదేశంపై అక్కడికి వచ్చాడు.

తీవ్రంగా చర్చ జరిగింది.

"సరే.. వాళ్లు ఎవరైనా.. మన సామంతుల భూభాగంలోకి చొచ్చుకు వస్తే అది మనకు అవమానమే. అందుకు బావమరిది అయినా.. వాడి బాబు అయినా.. క్షమించేది లేదు. కాని ఈసారి సంప్రదాయ యుద్ధం కాకుండా మరోలా ఆలోచించాలని మీ అందరిని కోరుతున్నాను. ఇటీవల అదే ప్రాంతంలో మన నాట్యవేత్త జాయచోడుడు గొప్ప మతయుద్ధం చేశాడు. శైవవైష్ణవులను తన కళారూపాల ద్వారా మనసు మార్చి ప్రాణనష్టం నివారించాడు. అలాంటిదే మరో ఆలోచన నాకు కలుగుతోంది. అది వాణిజ్య యుద్ధం. అది చేస్తే ఎలా ఉంటుందో యోచించి చెప్పండి.." అన్నాడు గణపతిదేవుడు.

"అంకాలా.. ఈ యుద్ధంలో నీదే ప్రముఖ పాత్ర.." అంటూ తన మనసులోని యుద్ధ తంత్రాన్ని వివరించాడు.

* * *

"దేవగిరి సర్వసైన్యాధ్యక్షులు పంపనార్యులకు నమస్సులు. నేను వెల్లూరు రాజ్య మహారాజు శ్రీశ్రీశ్రీ

గంగయదేవుల వారి సంధివిగ్రహిని. వారి సందేశం మీకు వినిపించడానికి వచ్చాను. మీరు ఎలాంటి యుద్ధసంప్రదాయాలు, చర్చలు.. లేకుండా మా రాజ్యభాగాలపై దాడి చేశారు. సరిహద్దులు దాటారు. ఇది క్షంతవ్యం కానీ నేరం. వెనువెంటనే మీరు మీ హద్దులలోకి వెళ్లవలసినదిగా కోరుతున్నాం. లేకుంటే జరిగే నష్టానికి మేము బాధ్యులం కాము.' ఇది మా మహారాజులు మీకు పంపిన సందేశం. మీ జవాబు తెలియజేయగలరు.."

"రాజ్యం వీరభోజ్యం. మేమేమీ తెలియక ఈ భూభాగం లోపలికి రాలేదు. మేము వచ్చాం అంటే జయించినట్లే. చేతనయితే మీ భూభాగాన్ని తీసుకోండి.. ఇందులో చర్చలేవిటి? సంధి విగ్రహితో పనేమిటి.."

దేవగిరి సర్వ సైన్యాధ్యక్షుడు పంపనార్యుడు ఇచ్చిన సమాధానం.

మొత్తం నాలుగు రాజ్యాల సైన్యం ఏకీకృతమైంది.

కొన్నిగంటల్లోనే సరిహద్దు వెంటనున్న తెలుగు చోడరాజ్యాల సైన్యాలన్నీ సరిహద్దు దాటి నిలబడ్డాయి. సింఘణ దేవుడు జయించిన హోయసల రాజ్యభాగం పొడవునా.. కింద నైరుతిలో కంపిలి నుండి పైన వాయవ్యంలో దేవగిరి వరకు.. సరిహద్దు వెంబడి మహారాజు చక్రనారాయణుడు నాయకత్వాన పాకనాడు రాజ్యసేనలు మొహరించాయి.

సరిహద్దు వెంబడి ఉన్న అన్ని గ్రామాలలో.. అన్ని పురాలలో తిష్ఠ వేసుకున్న మరాఠి వాణిజ్యశెట్టిల కోష్టాగారాలను గంగయదేవుని నాయకత్వాన వెల్లూరు సైన్యం దిగ్బంధనం చేసింది. అంటే ఇకపై సరిహద్దు ఆవల కోష్టాగారాల నుంచి సరుకులేవీ దేవగిరి సైన్యానికి చేరవు.

అప్పుడు ఆక్రమణకు వచ్చిన దేవగిరిసైన్యంపై నందరాయడు నాయకత్వాన కొణిదెన సైన్యం తీవ్ర దాడి ప్రారంభించింది. కొన్నిగంటలకు దేవగిరి సైన్యానికి ఎటువంటి సహాయం అందకుండా తెలుగు చోడ సైన్యాలు ఆవల వైపు పూర్తిగా దిగ్బంధనం చేసినట్లు గుర్తించింది.

అప్పుడిక నందరాయడు తన సైన్యాన్ని వెనక్కు యుద్ధ భూమినుండి స్కంధావారానికి పంపాడు.

దేవగిరి సైన్యంలో చచ్చినవారు చావగా మిగిలిన క్షతగాత్రులకు వైద్యం లభించడంలేదు. మందులు, వైద్యులు.. ఏమీ రావడం లేదు. రాత్రికి తిండి అందలేదు. అంతా ఏడుపులు పెడబొబ్బలు.. తిరిగి వెళదామంటే సరిహద్దు పొడవునా శత్రుసైన్యాలు మోహరించి ఉన్నాయి.

సర్వ సైన్యాధ్యక్షునికి వార్త వచ్చింది. మొత్తం అన్ని కోష్టాగారాలు శత్రుసైన్యాలు చుట్టుముట్టి స్వాధీనం చేసుకున్నాయని.

అక్కడ అనుమకొండలో రుద్రమాంబ వివాహ వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. సింఘణదేవుడు, గణపతిదేవుడు చెట్టాపట్టాలు వేసుకుని అన్ని సంప్రదాయసంబరాల్లో బంధు మిత్రులతో ఆడిపాడుతూ ముచ్చట్లలో మునిగితేలుతూ పరవశిస్తున్నారు.

ఇక్కడ యుద్ధభూమిలో పరోక్షయుద్ధం జరుగుతోంది.

దేవగిరి స్కంధావారంలో సైనికులు బయటకు పోకుండా పూర్తిగా దిగ్బంధనం చేసింది తెలుగుచోడ సైన్యం. బయటకు వచ్చిన ఓ సైనికుడిని ఖండఖండాలుగా నరికి లోపలికి విసిరేశారు. ఆకలి యుద్ధం చేస్తూ.. అంతా లోపల లోపలే.. కుళ్లిపోతున్నారు. దినమూ వందలమంది సైనికులు చచ్చిపోతున్నారు.

కరవుకాలంలో గంజి కేంద్రాలు కూడా పెట్టకుండా.. పక్క రాజ్యం వాళ్లు ఎక్కడికి వెళ్లనివ్వకుండా అడ్డుకున్న పాపం.. ఊరికే పోదు. ఇప్పుడు అనుభవంలోకి వస్తోంది.

ఇలా మరో మాసం దాటింది. మరికొన్ని వందల సైనికులు పీనుగులై పోయారు.

అక్కడ అనుమకొండలో రుద్రమాంబ వివాహ సంబరాలు ఘనంగా ముగిశాయి. ఆమె అత్తవారికి వెళ్లిపోయింది. మేనమామ సింఘణదేవుడు అపూర్వమైన కానుకలు మేనకోడలు రుద్రమాంబకు అందజేసి, ఆశీర్వదించి దేవగిరికి పయనమయ్యాడు. వివాహానికి హాజరైన బావమరిదికి వీడ్కోలు పలికాడు గణపతిదేవుడు. ఇద్దరూ కడుపులో కత్తులు పెట్టుకుని ఆప్యాయంగా కౌగలించుకుని ఆనందబాష్పాలతో వీడ్కోలు తీసుకున్నారు.

అక్కడ తిక్కభూపాలుడు, తిక్కనామాత్యుని యుద్ధతంత్రాలను తెలుగు చోడరాజులు, పృథ్వీశెట్టి అంకాల తు.చ. తప్పకుండా నిర్వహిస్తున్నారు.

సరిహద్దు ఆవల ఈవల ఓ విచిత్ర యుద్ధం జరుగుతోంది.

మధ్యలో తెలుగురాజ్యాలపైకి దండెత్తి వచ్చి కొంతభాగం ఆక్రమించుకున్న దేవగిరి సైన్యానికి తిరిగి తమ రాజ్యానికి వెళ్లడం ఎలాగో ఇప్పుడు తెలియడం లేదు. ఆక్రమించుకున్నచోట స్కంధావారం చుట్టూ శత్రుసైన్యం చుట్టు ముట్టి బయటకు వెళ్లనివ్వడం లేదు. బహిర్భూమికి వెళ్లాలని యత్నించిన ఓ సైనికుడిని ఖండఖండాలుగా నరికేసి కాకులకు గద్దలకు వేశారు. స్కంధావారం నిండా పెంటలు, మూత్రం .. వాసనా.. కంపు. దానితోనే కొందరు వాతులు చేసుకుని చనిపోయారు.

బయట సరిహద్దు ఆవల ప్రతి పట్టణంలోనూ ప్రముఖ వణిజశెట్టి కోష్టాగారాలు ఉన్నాయి. వాటికి కూడా చుట్టు ముట్టి.. కత్తి కాదు గదా.. కత్తికి సానపెట్టుకొనే రాయి కూడా బయటకు రాకుండా మూసేయించారు. ఇక పరిస్థితి తెలుసుకుని దూరం నుండి సహాయంగా వస్తోన్న సైన్యాన్ని.. ఆమద దూరంగానే ఎదుర్కుంటున్నాయి పాకనాడు సైనిక దళాలు.

నెల్లూరు నుంచి యుద్ధాన్ని సమన్వయపరుస్తున్న తిక్కభూపాలుడు, తిక్కనామాత్యుడు, అంకాలశెట్టి అనుమకొండకు వర్తమానం పంపారు.

"అన్ని మన అధీనంలోనే ఉన్నాయి. యుద్ధ తంత్రం రెండవ దశ నిర్వహించబోతున్నాము." అని.

* * *

కంపిలి నగరం, సిద్దప్పరుసుశెట్టి భవంతి..

అర్ధరాత్రి కావస్తోంది.

భవంతి పైఅంతర్వు నుంచి అంతా కలయ చూస్తోంది బాల కవ్వలాబాయి. దుర్గంధాన్ని భరించలేక కప్పుకున్న శాలువాతో ముక్కు మూసుకుని ఉంది.

ఆరునెలలుగా నగరమంతా యుద్ధ వాతావరణం. వీధులన్నీ భయంకరమైన వాసన. సైనికుల శవాలు బయట పడేయడంవల్ల అవి కుళ్లిన వాసన కలగలిసిన దారుణం. యుద్ధ వాతావరణం ఆ పరిసరాలను, సైన్యం విడిది చేసిన స్కంధావారాలను, ఆ చుట్టుప్రక్కల గ్రామాఇందులోలనే కాదు.. మొత్తంగా ఆ రాజ్యాన్నే అతలాకుతలం చేస్తోంది. ముఖ్యంగా కోష్టాగారాలను శత్రుసేనలు దిగ్బంధనం చేసి ఆక్రమించుకున్నాయి. కోష్టాగారాలను దిగ్బంధనం చేయడం ఎప్పుడూ వినలేదు. అంటే సైనికులను కత్తులతో కాక ఆకలితో అలమటించేలా చేసి చంపడమే.

ప్రస్తుతం శెట్టి భవంతిలో కూడా శెట్టి కుటుంబ సభ్యులు పదిమందితోపాటు దాదాపు వందమంది ఉద్యోగులు, పరిచారికలు, సేవకులు, బానిసలు ఉన్నారు. వారంతా కూడా ఆకలితో నకనకలాడుతున్నారు.

సరిహద్దు వెంబడి ఉన్న అన్ని పట్టణాలలోని కోష్టాగారాలను దిగ్బంధనం చేసిన వెల్లూరు పాలకుడు గంగయ అనే కేయూరదేవుడు కంపిలిలోనే

సరిహద్దు వెంబడి ఉన్న అన్ని గ్రామాలలో.. అన్ని పురాలలో తిష్ఠ వేసుకున్న మరాఠి వాణిజ్యశెట్టిల కోష్టాగారాలను గంగయదేవుని నాయకత్వాన వెల్లూరు సైన్యం దిగ్బంధనం చేసింది. అంటే ఇకపై సరిహద్దు ఆవల కోష్టాగారాల నుంచి సరుకులేవీ దేవగిరి సైన్యానికి చేరవు. అప్పుడు ఆక్రమణకు వచ్చిన దేవగిరిసైన్యంపై నందరాయడు నాయకత్వాన కొణిదెన సైన్యం తీవ్ర దాడి ప్రారంభించింది. కొన్నిగంటలకు దేవగిరి సైన్యానికి ఎటువంటి సహాయం అందకుండా తెలుగు చోడ సైన్యాలు ఆవల వైపు పూర్తిగా దిగ్బంధనం చేసినట్లు గుర్తించింది.

తిష్ఠవేసుకుని కూర్చున్నాడు.

'రాజ్యాల గొడవలు మాకు తెలియదు. పృథ్వీశెట్టి మాటను చప్పన్న రాజ్యాల్లో వణిజులు, వాణిజ్య శ్రేణులు జవదాటడానికి లేదు. ఆయన మాట దాటితే నాకు భవిష్యత్తు ఉండదు. ప్రపంచ వణిజులంతా నన్ను వర్తకం నుంచి బహిష్కరిస్తారు..'' అని భయపడుతూ కవ్వలాబాయితో చెప్పాడు సిద్దప్పరుసుశెట్టి.

మూగబోయింది కవ్వలాబాయి.

ఇప్పుడు సిద్దప్పరుసుశెట్టి కూడా ఆకలితో నకనకలాడుతున్నాడు.

రెండురోజులుగా ఒక ఆలోచన ఆమెను అతలాకుతలం చేస్తోంది. దగ్గరలో స్కంధావారంలో ఉన్న తన భర్త.. కేయూరను కలిసి బతిమిలాడితే కనీసం తినడానికయినా కొన్ని వస్తువులు లభిస్తాయి. యుద్ధానికి ముగింపు ఏవిటి? ఎప్పుడు? అని ఆతనిని నిలదీయవచ్చు. తనతో ఎన్నో ముచ్చట్లు చెప్పిన కేయూర తిరిగి రాజ్యానికి వెళ్లగానే ఆ కాకతీయుడి పాదాలు నాకుతున్నాడు కాబట్టి దూరంగానే ఉంచింది కాని ఇప్పుడు క్షుద్బాధ!!

తెలుగుచోడ రాజ్యాలను ఆక్రమించడానికి అనుజ్ఞ ఇచ్చిన సింఘణదేవుడు తెలివిగా కాకతీయుడి కూతురు వివాహానికి హాజరయ్యాడు. 'వాడు ఏడవలేక నవ్వే దృశ్యాన్ని తనివితీరా చూడాలని వెళుతున్నా'నని తనకు వర్తమానం పంపాడు. కానీ ఆ కాకతీయుడు తక్కువ తిన్నాడా! తమపైకి సైన్యంతో పాటు పృథ్వీ సెట్టిని కూడా ప్రయోగించాడు. వాడు వణిజశ్రేణి సభ్యులందరినీ నియంత్రించాడు. అన్ని కోష్టా గారాలను దిగ్బంధించి తిండికి లేకుండా చేశాడు.

కేయూరదేవుడు కంపిలి స్కంధావారంలోనే ఉన్నట్లు సమాచారముంది. అదొక్కటే తనకు ఆశాదీపం.

అప్పటికప్పుడు గుర్రాన్ని ఏర్పాటు చేసుకుని ఒంటరిగా శత్రుసైన్యం ఉన్న స్కంధావారం వైపు వెళ్లింది. దారిలో వీధులన్నీ మళ్లీ కరవు వచ్చినట్లు భయంకరంగా ఉన్నాయి. దారంతా శవాలు.. ఆవులు, గేదెలు, కుక్కలు, పిల్లులు, కోళ్లు, ఎలుకల కళేబరాలు.. దుర్గంధం..

మనసు చెబుతోంది.. అందుకు కారణం నువ్వే అంటోంది.

'నీ కక్షతో ఆ కాకతీయుడిని ఏమీ చేయలేక పోతున్నావు కానీ సామాన్య మానవులను చంపేస్తున్నావు కదా..'

కళ్లు మూసుకుని గుర్రపు వేగాన్ని పెంచింది. అప్పుడప్పుడు నడుము వద్ద దాచుకున్న చురకను తడుము తోంది చేతితో.

స్కంధావారం చేరింది. బహు విశాలంగా కనిపిస్తోంది అది.

దూరంగా గుర్రంపై మహిళ కనిపించగానే రక్షణ సైనికులు పరుగున వచ్చి గుర్రాన్ని పట్టి ఆపేశారు.

తెలుగుచోడ రాజ్యాలను ఆక్రమించడానికి అనుజ్ఞ ఇచ్చిన సింఘణదేవుడు తెలివిగా కాకతీయుడి కూతురు వివాహానికి హాజరయ్యాడు. 'వాడు ఏడవలేక నవ్వే దృశ్యాన్ని తనివితీరా చూడాలని వెళుతున్నా'నని తనకు వర్తమానం పంపాడు. కానీ ఆ కాకతీయుడు తక్కువ తిన్నాడా! తమపైకి సైన్యంతో పాటు పృథ్వీ సెట్టిని కూడా ప్రయోగించాడు. వాడు వణిజశ్రేణి సభ్యులందరినీ నియంత్రించాడు. అన్ని కోష్టా గారాలను దిగ్బంధించి తిండికి లేకుండా చేశాడు.
కేయూరదేవుడు కంపిలి స్కంధావారంలోనే ఉన్నట్లు సమాచారముంది. అదొక్కటే తనకు ఆశాదీపం.

మునుగు తీసి చెప్పింది, ''కేయూరా.. గంగయదేవుల ధర్మపత్ని కవ్వలాబాయి వచ్చిందని చెప్పండి వారికి..''

సందేహంగా చూస్తూనే లోపలికి ఒకరు పరుగుపెట్టగా ఇద్దరు ఆమె వద్దనే ఉన్నారు.

చివ్వున స్వయంగా వేగంగా బయటకు వచ్చాడు కేయూర.

''ఇదేవిటి మహారాణి.. ఇది యుద్ధభూమి. ఇక్కడికి ఎందుకు వచ్చారు..?'' అన్న ప్రశ్నకు జవాబివ్వకుండా లోపలికి వెళ్లసాగింది. తన ప్రత్యేక గోల్లెనకు దారి చూపాడు. లోపలికి వెళ్లగానే చటుక్కున తమకంగా అతనిని హత్తుకుంది కవ్వల. ఆ పరిష్వంగాన్ని మరింత దగ్గర చేసుకున్నాడు కేయూర.

కాసేపటికి ఆమెను విడివడి ఓ పల్యంకంపై కూర్చోబెట్టాడు.

''ఏవిటి.. చిక్కి శల్యమయ్యారు దేవిగారు?''

మూడు పూటలా మూడు ముద్దలు తిని మూడు వారాలయ్యింది అనలేదు కవ్వల. తమరి మీద బెంగతో.. అనబోయింది కానీ అనలేకపోయింది. ఆమె పరిస్థితి గ్రహించాడు కాబోలు చప్పట్లు కొట్టి బయటున్న సైనికుడిని పిలిచి పళ్లెరం నిండా వరి అన్నం, రెండుమూడు వ్యంజనాలతో తెప్పించి ఆమెకు అందించాడు.

''ముందు కాస్త ఎంగిలి పడు. తర్వాత మాట్లాడుకుందాం.''

అందుకుని గబగబా కలుపుకుని పెద్ద పెద్ద ముద్దలు చేసి గబగబా తిన్నది. మళ్లీ ముద్దలు కలుపుకుంటోంది.

అప్పుడే గొల్లెన వద్ద కలకలం.. ఎవరో ముఖ్యులు వచ్చినట్లు.

ఇద్దరూ ఆశ్చర్యంగా చెవులు రిక్కించి విన్నారు. సైనికులు గోలగోలగా పరుగులు పెడుతున్నారు.

''మహారాజు''..

''మండలేశ్వరులు''..

''మహామండలేశ్వరులు..''

కంగారుగా కదిలాడు కేయూర. నోటివద్దకెళ్లిన ముద్ద పళ్లేరంలో వదిలేసి చివ్వున లేచింది కవ్వల.

ఇద్దరికి ఒకటే భావన.. వచ్చినవాడు మహామండలేశ్వరుడు గణపతిదేవుడు కాదు కదా..

ఊహాతీతమైన పరిస్థితి! చటుక్కున పళ్లెరం క్రిందపెట్టి వెనక్కు గొల్లెన చాటుకు పరుగు తీసింది బాలకవ్వల.

సాక్షాతూ మన్మహామండలేశ్వరులు శ్రీశ్రీశ్రీ గణపతిదేవ మహారాజులుంగారు ఆ గోల్లెనలోకి అడుగుపెట్టారు.

బయట పూర్తిగా నిశ్శబ్దం. కాకతీయ మహా మండలేశ్వరుల అంగరక్షకులైన లెంకల బృందం మొత్తం స్కంధావారాన్ని స్వాధీనం చేసుకుంటారు. చీమ చిటుక్కుమనకూడదు.

కేయూర గందరగోళమైపోతున్నాడు. బిక్కచచ్చి పోయాడు. ఆయనను చంపడానికి ముప్పై ఏళ్లుగా పగబట్టి ఎదురుచూస్తున్న ఓ ఆడది ఇప్పుడు ఇక్కడే ఉంది.

బాలకవ్వల, గణపతిదేవుడు.. ముప్పై ఏళ్ల తర్వాత ఎదురు కాబోతున్నారు. ఆమె పగబట్టి ఉంది. ఆకలితో నకనకలాడుతోంది. తింటున్న పళ్లెరం అక్కడే ఉంది. ఆమె గొల్లెన వెనుక ఉంది. ఆయన అంగరక్షకులు అణువణువూ గాలిస్తారు. చీకటిలో ఉన్న ఆమె.. వాళ్లకు కనిపిస్తే ఖండఖండాలుగా నరికేస్తారు.

ఓ దేవుడా ఇప్పుడేవిటి దారి??

''ఊ.. ఏమి కేయూరా.. క్షమించాలి గంగయ దేవా. హహ్హహ్హా.. తమరిని ఏ పేరుతో సంబోధించాలి? హహాహ్హాహా..''

ఆయన ముందు కొచ్చి వంగి వంగి చేతులు కట్టుకుని నిలబడ్డాడు కేయూర.

యుద్ధ విజయాలు మహారాజులను స్వర్గంలో విహరింపజేస్తాయి. ఆ ఆనందపు విరాట్ విశ్వరూపం గణపతిదేవునిలో వీరవిహారం చేస్తోంది. శరీరమంతా విజయ భావనలతో కలిగిన చిరుకంపన.. మాటి మాటికి చేయి మీసం మీదికి వెళుతోంది.

''మహాప్రభూ..! అది.. అది తమరి ఇష్టం దేవా. మీరు నా దైవస్వరూపులు. మీరు ఏ పేరుతో పిలిచినా నాకు తన్మయమే దేవా..''

చెబుతున్నాడు కానీ ముఖంలో నవ్వులేదు.. రావడంలేదు. చాలా ఇబ్బంది పడుతున్నాడు కేయూర. అదేదో గుర్తించినట్లు ఆశ్చర్యంగా అన్నాడు గణపతిదేవుడు.

''ఏమి.. చమటలు..? ఏమైంది కేయూరా??''

అప్పుడే ఊహించనిది జరిగింది.

(సశేషం)

సంక్లిష్ట పరిణామాల

ప్రస్తుతం ఇరాన్-యుఎస్/ఇజ్రాయెల్ల మధ్య సంఘర్షణ ఇప్పుడు విధ్వంసకర ప్రాంతీయ యుద్ధం స్థాయికి చేరుకోవడం, హోర్ముజ్ జలసంధిని 48 గంటల్లోగా తెరవాలని లేకపోతే నరకం చూపిస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికలను ఇరాన్ బేఖాతరు చేయడం తాజా పరిణామాలు. గత 20 సంవత్సరాల్లో మొదటిసారి అమెరికాకు చెందిన ఎఫ్-15ఈ స్ట్రైక్ ఈగిల్, ఎ-10 వార్థగ్ యుద్ధ విమానాలను ఇరాన్ కూల్చేసి ప్రపంచాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తింది. ఈ రెండూ పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో ఇరాన్ భూభాగంలో కూల్చివేతకు గురయ్యాయి. విచిత్రమే మంటే ఈ యుద్ధ విమానంలో ఇద్దరు పైలెట్లు ప్యారాచూట్ ద్వారా సురక్షితంగా ఇరాన్ భూభాగంలో దిగినట్టు కనిపించింది. ఇజ్రాయెల్ బుషెహర్ అణుకేంద్రం సమీపంలో దాడులు జరిపింది. ఒకవేళ ఈ అణుకేంద్రంపై వైమానిక దాడులు జరిపితే రేడియేషన్ వెలువడే ప్రమాదం ఉన్నదని ఇరాన్ ఐక్యరాజ్య సమితిలో హెచ్చరించడం గమనార్హం.

ప్రస్తుతం హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ పూర్తి స్థాయిలో తన పట్టును కొన సాగిస్తున్న నేపథ్యంలో, బ్రెండ్ క్రూడ్ ధరలు బ్యారల్కు 114 డాలర్లకు, గ్యాసోలిన్ ధరలు గ్యాలన్కు 4డాలర్లకు పెరగడం గమనార్హం. మరోవైపు ఇప్పుడు ఇజ్రాయెల్ వ్యూహాత్మకంగా మధ్యప్రాచ్యంలోని ఇతర దేశాలతో ఇరాన్కు వ్యతిరేక కూటమిని ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తోంది. ఇక ఇరాన్ ప్రాక్సీలైన యెమెన్లోని హౌతీలు, లెబనాన్లోని హిజ్బుల్లా తీవ్రవాద గ్రూపులు మార్చి 28 నుంచి ఇరాన్కు మద్దతుగా యుద్ధంలోకి దిగిన తర్వాత పరిస్థితులు మరింత సంక్లిష్టంగా మారాయి. ఇప్పటివరకు యుఎస్/ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఏడువేల మంది ఇరాన్ ప్రజలు మరణించారు. లెబనాన్, ఇరాన్లనుంచి లక్షల సంఖ్యలో ప్రజలు ఇతర ప్రాంతాలకు తరలివెళ్లడం ఈ "అనవసర" యుద్ధం తెచ్చిన మరో విపరిణామం. నిర్దిష్ట లక్ష్యంగా తమ నేతలను ఇజ్రాయెల్/యుఎస్లు హతమారుస్తున్న నేపథ్యంలో, మధ్యప్రాచ్య దేశాల్లోని 18 అమెరికా టెక్ దిగ్గజ కంపెనీలపై దాడులు చేస్తామని ఐఆర్జీసీ హెచ్చరించింది. వీటిలో యాపిల్, గూగుల్, మెటా వంటి దిగ్గజ సంస్థలుండటం గమనార్హం.

పాకిస్తాన్కు శృంగభంగం

యుద్ధం నిలుపుచేసే యత్నాల్లో భాగంగా మధ్యవర్తిత్వం వహించడానికి పాకిస్తాన్, తుర్కియే, ఈజిప్టు దేశాల ప్రయత్నాలు పూర్తిగా విఫలమయ్యాయి. ముఖ్యంగా పాకిస్తాన్ మధ్యవర్తిత్వాన్ని తాము అంగీకరించేదిలేదని ఇరాన్, ఇజ్రాయెల్లు కుండబద్దలు కొట్టడంతో పాకిస్తాన్కు అంతర్జాతీయంగా తన స్థానమేంటో తెలిసొచ్చింది. యుద్ధంలో పాల్గొంటున్న ఇరాన్, ఇజ్రాయెల్లతో చర్చలు జరిపే పరిస్థితి లేనప్పుడు మధ్యవర్తిత్వం వహిస్తానంటూ ముందుకు రావడమే తప్పు. కానీ డోనాల్డ్ ట్రంప్ ఒత్తిడి మేరకు యు.ఎస్. తరపున ఒక దళారీలాగా వ్యవహరించింది తప్ప, మధ్యవర్తిత్వం వహించే స్థాయి పాకిస్తాన్కు లేదన్న సంగతి ఇరాన్, ఇజ్రాయెల్లు చెప్పకనే చెప్పాయి. విచిత్ర మేమంటే ఈ యుద్ధాన్ని ఆపగలిగే శక్తి కేవలం ఇండియాకు మాత్రమే ఉన్న దని, ప్రధాని నరేంద్రమోదీ తలచుకుంటే దీనికి చరమగీతం పాడగలరని ఇటు ఇరాన్, మరోవైపు ఇజ్రాయెల్ స్పష్టం చేయడం విశేషం. ఇరాన్, ఇజ్రాయెల్ల వైఖరి స్పష్టమైన నేపథ్యంలో చర్చలు జరపడానికి అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి. వాన్స్ ఇస్లామాబాద్ రాక నిలిచిపోయింది. ఇస్లామాబాద్ ఛానల్ విఫలం కావడంతో తుర్కియే, ఈజిప్టులు సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నాయి. మధ్యవర్తిత్వ చర్చలను ఇస్తాంబుల్ లేదా దోహా కేంద్రంగా జరిపేందుకు గల అవకాశాలపై అవి పరిశీలిస్తున్నాయి. ఇప్పుడు ఇరాన్లోని మౌలిక సదుపాయాలపై ఇజ్రాయెల్/యుఎస్లు దాడులు కేంద్రీకరిస్తున్న తాజా పరిణామాల నేపథ్యంలో, మధ్యవర్తిత్వం లేదా చర్చలకంటే పోరాటానికే ఇరుపక్షాలు ప్రాధాన్యమిస్తుండటం తాజా పరిణామం. విచిత్రమేమంటే మొదట్లో సౌదీ అరేబియా కూడా ఈ చర్చల్లో పాల్గొన్నప్పటికీ ఖతార్ వంటి దేశాలు వీటిని వ్యతిరేకించడం గమనార్హం.

పీకల్లోతు ఊబిలో ట్రంప్

ప్రస్తుతం ఈ యుద్ధంలో డోనాల్డ్ ట్రంప్ పీకల్లోతు కూరుకుపోయారు. ముందుకు పోలేక, వెనక్కు రాలేక, ఇంటా బయటా పెరిగిపోతున్న యుద్ధ వ్యతిరేక ఒత్తిళ్లను తట్టుకోలేక ఆయన ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. యుద్ధం వల్ల బిలియన్ల కొద్దీ డాలర్లు ఖర్చు ఒకవైపు, కొద్దిరోజుల్లోనే ఇరాన్ దారికొ స్తుందనుకున్న అంచనా తల్లక్రిందులు కావడం మరోవైపు ట్రంప్ యంత్రాంగానికి కునుకు లేకుండా చేస్తున్నది. పాకిస్తాన్ నుంచి ఇరాన్పై దాడులు జరపాలన్నది యుఎస్ ఉద్దేశం. పైకి మాత్రం పాకిస్తాన్ నాయకత్వం అటుపంటిదేమీ లేదని బుకాయిస్తున్నా, మారుతున్న భౌగోళిక రాజకీయ పరిణామాల నేపథ్యంలో

అమెరికాకు తలొగ్గక తప్పదు. ఒకవేళ అటువంటి అనుమతిని ఇచ్చినట్లయితే పాకిస్తాన్పై నేరుగా దాడులు చేస్తామని ఇరాన్ హెచ్చరించిన నేపథ్యంలో, అమెరికాకు నచ్చజెప్పే సామర్థ్యం లేని పాక్ నాయకత్వం పరిస్థితి కుడితిలో పడ్డట్టయింది. పాకిస్తాన్కు సైనిక హార్డ్వేర్, ఐదోతరం స్టెల్త్ విమానాలు, క్షిపణులు ఇస్తామని ఆశ చూపి, పాకిస్తానీ సైనిక, నేవీ స్థావరాలను ఉపయోగించుకోవాలన్న ఉద్దేశం ట్రంప్ యంత్రాంగంలో స్పష్టంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే అరేబియా సముద్రంలోని "పస్ని" వద్ద యు.ఎస్-నౌకా స్థావరాన్ని ఏర్పాటు చేసుకునేందుకు పాక్ సైనికాధికార్లు రహస్యంగా అంగీకారం తెలిపారన్న వార్తలు వచ్చాయి. గత జనవరిలో రెండు దేశాల సైన్యాలు "ఇన్స్పైర్డ్ గ్యాంబిట్-2026" పేరుతో

దిశగా ప్రపంచం!

విన్యాసాలు జరపడం కూడా బలపడుతున్న సంబంధాలకు నిదర్శనం. ఒకవేళ పాకిస్తాన్ భూభాగం నుంచి అమెరికా దాడులు చేసినట్లయితే దేశంలోని 30శాతం షియా ముస్లింలనుంచి తీవ్ర వ్యతిరేకత రావడం ఖాయ మని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

పాక్ ప్రేలాపనలు

ఒకవేళ ఇరాన్ తమపై దాడులు చేస్తే, తాము భారత్‌పై ప్రతిదాడులకు దిగుతామని హెచ్చరించడం పాకిస్తాన్ పైత్యం పరాకాష్టకు చేరిందనడానికి

నిదర్శనం. ప్రస్తుత మధ్యప్రాచ్య యుద్ధంలో ఏ సంబంధం లేని గల్ఫ్ దేశాలపై ఇరాన్ విరుచుకు పడుతుండటాన్ని చూసిన పాకిస్తాన్ ఈవిధమైన ప్రేలాపనలు చేయడం విచిత్రాల్లోకెల్లా విచిత్రం! భారత్ గల్ఫ్ దేశాల మాదిరి కాదన్న సంగతి, ఆపరేషన్ సిందూర్‌లో చావుదెబ్బతిన్న పాకిస్తాన్‌కు ఇంకా అర్థం కాకపోవడం ఆ దేశ పాలకుల మూర్ఖత్వానికి నిదర్శనం. ఒకవేళ అదే జరిగితే ఆపరేషన్ సిందూర్-2 యాక్టివేట్ అయి, ప్రపంచపటంలో పాకిస్తాన్ ఉనికే లేకుండా చేయగల సామర్థ్యం భారత్ సొంతం. తన మాట వినని భారత్‌పై కోపంతో రగిలిపోతున్న ట్రంప్, ఇప్పుడు పాకిస్తాన్ ద్వారా భారత్‌ను ఇబ్బంది పెట్టేందుకు రహస్య ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు వస్తున్న వార్తలు, పాకిస్తాన్ ప్రకటనను బలపరుస్తున్నాయి. అంటే భారత్‌పై ప్రతీకారం తీర్చుకోవడంలో పాక్‌కు వెన్నుదన్నుగా యుఎస్ ఉన్నదనేగా అర్థం. అటువంటి హామీ లేకుండా పాక్ ఇంత ధైర్యంగా ప్రకటనలు చేయదనేది నిష్టుర సత్యం.

ఇంధన సంక్షోభంపై భారత్ దృష్టి

మధ్యప్రాచ్య పరిణామాల వల్ల ఏర్పడిన ఇంధన సంక్షోభం నుంచి బయట పడే మార్గాలపై భారత ప్రభుత్వం ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తోంది. అంతేకాదు గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న 90లక్షల మంది భారతీయుల క్షేమంపై శ్రద్ధ వహిస్తోంది. తాము ముంబయి, ఢిల్లీ నగరాలను లక్ష్యంగా చేసుకొని బాంబు దాడులకు పాల్పడతామని పాకిస్తాన్ మాజీ దౌత్యవేత్త అబ్దుల్ బాసిత్ చేసిన వ్యాఖ్యలను రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్రంగా ఖండించడమే కాదు, ఒకవేళ అటు వంటి దుస్సాహసానికి పాల్పడితే ఈసారి పాకిస్తాన్ ఊహించని రీతిలో భారత్ ప్రతిస్పందన వుంటుందని తీవ్రంగా హెచ్చరించారు.

నిశ్శబ్దంగా ముందుకెళుతున్న ఇజ్రాయెల్

ఇజ్రాయెల్ తాను అనుకున్న లక్ష్యాలను నిశ్శబ్దంగా ఛేదిస్తూ వెళుతోంది. ఇప్పటివరకు ఇరాన్‌కు చెందిన 470 బాలిస్టిక్ మిస్సైల్ లాంచర్లను ధ్వంసం చేయడం ద్వారా దాని ప్రతీకార దాడుల శక్తిని 90% వరకు తగ్గించగలిగానని ఇజ్రాయెల్ చెబుతోంది. అంతేకాదు ఇరాన్‌కు చెందిన 90% నేవీని కూడా దెబ్బతీసానని స్పష్టం చేస్తున్నది. ఇరాన్‌కు చెందిన వైమానిక రక్షణ వ్యవస్థలను ధ్వంసం చేయడంవల్ల ప్రస్తుతం ఇజ్రాయెల్ విమానాలు స్వేచ్ఛగా ఇరాన్ భూభాగంలో ఎగురుతున్నాయి. ఇదే సమయంలో "రింగ్ ఆఫ్ ఫైర్" (ఇరాన్ ప్రాక్సీలు) ధ్వంసం చేసే ప్రక్రియలో భాగంగా దక్షిణ లెబనాన్‌లోని కొన్ని పరిమిత ప్రాంతాలపై ఇజ్రాయెల్ దాడులు నిర్వహించింది. ఈ ప్రాంతంలోని హిజ్‌బుల్లా సైనిక స్థావరాలను పూర్తిగా ధ్వంసం చేసి లిటానీ నదివరకు సెక్యూరిటీ జోన్‌ను ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ఇజ్రాయెల్ తన సైనిక కార్యకలాపాలను నిర్వహిస్తోంది. ఇదే సమయంలో ఇరాన్‌కు చెందిన పౌర, పారిశ్రామిక ప్రాంతాలపై దాడులను ముమ్మరం చేసింది. మషహర్ పెట్రోకెమికల్ జోన్ పై దాడులు జరపడం ఇందులో భాగమే. ఇదే సమయంలోఇరాన్ ప్రజలు తిరుగుబాటు చేయాలని డిజిటల్ వేదికల ద్వారా యు.ఎస్. ప్రచారం చేస్తోంది.

విజేత ఎవరు?

ఈ యుద్ధం ఇప్పట్లో ముగిసేలా లేదు. ఒకవేళ యుద్ధమే ముగిసిపోతే, నిశ్శబ్ద విజేతలుగా చైనా, రష్యాలు నిలుస్తాయి. చైనా ఇరాన్‌లో ధ్వంసమైన మౌలిక సదుపాయాలను వృద్ధి చేసే ప్రక్రియలో భాగంగా పనిలో పనిగా తన బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్‌ను కూడా ప్రారంభిస్తుంది. ఒక్క బుల్లెట్ కూడా పేల్చకుండా దీర్ఘకాలిక ఇంధన కాంట్రాక్టు ఒప్పందాలు కుదుర్చుకొని, రాజకీయంగా తన పలుకుబడిని మరింత పెంచుకుంటుంది. మధ్యప్రాచ్య యుద్ధం కారణంగా యు.ఎస్. వనరులన్నీ దెబ్బతిన్న నేపథ్యంలో ఉక్రెయిన్‌పై దృష్టి కేంద్రీకరించడం సాధ్యంకాదు. ఈ నేపథ్యంలో రష్యా తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంటుంది. ఇప్పటికే హోర్ముజ్ జలసంధి వద్ద గందరగోళ పరిస్థితులు సర్దుమణిగి, గల్ఫ్ దేశాల్లో ధ్వంసమైన చమురు, గ్యాస్ వనరులు తిరిగి మామూలు స్థితికి రావడానికి చాలా కాలం పట్టవచ్చు.

దౌత్య విజేతగా భారత్

బ్రిక్స్ కూటమి ఛైర్మన్‌గా, ఈ యుద్ధంలో తటస్థ వైఖరి అవలంబించిన భారత్ "దౌత్యపరంగా విజేత"గా నిలుస్తుంది. యుద్ధానంతరం కొత్త ఇరాన్ నాయకత్వం, పశ్చిమదేశాల ప్రభుత్వాలతో చర్చలు జరిపి భవిష్యత్తులో ఇంధన సమస్య రాకుండా అందరికీ ఆమోదయోగ్యమైన రీతిలో ఒక రూట్ మ్యాప్‌ను తయారుచేసే అవకాశముంది. యుద్ధానంతరం ఇరాన్ పునర్నిర్మాణ ప్రాజెక్టుకు ఐఎంఎఫ్ 600 బిలియన్ డాలర్లు ఖర్చుచేయాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టు 15ఏళ్ల పాటు నడుస్తుంది. ముఖ్యంగా ఇరాన్‌లో ధ్వంసమైన ఉక్కు, ఇంధన, అణు మౌలిక సదుపాయాల పునరుద్ధరణకు ఈ మొత్తాన్ని ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇదే సమయంలో ఇరాన్ ఆర్థిక వ్యవస్థను, పశ్చిమ దేశాలకు అనుగుణంగా రూపొందించే యత్నాలు జరుగుతాయి. ఈ గందరగోళం నేపథ్యంలో ఉత్తర సిరియా, ఇరాక్‌ల్లో బఫర్‌జోన్‌పేరుతో తుర్కియే తన ప్రాబల్యాన్ని సుస్థిరం చేసుకునే యత్నం చేస్తుంది. తూర్పు మెడిటరన్ నుంచి గల్ఫ్ ఆఫ్ ఓమన్ వరకు సముద్ర కారిడార్ వరకు విస్తరించిన ప్రాంతంలో భద్రత ప్రాంతీయ స్థిరత్వాన్ని శాసిస్తుంది. ఇవీ యుద్ధానంతరం జరగబోయే పరిణామాలు!

జమలాపురపు విఠల్‌రావు

సీనియర్ జర్నలిస్ట్

నాటి రం

ఆధునిక నాటక రంగం వయసు రమారమి ఒకటిన్నర శతాబ్దాలు. ఒక జాతి సాంస్కృతిక రంగ ప్రస్థానంలో ఇది అల్పకాలమే అయినా, సుమారు శతాబ్దానికి పైగా ఉజ్జ్వలకాలంగా భాసించింది. పురాణేతిహాసాల ఇతివృత్తాలు, కథాంశాలతో రాజాస్థానాలు, జమీందారుల లోగిళ్లకు పరిమితమైన నాటక ప్రక్రియ ప్రజావేదికపైకి, ప్రజల మధ్యకు వచ్చింది. ఎందరో నాటకకర్తలు సామాజిక సమస్యలు చొప్పించి జనరంజకం చేశారు. సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు స్వీయ రచన 'వ్యవహార ధర్మబోధిని'ని ప్రదర్శించడం ద్వారా (1880) ఆధునిక నాటక ప్రదర్శనకు ఆద్యులయ్యారు. మహాకవి గురజాడ అప్పారావు 'కన్యాశుల్కం' (1897) నాటకరంగ చరిత్రనే మలుపు తిప్పింది. రంగస్థల, చలన చిత్రనటుడు బళ్లారి రాఘవాచార్యులు (రాఘవ) నాటక ప్రదర్శనలో విప్లవాత్మక మార్పులు తెచ్చారు.

సంగీత సాహిత్య నృత్యశిల్ప చిత్రలేఖన లలితకళల సమాహార కళ నాటకం. అందుకే 'కావ్యేషు నాటకం రమ్యమ్' అనే ఆర్యోక్తి పుట్టి ఉంటుంది. దశవిధ రూపకాలలో నాటకం ఉత్తమం, ఉత్కృష్టమైనదనీ సాహిత్య విమర్శకులు వ్యాఖ్యానించారు. దశవిధ రూపకాలలో నాటకం మినహా దేనితోనూ మానవ జీవితాన్ని పోల్చలేదు. మానవ జీవితాన్ని నాటకంతో పోల్చారు ప్రఖ్యాత నాటకకర్త విలియమ్స్ షేక్స్పియర్. 'ప్రపంచమే ఒక రంగస్థలం. అందులో మనమంతా పాత్రధారులం. ఆగమనం... నిష్క్రమణం...మధ్యలో అనేకానేక పాత్రలు' అని తన 'యాజ్ యు లైక్ ఇట్' నాటకంలో జాక్వెస్ పాత్రతో పలికించారు.

మన దేశంలో వేదకాలం నుంచి నాటక ప్రక్రియ ఉన్నట్లు కొన్ని ఆధారాలు ఉన్నప్పటికీ భాసుడి కాలం నుంచే అంటే క్రీ.పూ. 3 వ శతాబ్దం నుంచి స్పష్టమైన ఆధారాలు కనిపిస్తున్నాయి. క్రీస్తు పూర్వమే నిర్మితమైన భారతీయ నిర్మాణాలలో నాగార్జునకొండలో ఆరుబయలు రంగస్థలం (ఓపెన్ ఎయిర్ థియేటర్) బయల్పడిందనే ఆధారాలను బట్టి మన దేశంలోనూ నాటకరంగం ప్రపంచ నాటక రంగంతో సమాంతరంగా అభివృద్ధి చెందుతూ వచ్చిందని చరిత్రకారులు భావిస్తున్నారు.

దేశంలో నాటకం సాధారణ శకం 1840ల తరువాత ఆరంభమైతే, తెలుగునాట 1860 ప్రాంతాలలో ప్రారంభమైంది. అది అభివృద్ధి దశకు చేరుకున్నది మాత్రం కందుకూరి నాటక (వ్యవహార ధర్మబోధిని) ప్రదర్శన తరువాతనే పరిశోధకులు నిర్ధారించారు. కోనసీమకు చెందిన కోరాడ రామచంద్ర శాస్త్రి మొదటి నాటక ('మంజరీ మధుకరీయం–1860)కర్త అయినా, అది ఎక్కడా ప్రదర్శితం కాలేదు. అప్పట్లో నాటక ప్రదర్శనకు మహిళలే కాదు... పురుషులూ ముందుకు వచ్చే వారు కాదట. నాటకాలను ప్రదర్శిస్తే చెడిపోయిన వారిగా పరిగణించే పరిస్థితులు. కోరాడ వారి తరువాత కూడా అనువాద నాటకాలు వచ్చినా, అవి పుస్తకాలకే పరిమితమయ్యాయి. ఈ తరువాత సరిగ్గా రెండు దశాబ్దాలకు కందుకూరి తన విద్యార్థులతో నాటకం ప్రదర్శింపచేశారు.

అప్పటివరకు యక్షగానాలు, తోలుబొమ్మలు, వీధినాటకాలు, పగటి వేషాలు లాంటి జానపద కళారూపాలే వినోద, విజ్ఞాన సాధనాలు. గురజాడ మొదలుకొని ఎందరో రచయితలు, ప్రయోక్తలు, నాటక సంస్థలు, నాటక పరిషత్‌లు నాటక ప్రదర్శనలో కొత్త పోకడలు ప్రవేశపెట్టారు. ప్రజా చైతన్యానికి ఒక కథ, కావ్యం కన్నా నాటక ప్రక్రియ పదునైన వజ్రాయుధంగా భావించి, రచయితలు సమకాలీన సమస్యలను ఇతి వృత్తంగా తీసుకొని పుంఖానుపుంఖాలుగా నాటకాలు రాశారు. వాటిలో చాలా వరకు లెక్కకు మిక్కిలిగా ప్రదర్శిత మయ్యాయి.

అంతర్జాతీయంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆయా దేశాలు స్పందించినట్లే తెలుగు నాటకాల రచన, ప్రదర్శనల్లో ఎన్నో మార్పులు సంతరించుకున్నాయి. సమాజంలోని అన్యాయాలు, అక్రమాలకు 'ప్రతిస్పందన'గా నిలిచాయి. కందుకూరి 'వ్యవహార ధర్మబోధిని' అవినీతితో నిండిపోయిన న్యాయవ్యవస్థ ప్రక్షాళనానికి సమాజంలో చైతన్యం తీసుకురావడానికి ప్రయత్నించింది. గురజాడ 'కన్యాశుల్కం' బాల్యవివాహాలను నిరసిస్తూ, వాటిని రూపుమాపుతూ చట్ట రూపకల్పనకు దారి వేసింది. వ్యసనాలు మనిషిని ఎలా పతనం చేస్తాయో కాళ్లకూరి నారాయణరావు 'చింతామణి, మధుసేవ' నాటకాలలో ఆవిష్కరించారు. గురజాడ, వేదం వెంకటరాయశాస్త్రి నాటకాలు భాషాపరంగా సంచలన ప్రయోగాలకు నాంది పలికాయి. 'కన్యాశుల్కం' వ్యవహారిక భాషకు వేదం వారి 'ప్రతాప రుద్రీయం' పాత్రోచిత భాషకు పట్టం కట్టాయి. ఇలా చెప్పుకుంటూపోతే నాటి నుంచి నేటి దాకా ఎందరో రచయితలు, ప్రయోక్తలు ప్రయోగాలు చేస్తూనే ఉన్నారు.

నాటక ప్రదర్శన కేవలం ఆనందం, ఆహ్లాదాలను పంచడానికే పరిమితం కాకుండా ఆ ప్రక్రియ ద్వారా

నాటక వసంతకులు

కందుకూరి సాంఘిక నాటక ప్రదర్శనకు పాదులు తవ్వితే, రంగస్థలంపై సంస్కరణలతో బళ్లారి రాఘవాచార్యులు పందిళ్లు వేశారు. ఇంగ్లండ్‌లో నాటక ప్రదర్శనను చూచిన ఆయన మన నాటకరంగం వెనుకబాటుతనానికి కలత చెందారు. నాటక విద్యాభ్యాస ప్రాశస్త్యాన్ని, అవసరాన్ని ఎలుగెత్తి చాటిన వారిలో ఆయన అగ్రగణ్యులు. శాస్త్రీయ దృక్పథంతో నటించాలనే ఆసక్తి లేకపోవడం, సంగీతం/రాగం మితిమీరడం గమనించిన ఆయన దర్శక నిర్మాత గూడవల్లి రామబ్రహ్మంతో కలసి యువనటులకు శిక్షణ కోసం నాటి బెజవాడలో 'భరతముని బృందం' సంస్థను స్థాపించారు. దేశంలోనే అది మొదటి నాటక పాఠశాలగా వినుతికెక్కింది. స్త్రీపాత్రలను స్త్రీలే ధరించడంలో ఉండే సహజత్వం, ప్రాశస్త్యాన్ని గ్రహించారు. పురుష స్త్రీ వేషధారులతో నటించకూడదని నియమం పెట్టుకున్నారు. ఈ రంగంలో బళ్లారి వెలిగించిన విప్లవజ్యోతి స్ఫూర్తితోనే ప్రజానాట్యమండలి పురుడు పోసుకొంది. సమాజంలోని అవినీతి, మూఢనమ్మకాలు, మూఢాచారాలను వ్యతిరేకిస్తూ నాటకాన్ని ఆయుధంగా మలుచుకున్న వీరేశలింగం జయంతిని (ఏప్రిల్ 16) తెలుగు నాటక దినోత్సవంగా పాటిస్తున్నారు. కందుకూరి, బళ్లారి జయంతి ఒకే తేదీ కావడం కాకతాళీయం.

గస్థల వైభవం ఏది?



సమాజానికి మరమ్మతులు చేయాలన్న ఆలోచన ప్రబలమైంది. ఆకలి, దగా, దోపిడీ, సంఘర్షణ లాంటివి కథా వస్తువులయ్యాయి. పురాణేతిహాస కథలకు, అందులోని ఊహాజనిత పాత్రలకు స్వస్తి పలికి, 'కళ ప్రజల కోసం'అనే భావనను పెంచుకొని నిత్యం తారసిల్లే మనిషి జీవితానుభవాలనే కథలుగా ఎంచుకొన్నారు. రాజకీయ, సామాజిక పరిస్థితులు, సమాజంలోని లొసుగులు, వ్యసనాలు, మూఢాచారాలను ప్రతిబింబిస్తూ ఎన్నో నాటకాలు వెలువడి పునఃప్రదర్శనలతో అలరించాయి. తెలుగునాట దేశభక్తి ప్రేరేపితం, ప్రబోధాత్మకమైన ఎన్నో సాహిత్య పక్రియలు దూసుకువచ్చినా, కళా వినువీధుల్లో విహరించింది మాత్రం నాటకమే. వినోద ప్రధానంతో పాటు జాతీయోద్యమ భావనను, స్వరాజ్యకాంక్షను రేకెత్తించి ప్రజాచైతన్యానికి ప్రయత్నించింది. అది ఆంగ్ల ప్రభుత్వం, నిజాం సర్కార్‌కు కంటగింపై పదులకొద్దీ నాటకాలు నిషేధ జాబితాలో చేరాయి.

అంత విశిష్ట నాటకరంగ ఉత్థానపతనాలను స్థూలంగా సమీక్షించుకుంటే.... సుమారు ముప్పావు శతాబ్ద కాలంలో ఎన్నో పరిణామాలు. నటనను పవిత్రంగా భావించి, దైవ ప్రార్థనతో నాటకం వేసే రోజుల్లో నాటక సమాజాలకు కొందరు పోషకులు ఉండేవారు. కొందరు సంపన్నులు నాటక ప్రదర్శనల ద్వారా వచ్చే ఆదాయంతో సంస్థలు నడిపేవారు. అలాంటి సమయంలో దేశంలో ఆర్థిక మాంద్యం ఏర్పడి వృత్తి కళాకారులు నిరుద్యోగు లయ్యారు. 'కాంట్రాక్ట్' వ్యవస్థ రంగప్రవేశం చేసింది. 1925-45 మధ్య కాలంలో అమరిన నాటకశాలలు ఆ తర్వాత సినిమాహాళ్లుగా, కల్యాణమండపాలుగా, గిడ్డంగులుగా మారాయి, మారుతున్నాయి. వెండితెర ప్రభావం రంగస్థలంపైన పడితే, బుల్లితెర, ఆధునిక మాధ్యమాలు వెండితెరను ప్రభావితం చేస్తున్నాయని భావించాలి. ప్రతి జిల్లా కేంద్రం, నియోజవర్గ కేంద్రంలో రంగస్థల నిర్మాణం దశాబ్దాల తరబడి ప్రతిపాదనలకు పరిమితమైందన్నది నాటకాభిమానుల ఆవేదన. రంగస్థలాల కొరత వేధిస్తుండగా, ఉన్నవాటిలోనూ కనీస వసతుల కొరత. ఏదో ఒక హాల్‌ను అద్దెకు తీసుకుని ప్రదర్శనలు ఇవ్వవలసిన పరిస్థితి.

నాటకం వన్నె తగ్గుతోంది. ముఖ్యంగా పౌరాణికాల ప్రదర్శనలు కనుమరుగవుతున్నాయి. ఒకనాడు మహా మహులు నటించిన పౌరాణిక నాటకాలను టికెట్‌లు కొని ఎంతో ఆసక్తిగా చూసేవారంటే ఈ తరానికి ఆశ్చర్యం అనిపించవచ్చు. వర్తమానంలో అదే పౌరాణికం, పద్యనాటకం జానపద కళా రూపంగానే మిగిలిపోతోంది. అడపాదడపా ప్రదర్శిత మవుతున్నా ఆదరణ అంతంత మాత్రమే. విదేశాలలో నాటక పరిస్థితి ఇందుకు పూర్తిగా భిన్నం. అమెరికా వంటి దేశాలలో సినిమా వీక్షణకు సాధారణంగా పది,పదిహేను డాలర్లు ఖర్చు పెట్టే ప్రేక్షకుడు నాటకానికి వచ్చే సరికి పదిరెట్లు వరకు వెచ్చిస్తారని అధ్యయనాల్లో తేలింది. మన దేశంలో మరాఠీ, బెంగాలీ, తమిళ, కన్నడ నాటకరంగాలతో పోల్చిచూస్తే తెలుగునాట నాటక రంగం వెనుకబడే ఉందంటారు.

రంగస్థలమే పుట్టినిల్లు

చలనచిత్ర రంగం ఆరంభానికి నాటకాల ఇతివృత్తాలు ఆధారమైనప్పటికీ, చిత్రాలలో పాత్రపోషణకు రంగస్థల నటులే కీలకమయ్యారు. కనుకనే తొలితరాల చలనచిత్ర నటీనటులలో అత్యధికులు రంగస్థల అనుభవం గడించినవారే. అగ్రనటుల నుంచి, వివిధ ముఖ్య పాత్రధారులంతా నాటకానుభవం కలిగిన వారే. ఒక్క మాటలో చెప్పాలంటే రంగస్థల అనుభవమే సినీ రంగ ప్రవేశానికి సింహ ద్వారంగా భావించేవారు. రంగస్థలాన్ని పుట్టినిల్లుగా సంభావించిన ఆ నటీనటుల్లో చాలామంది కన్నతల్లిని మరువక తరచూ రంగస్థలంపై కనిపించే వారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా భిన్నం. ఈ తరం నటీనటులకు రంగస్థలం అనుభవం మాట అలా ఉంచి దానితో పరిచయమే ఉన్నట్లు కనబడదని వ్యాఖ్యలు ఉన్నాయి.

ఇతర దేశాలతో, దేశంలోని ఇతర ప్రాంతాలతో పోల్చిచూస్తే తెలుగునాటక రంగం తిరోగమనంలో ఉందని దశాబ్దాల క్రితం మహానటుడు బళ్లారి రాఘవ మనోగతమే నేటికీ కొనసాగుతోందని ఆ రంగ ప్రముఖులు, విశ్లేషకులు అంటున్నారు. పరిషత్‌లు, ప్రదర్శనలు పెరిగాయి తప్ప నాణ్యత మెరుగుపడలేదని, రాశితో పాటు వాసి పెరగలేదని, ప్రతిభ గల నటులు తయారుకాలేకపోతున్నారని పెదవి విరుస్తున్నారు. అసలే అంతంత మాత్రంగా ఉన్న నాటకాన్ని సినిమాలు దెబ్బతీశాయనే ఆరోపణ ఉండగా, తాజాగా దూసుకువచ్చిన టీవీ, సామాజిక మాధ్యమాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.

నాటకరంగాన్ని మరో మెట్టు ఎక్కించడానికి, జాతీయ నాటకం రూపుదిద్దుకొనేందుకు ఔత్సాహిక నాటక రంగ స్థోమత మాత్రమే చాలదు. ప్రాయోజికులు కావాలి. ప్రభుత్వం థియేటర్‌ల వంటి మౌలిక సదుపాయాలు చేకూర్చాలి. కళాకారులను ప్రోత్సహించేలా పురస్కారాలను ఏటా క్రమం తప్పకుండా ప్రదానం చేయాలి. నాటకప్రియులూ ముందుకు రావాలి. పాఠశాల నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకు అర్థం లేని నృత్యాలు, రికార్డింగ్ డ్యాన్స్‌లకు బదులుగా ప్రబోధాత్మక నాటక ప్రదర్శనలను ప్రోత్సహించాలి. టికెట్ కొని నాటకం చూసే రోజు రావాలి. టికెట్ కొనడం అంటే ఏవో సొమ్ములు వచ్చి పడతాయని కాదు. నాటకానికి అది ఒక ప్రోత్సాహం మాత్రమే. 'నాటకం సమాజాన్ని ప్రతిబింబిస్తుంది. సమాజం నాటకాన్ని ప్రభావితం చేస్తుంది' అన్న రంగస్థల నటన బోధనా విభాగం పూర్వాచార్యుల మాటలు వాస్తవమైతే నాటకం మరింత ప్రజల్లోకి వెళ్లాలి. ఔత్సాహిక నాటక సమాజాలు సృజనాత్మక నాటకాలను ప్రదర్శిస్తూనే ఉన్నాయి. నాటక కర్తలకు, కళాకారులకు, కళాభిలాషులకు కొదువలేదు. ప్రోత్సాహమే లోపిస్తోంది. ప్రేక్షకులకు నచ్చేది,వారు మెచ్చేది, సమాజాన్ని చైతన్య పరిచేది, ప్రజా జీవితానికి పనికి వచ్చేది..మంచిని నేర్పేది, చూపేది ఉత్తమ నాటకమని సాధారణ నిర్వచనం. అలాంటివి మరిన్ని ప్రదర్శితం కావాలన్నది నాటక ప్రియులు ఆకాంక్ష.

డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి
సీనియర్ జర్నలిస్ట్

కాంగ్రెస్ హా కూల్చివేతలే.

కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యంగా రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగుతున్న తెలంగాణలో ప్రస్తుతం కూల్చివేతల పర్వం కొనసాగుతోంది. పేర్లు ఏవైనప్పటికీ, ప్రాజెక్టులు ఎలా రూపకల్పన చేస్తున్నప్పటికీ, అభివృద్ధి పేరుతో చేపడుతోన్న కూల్చివేతల వల్ల తీవ్ర కలకలం చెలరేగుతోంది. హైడ్రా, మూసీ రివర్, ఖమ్మం భూదాన్ భూములు ఇలా మొన్నటిదాకా రాష్ట్రంలో కూల్చివేతల ప్రకంపనలు కొనసాగాయి. ఇప్పుడు తాజాగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణల పేరుతో బుల్డోజర్లతో కూల్చివేతల పర్వం కొనసాగుతోంది. ఫలితంగా నిరుపేదలు, చిరు వ్యాపారులు, దశాబ్దాలుగా చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న వాళ్లు తీవ్ర నరకయాతన పడుతున్నారు. ఇన్నేళ్లుగా, దశాబ్దాలుగా లేని అభ్యంతరం ఉన్నపళంగా ఇప్పుడే ఎందుకు వస్తోందని ప్రశ్నిస్తున్నారు.

కనీసం నోటీసులు ఇవ్వకుండా, ఉపశమనం కలిగించకుండా, ఖాళీ చేయడానికి సమయం కూడా ఇవ్వకుండా ఒక్కసారిగా బుల్డోజర్లతో విరుచుకు పడటంతో తమ ఉపాధి దెబ్బతినడమే కాకుండా.. తమ జీవనోపాధికి ఆధారాలు పూర్తిగా బుల్డోజర్ల పాలవుతున్నాయని చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కూల్చివేతలు చేపడితే.. అక్రమ నిర్మాణాలు, అక్రమాలు అని గుర్తిస్తే.. ఒక ప్రణాళిక ప్రకారం ప్రత్యామ్నాయం చూపించడమో వేరేచోటుకు మార్చుకునేందుకు సమయం ఇవ్వడమో చేయాలి గానీ, ఉన్నట్టుండి నిర్మాణాలు కూల్చివేసి, తమ వ్యాపార సామగ్రి అంతా నేలమట్టం చేయడం దేనికి నిదర్శనమని ప్రశ్నిస్తున్నారు. తమలాంటి బడుగు జీవులపై ప్రతాపం చూపిస్తే ఎలా అంటూ నిలదీస్తున్నారు. ప్రభుత్వం కూల్చివేసింది తమ నిర్మాణా, వ్యాపారాలను కాదని, తమ జీవనోపాధి అని మండిపడుతున్నారు. ఫుట్‌పాత్‌ల క్లీనింగ్, క్లియరింగ్ పేరుతో జీహెచ్ఎంసీ బుల్డోజర్లతో కూల్చివేతలు చేపట్టింది. ఫలితంగా హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో ఒకే రోజు దాదాపు 800 మంది చిరు వ్యాపారులు రోడ్డుపాలయ్యారు. జీహెచ్ఎంసీ చేపడుతున్న ఈ అప్రకటిత కూల్చివేతలపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పేదలపై పగబట్టి నట్టుగా చేయొద్దని వినతులు వెల్లువెత్తుతున్నాయి.

పొట్టచేతపట్టుకొని బతుకు జీవుడా అంటూ ఆరుగాలం కష్టపడే బడుగుజీవులపైనా ప్రభుత్వం పంజా విసురుతోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఏప్రిల్ 4వ తేదీన ఒకే రోజు.. ఉదయం రహదారుల విస్తరణ, ఫుట్‌పాత్‌ల క్లీనింగ్ ముసుగులో రోడ్లపై అమ్మకాలతో జీవనోపాధి పొందే చిరువ్యాపారులపై బుల్డోజర్లను దింపడంతో తమ జీవితాలు రోడ్డుపాల య్యాయని రోదిస్తున్నారు. ముందస్తు నోటీసులు గానీ, ప్రత్యామ్నాయ చర్యలు గానీ చేపట్టకుండా ఏకంగా చర్యలకు దిగిన అధికారులపై బాధిత చిరు వ్యాపారులంతా తిరగబడ్డారు. బుల్డోజర్లకు అడ్డంగా పడుకొని ఆందోళనకు దిగారు. మోండా మార్కెట్ పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించారు. నిత్యం శ్రమిస్తూ కుటుంబాలను పోషించుకుంటోన్న తమపై ప్రభుత్వం ఇలా కక్ష గట్టడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో పలుచోట్ల అధికారులు జరిపిన కూల్చివేతలు ఉద్రిక్తతకు దారితీశాయి. ఈ తీరును నిరసిస్తూ సోషల్ మీడియాలో కూడా నెటిజన్లు ప్రభుత్వంపై విరుచుకు పడ్డారు.

ఏప్రిల్ 4వ తేదీ తెల్లారేలోగా బుల్డోజర్లు, జేసీబీలతో జీహెచ్ఎంసీ అధికారులు పలుచోట్ల రంగంలోకి దిగారు. ఆరు జోన్ల పరిధిలోని 798 నిర్మాణాలు కూల్చివేశారు. వాటిలో 340 పర్మినెంట్ నిర్మాణాలు ఉండగా, 458 తాత్కాలిక నిర్మాణాలు ఉన్నాయి. దీంతో చిరు వ్యాపారాలు చెల్లాచెదుర య్యాయి. ఆ చిరు వ్యాపారుల కుటుంబాల జీవితాలు అంధకారమయ్యాయి. మోండా మార్కెట్, ఆరాంఘర్, మదీనా ప్రాంతాల్లో వ్యాపారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైనప్పటికీ పోలీసులు, అధికారులు తమ బలగాలతో కూల్చివేతలు చేపట్టారు. ముందస్తుగా ఎలాంటి నోటీసులు లేకుండా, నిరాశ్రయులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపకుండా ఒక్కసారిగా యంత్రాలతో విరుచుకు పడటంతో ఏండ్ల తరబడి చిరు వ్యాపారాలు చేసుకుంటున్న కుటుంబాలు రోడ్డునపడ్డాయి. పాతబస్తీలోని లాడ్‌బజార్, రికాబ్‌గంజ్ రోడ్‌తోపాటు ఖైరతాబాద్, రాజేంద్రనగర్ పరిధిలోని శ్రీనగర్‌కాలనీ, ఆరాంఘర్ వరకు ప్రధాన రహదారులపై ఉన్న తోపుడు బండ్లు, చిన్నపాటి డబ్బాలను స్వాధీనం చేసుకొన్నారు. గడువు ఇవ్వాలని బాధితులు వేడుకున్నా అధికారులు వినిపించుకోలేదు. బుల్డోజర్లకు అడ్డంగా పడుకుని బాధితులు నిరసన తెలిపినా కనికరించలేదు. జేసీబీల ఎదుట నిలబడి ఆందోళనకు దిగారు. నిరసనలతో ట్రాఫిక్ పోలీసులు సైతం వెనక్కి తగ్గారు.

దుకాణాల్లోని సామగ్రిని తీసుకొనేందుకు చిరు వ్యాపారులు అరగంట సమయం ఇవ్వాలని వేడుకొన్నా వినకుండా అధికారులు నిర్దాక్షిణ్యంగా కూల్చివేశారు. ఓ హైకోర్టు అడ్వకేట్ ఒకరు బాధితుల పక్షాన అధికారులను వేడుకున్నా వినిపించుకోలేదు. అధికారుల ఆదేశాలతో దుకాణాలను బుల్డోజర్ డ్రైవర్లు క్షణాల్లో నేలమట్టం చేశారు. మదీనా, ముర్గీచౌక్ ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు చేపట్టిన కూల్చివేతలను పలువురు ప్రజాప్రతినిధులు కూడా అడ్డుకొన్నారు. జేసీబీ డ్రైవర్‌తోపాటు జీహెచ్ఎంసీ అధికారులపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దీంతో కొద్దిసేపు మదీనా, ముర్గీచౌక్ ప్రాంతాల్లో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకొంది. కూల్చివేతలకు ఉపయోగించే బుల్డోజర్, జేసీబీ వాహనాలపైకి చేరుకున్న నేతలు అధికారుల చర్యలను నిలదీస్తూ ఇప్పటివరకు జారీచేసిన నోటీసులు ఎక్కడంటూ ప్రశ్నించారు. దీంతో అధికారులు వెనక్కి తగ్గి కూల్చివేతలను తాత్కాలికంగా నిలువుదల చేస్తున్నామని ప్రకటించారు.

గతంలో ఎప్పుడూ ఇలా జరుగలేదని, కాంగ్రెస్‌ని గెలిపిస్తే తమ పొట్టలు కొడుతున్నారని బాధితులు ఆందోళన వ్యక్తంచేశారు. దశాబ్దాలుగా ఇక్కడే వ్యాపారం చేసుకొని బతుకుతున్నామని, ఇప్పుడు కొత్తగా పెట్టుకోలేదని ఫుట్‌పాత్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. అయితే, కొన్ని చోట్ల వ్యాపారుల నిరసనలతో పరిస్థితి చేయిదాటి పోతుందని భావించిన అధికారులు జేసీబీలతో సహా అక్కడి నుంచి వెళ్లిపోయారు. రెండు మూడు దశాబ్దాలుగా అక్కడే పూలు, ఇతర నిత్యావసరాలు అమ్ముతూ జీవనం సాగిస్తున్నామని, కుటుంబాలను



యాంలో . కూల్చివేతలు

పోషించుకుంటున్నామని, ఇన్నేళ్లుగా లేని అభ్యంతరం ఇప్పుడెలా వచ్చిందని కొందరు ప్రశ్నిస్తున్నారు. అధికారులు జేసీబీలు, బుల్డోజర్లతో తాము వ్యాపారంచేసుకునే సరుకులనుకూడా నేలపాలు చేశారని, మానవత్వం లేకుండా ప్రవర్తించారని కన్నీరు మున్నీరయ్యారు.

పాదచారుల సౌకర్యం కోసమే ఫుట్‌పాత్‌లను క్లియర్ చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. ఇది ముఖ్యమైన అంశమే అయినప్పటికీ చిరువ్యాపారుల కోసం ప్రభుత్వం కేటాయించాల్సిన 'వెండింగ్ జోన్ల' ఏర్పాటును విస్మరించడంపై విమర్శలు వెలువెత్తుతున్నాయి. పైగా ఇన్నాళ్లుగా ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలను, నిర్మాణాలను చూసీచూడనట్లుగా వ్యవహరించిన అధికారులు.. ఇప్పుడు ఒక్కసారిగా ఈ కూల్చివేతలకు దిగడం విమర్శలకు తావిస్తోంది. కనీసం ఒక ప్రణాళిక ప్రకారం ప్రాంతాల వారీగా స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తే బాగుంటుందని పలువురు సలహా ఇస్తున్నారు. ఆ ప్రత్యేక ప్రణాళికల్లో భాగంగా ఫుట్‌పాత్, వీధి వ్యాపారుల వివరాలు సేకరించి, వాళ్ల వ్యాపారాలు నష్టపోకుండా, ఉపాధి దెబ్బతినకుండా, ఒక కార్యాచరణ రూపొందించి, వాళ్లకు ఇతర ప్రదేశాల్లో వ్యాపార అవకాశాలు కల్పించేలా అధికారులు చొరవ చూపించాలని, నిర్మాణాలు ఉన్నపళంగా కూల్చివేయకుండా, కాస్త సమయం ఇవ్వాలని, ప్రాంతాలవారీగా కమిటీలు ఏర్పాటు చేసి వారితో చర్చిస్తూ, క్రమపద్ధతిలో ఫుట్‌పాత్‌లను క్లియర్ చేస్తే బాగుంటుందని అంటున్నారు. మరి అధికారులు ఈ కూల్చివేతల ప్రక్రియను ఇలాగే ప్రణాళిక లేకుండా కొనసాగిస్తారా? లేదంటే బాధితులకు ఉపశమనం కలిగించేలా కార్యాచరణ రూపొందిస్తారా? చూడాలి.

సుజాత గోపగోని
సీనియర్ జర్నలిస్ట్, 6302164068

చర్చ

దీదీతో ప్రజాస్వామ్యానికి ముప్పు

బెంగాల్ శాసనసభ ఎన్నికల సందర్భంగా ఓటర్లలో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ–టీఎంసీ పూర్తి వ్యతిరేకత ఉన్నట్టు ఆ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీకి స్పష్టంగా తెలుసు. ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఓటర్ల సవరణ సహా అనేక అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించి ఓటర్లను ఆకట్టుకునే విఫల ప్రయత్నం చేస్తున్నారు. అందులో భాగంగా చివరికి రాష్ట్రపతి పర్యటనకు ప్రోటోకాల్ పాటించలేనంతగా మమత కలత చెందుతున్నారు. ఓటర్ల ఏకీకృతం జరుగుతోంది అని అర్థం చేసుకున్నారు. హిందువుల మెప్పు పొందడం కోసం కోట్ల రూపాయల వ్యయంతో ఆలయ నిర్మాణం చేసినా ప్రయోజనం శూన్యం. బెంగాలీల ఆరాధ్య దైవం కాళీమాతను కించపరిచే విధంగా పూజ నిర్వహించిన సంగతి, కాళీ పూజ మండపాలకు దసరా పండుగ సమయంలో అనుమతులు నిరాకరణ వంటివి ప్రజలు మర్చిపోలేదు. ఇప్పటికి ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రభుత్వ అధికారులను పలుసార్లు బదిలీ చేసింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఎన్నికలు పూర్తి అయ్యేంతవరకు తాను బెంగాల్‌లోనే ఉంటానని ఓటర్లకు హామీ ఇచ్చారు.

ఇవన్నీ ముఖ్యమంత్రి మమతకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. గత ఎన్నికల్లో కాలు, చెయ్యి విరిగినట్టు చక్రాల కుర్చీతో సానుభూతి పొందుదాం అనుకున్నా ఆ ఉపాయం పాతది అయిపోయింది. ప్రస్తుతం తన ప్రభుత్వంపై వ్యతిరేకత తగ్గించుకునే ప్రయత్నం కోసం తీవ్రంగా అన్వేషిస్తున్నారు.

బెంగాల్ ప్రజలు కష్టపడి పని చేసే మనస్తత్వం కలిగిన వారు. 8గంటల పనికోసం మరో 8 నుంచి 10 గంటల ప్రయాణం చేయడం,తిరిగి వారి స్వగ్రామాలకు చేరడం వారికి నిత్యకృత్యం. అయినా మమత పాలనలో ఎటువంటి అభివృద్ధి లేని బీమారు రాష్ట్రంగా బెంగాల్ పేరు తెచ్చుకుంది.

ప్రస్తుతం ఏదో రకంగా అల్లర్లు సృష్టించి, రాష్ట్రపతి పాలనలోకి బెంగాల్‌ను తీసుకురావడం మమత ప్రణాళికలా కనిపిస్తోంది. అందులో భాగంగానే 8మంది న్యాయధికారులను (ఒక మహిళను ఆమె బిడ్డతో సహా) మాల్డా వద్ద నిర్బంధించడం అందులో భాగం. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రత్యక్ష జోక్యంతో 8 మంది ప్రాణాలతో బయటపడ్డారు. ఇలాంటి మరింత పెద్ద సంఘటనలు జరిగే అవకాశాలు ఉన్నాయి. తద్వారా కేంద్రం ఆర్టికల్ 356ఉపయోగించి రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేయడం, రాష్ట్రపతి పాలన తప్పనిసరి చేసే విధంగా బెంగాల్ సీఎం పావులు కదుపుతున్నారు. ఆపై తీవ్ర అల్లర్లు, ఆరు నెల ల నుండి సంవత్సరము పాటు ఎన్నికలు వాయిదా పడితే కేంద్రాన్ని విమర్శలు చేయడానికి, బీజేపీయేతర పక్షాలను ఏకం చేసే సమయం మమతకు దొరుకుతుంది. తాము ఎన్నికలలో ఓటమి చెందుతాము అనే భావనతోనే ఎన్నికల తర్వాత కేంద్రంలో అన్ని వర్గాలను కలుపుకొని బీజేపీని ఢిల్లీ గద్దె దింపుతాం అని ఒక ఎన్నికల ప్రచార సభలో ఆమె వ్యాఖ్యానించారు. బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన తీసుకు వచ్చే పరిస్థితులు కల్పించి బీజేపీ హవా (పాల పొంగు మాత్రమే అని మమత ఉద్దేశ్యం) తగ్గించడం దీదీ ప్రణాళికలో భాగం. అదే నిజమైతే బెంగాల్‌లో ఎన్నికలు వాయిదా వేయించడానికి టీఎంసీ మద్దతు దారులు భారీ ఎత్తున హింసతో ఆస్తి, ప్రాణ నష్టానికి పాల్పడవచ్చు. చివరిగా హింస ద్వారా ఎన్నికలు వాయిదా వేయించవచ్చు అనే భావన రాజకీయ పార్టీలలో వ్యాపిస్తే అదే భారత ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం.

– కడియాల సుబ్రహ్మణ్యం



రక్తసిక్తం - జలియన్

107 సంవత్సరాల క్రితం జరిగిన జలియన్‌వాలాబాగ్ సంఘటన స్వాతంత్ర్యోద్యమంలో ఓ కీలక మలుపు, భారతమాత నుదుట రక్త తిలకం. దేశ స్వాతంత్ర్యోద్యమంలో ఓ రక్తసిక్త అధ్యాయం. ఈ మారణకాండలో వేలమంది నేలకొరిగిన విషాద ఘట్టం. దేశమాత స్వేచ్ఛ కోసం జరిగిన పోరాటాన్ని ఓ మలుపు తిప్పింది.

ఓడిన ప్రతిసారీ విజయానికి చేరువ అవుతూనే ఉంటాడు మనిషి.

"పెళపెళ మరిగే మనస్సుంటేనే
తళ తళ ఊహలు తోచేది
సలసల కాగిన పిదపే పాలకు
కమ్మని పరిమళ మొచ్చేది"

ఉలి దెబ్బలు తింటేనే
శిల శిల్పంగా మారుతుంది.

భారతదేశానికి స్వాతంత్ర్యం అంత సులువుగా రాలేదు. భగీరథుడే మనకు ఆదర్శం. అమృతసర్‌లోని స్వర్ణ దేవాలయానికి అత్యంత సమీపంలో 6.50 ఎకరాలల్లో జలియన్‌వాలా బాగ్ ఉంది. మహారాజా రంజిత్ సింగ్‌కోటలో న్యాయవాదిగా పనిచేసిన "హిమ్మత్ సింగ్ జలియన్‌వాలా" పార్థివ దేహాన్ని ఇక్కడ సమాధి చేశారు. ఆయన పేరుతోనే ఈ ప్రాంతానికి జలియన్‌వాలా బాగ్‌గా పేరొచ్చింది. చుట్టూ ఎత్తయిన భవనాల మధ్య ఉత్తరం వైపున 3 నుండి 4 అడుగుల వెడల్పు మార్గం మాత్రమే ఉంది. బాగ్‌లో తూర్పు వైపున నుయ్యి, ఆపై కొద్దిగా చెట్లు ఉన్నాయి. ఇక్కడి మైదానంలో వేడుకలు జరుగుతూ ఉంటాయి. ముఖ్యంగా ఏటా వైశాఖీ ఉత్సవం ఇక్కడే జరుగుతుంది.

ప్రథమ ప్రపంచ సంగ్రామంలో పని చేసినవారికి అనేక అవకాశాలు కల్పిస్తామనీ, ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని చెప్పి పంజాబ్ నుండి 3.55 లక్షల మందిని బ్రిటిష్ ఇండియా సైన్యంలో చేర్చుకుంది. యుద్ధం ముగిసింది సైన్యాన్ని వెనక్కి పంపించివేసింది. ఇచ్చిన హామీలు నెరవేర్చక పోవడంతో పంజాబ్ ప్రజలు నిరుద్యోగులయ్యారు. దానికి ప్రతీకారంగా నిరసనలు తెలుపగా ప్రజలను విచారణ లేకుండా నిర్భందించడం ప్రారంభించింది. ప్రభుత్వం నిర్భంధానికి చట్టబద్దత కల్పించడానికి సర్ సిడ్నీ రౌలట్ అధ్యక్షతన 1917లో ఓ కమిటీ వేసింది. దాని సిఫారసుల ఆధారంగా మార్చి 18, 1919న రౌలట్ చట్టాన్ని ఆమోదించింది.

రౌలట్ చట్టం "అరాచక, విప్లవ నేరాల చట్టం" అమలులోనికి వచ్చింది. దీని ప్రకారం ఎవరినైనా అకారణంగా నిర్భంధించవచ్చును, కారణం చూపాల్సిన అవసరం లేదు. ఎంతకాలమైనా నిర్భంధంలో ఉంచవచ్చు. "దలీల్ లేదు, వకీలు లేడు, అప్పీలు లేదు" ఇది బ్లాక్ బిల్. దేశం నలుమూలలా జాతీయోద్యమాన్ని అణచడానికి ఈ బిల్లు అమలులోనికి వచ్చింది.

పంజాబ్ రాష్ట్రంలోని పవిత్ర పట్టణమైన అమృతసర్‌లో వయస్సు, మత, లింగ భేదం లేకుండా ప్రజలు రౌలట్ చట్టానికి, పోలీసు అధికారి పంజాబ్ లెఫ్టినెంట్ గవర్నర్ మైఖేల్ ఓ డయ్యర్‌కు వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసనలు ప్రారంభించారు. 1919లో ఏప్రిల్ 9వ తేదీన శ్రీరామ నవమి రోజున హిందువులు, సిక్కులు, ముస్లిమ్‌లు ఊరేగింపులో చేతులు కలిపి నడిచారు. దీనికి నాయకత్వం వహించిన వారు డా॥ సత్యపాల్, సైపుద్దీన్ కిచ్లూ. బ్రిటిష్ వారికి 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం గుర్తుకు వచ్చింది. దానితో భయం పట్టుకుంది. వీరి సభను జరగకుండా భగ్నం చేయాలని ఆలోచించారు. దాన్ని అణచి వేయడానికి బ్రిగేడియర్ రెజినాల్డ్ డయ్యరు సైనికులను ఆయుధాలతో అమృతసర్‌కు పిలిపించాడు. వాస్తవానికి అమృతసర్‌లో సైనిక పాలన ఉంది. బజార్లు మూసివేశారు. ఆకాశంలో ఓ విమానం చక్కర్లు కొట్టడం కన్పించింది. జెండా మార్చి కూడా నిర్వహించారు. అన్ని బహిరంగ సమావేశాలు నిషేధించారు. కానీ ఈ నిషేధం గురించి ప్రజలందరికీ తెలిసి ఉండదని ఊహించ వచ్చు. 1919 ఏప్రిల్ 13 ఆదివారం, బైశాఖీ ఒక పవిత్రమైన రోజు, సాధారణంగా వేడుకలు, ప్రార్థనలకోసం కేటాయిస్తారు. అయితే ఆ రోజు సంబరాలు పెద్దగా జరగకపోయినా సాయంత్రం మాత్రం యధావిధిగా శాంతియుతంగా సభ జరుగుతుందని కరపత్రాలు పంచారు.

ఈ రోజు అనగా 1919 ఏప్రిల్ 10న డా॥ సత్యపాల్, సైపుద్దీన్ కిచ్లూలను అరెస్టు చేసి ధర్మశాల నుండి బహిష్కరించారు. వారి అరెస్టు వార్త వ్యాపించడంతో, విచారణ నిమిత్తం సివిల్ లైన్స్ కంటోన్మెంటు వద్ద నిరాయుధులైన జనం భారీగా గుమిగూడారు. పుకార్లు వలన ప్రజలు ఆగ్రహంతో అట్టుడికి పోయారు. అధికార భవనాలను తగులబెట్టి బ్రిటిష్ పౌరులపై దాడి చేయడానికి ప్రయత్నించారు. ఈలోగా ఒక గుంపు షేర్ వుడ్ అనే బ్రిటిష్ మహిళపై దాడికి పాల్పడింది. కానీ ఓ భారతీయ కుటుంబం ధైర్యంతో ఆమె రక్షింపబడింది.

నిర్భంధించబడిన డా॥ సత్యపాల్, సైపుద్దీన్ కిచ్లూల వివరాలు తెలియజెయ్యమని 1919 ఏప్రిల్ 10వ తేదీన అమృత్‌సర్‌లో సమావేశం అయ్యారు. ఆ సమావేశంలో ఓ ప్రముఖ నిర్ణయం తీసుకొన్నారు. అది 1919 ఏప్రిల్ 13వ తేదీన బైశాఖి ఉత్సవంలో



వాలాబాగ్ దురంతం

సభ జరుగుతుందని ప్రకటించారు. (అది పంజాబీలకు నూతన సంవత్సరం). ఆ రోజున జలియన్‌వాలా బాగ్‌లో భారీగా ఉత్సవం చేస్తారు. పూజలకు భక్తులు వేల సంఖ్యలో జలియన్ వాలాభాగ్‌కి వస్తారని పోలీసువారికి సమాచారం అందింది. జనజాగరణకు పెద్దగా ప్రయత్నం చెయ్యక పోయినా జనాలు చేరారు. అయితే అప్పటికే ఆ ప్రాంతంలో సభలు సమావేశాలు నిర్వహించరాదని ఆంక్ష ఉంది. ఆ విషయం ప్రజలకు తెలియదు, కాబట్టి చుట్టుప్రక్కల గ్రామాల నుండి జలియన్‌వాలా బాగ్‌కు పెద్ద సంఖ్యలో ప్రజలు చేరుకొన్నారు. సమావేశ మండపంలో కూడా అనేకమంది గుమిగూడారు.

నిషేధాజ్ఞలు ఉల్లంగిస్తున్నారన్న కోపంతో నాటి పంజాబ్ గవర్నర్‌గా ఉన్న మైకేల్ ఓ డయ్యర్ సమావేశాన్ని రద్దు చేయ్యమని పోలీస్ అధికారి జనరల్ డయ్యర్‌ను ఆదేశించారు. ఆ అధికారి పెద్ద బెటాలియన్‌తో వెళ్లి అన్ని గేట్లు మూసేసి శాంతియుతంగా జరుపుకుంటున్న సమావేశంపై 1650 రౌండ్స్ కాల్చాడు. 50 మంది సైనికులు తమ దగ్గర గల మందుగుండు అయ్యేవరకు "మ్యాడ్ మినిట్" అనే పద్దతిలో కాల్చారు. సమావేశ స్థలంలో సుమారు 20,000 మంది ఉండి ఉంటారని అంచనా, ఈ కాల్పుల కారణంగా, తొక్కిసలాట కారణంగా, అనేకమంది మరణించారు. ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది 379 మంది మరణించారని, 1200 మందికి గాయాలయ్యాయని. ప్రజలు కాల్పుల వలన కాకుండా తొక్కిసలాట వలన భయకంపితులయి మరణించారని, ఆ సంఘటనపై వేసిన ఎంక్వైయిరీ కమీషన్ తేల్చింది. ఈ కమీషన్ రిపోర్టులో నాటి గవర్నర్ మైకేల్ ఓ డయ్యర్, జనరల్ డయ్యర్ ని అభినందిస్తూ ఆ సమయంలో సరైన చర్య చేపట్టారని ప్రకటించారు.

ఈ ప్రకటనపై అనేకమంది దేశ భక్తులు నిప్పులు చెరిగారు, వారిలో ప్రధానంగా ఆ సంఘటన జరిగే సమయానికి అక్కడే ఉన్న ఉద్దాం సింగ్ మొదటివాడు. భారతదేశ స్వాతంత్ర్య చరిత్రలో ఇంతటి ప్రాణనష్టం ఇప్పటివరకు జరగలేదు. భారత జాతీయ కాంగ్రెస్ మాత్రం వెయ్యిమంది మరణించారని, పదిహేను వందల మందికి గాయాలు అయ్యాయని ప్రకటించింది. జలియన్‌వాలా బాగ్ లోపల ఓ నుయ్యి వుంది, దాని నుండి దురంతం జరిగిన తర్వాత 120 శవాలను వెలికితీశారని చరిత్ర చెపుతుంది. బహుశా వారు ఈ బుల్లెట్ల బారి నుండి తప్పించుకోవడానికి ఆ నూతిలో దూకి ఉంటారని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. ఈ దురంతం గురించి మాట్లాడుతూ రవీంద్రనాథ్ టాగూర్ తనను చాలా బాధించిందని పేర్కొంటూ, తనకు బ్రిటిష్‌వారు బహుకరించిన "నైట్ హుడ్" బిరుదును త్యజించారు. సర్ శంకర్ నాయర్ తనకు ఇచ్చిన వైస్రాయ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ షిప్ పదవికి రాజీనామా చేసారు. గాంధీజీ కైజర్-ఐ హింద్-(గోల్డ్ మెడల్) ను వదులుకున్నారు.

ఉద్దాంసింగ్ పంజాబ్‌లో 1899 డిసెంబర్ 26 న సంగ్రూర్ జిల్లా సునంలో జన్మించాడు. అనాథ ఆశ్రమంలో పెరిగాడు. సరిగ్గా జలియన్‌వాలా బాగ్ దురంతం జరిగే నాటికీ ఆయన వయస్సు 20 సంవత్సరాలు. ఆ రోజున జరిగిన సంఘటన తన కళ్లారా చూశాడు. ఈలోగా గధర్ పార్టీలో సభ్యుడిగా చేరాడు. ఆయుధాలు ఉపయోగించడం నేర్చుకొన్నాడు. డయ్యర్‌ను చంపడం కోసమే ఇంగ్లాండు వెళ్లాడు. అక్కడ క్రోక్షన్‌లో మైకేల్ ఓ డయ్యర్ అధ్యక్షతన సమావేశం జరుగుతుంది. అదే సమయంలో ఉద్దాంసింగ్ కూడా అదే సభలో కూర్చున్నాడు. సమావేశం ముగిసేవరకు సమయం కోసం ఎదురు చూస్తున్నాడు, సమావేశానంతరం ఒక్కసారిగా ప్రజలందరూ అతని చుట్టూ మూగారు. వెంటనే ఉద్దాంసింగ్ తన కోటు జేబులో నుండి రివాల్వర్ తీసాడు. మైకేల్ ఓ డయ్యర్‌పై అతి దగ్గర నుంచి మూడు రౌండ్స్ కాల్పులు జరిపాడు. అప్పటికే మైకేల్ ఓ డయ్యర్ వయస్సు 74 సంవత్సరాలు. ఉద్దాం సింగ్‌ను పోలీసులు అరెస్ట్ చేసి ఉరిశిక్ష వేసారు.

మైకేల్ ఓ డయ్యర్ కమీషన్ ముందు ఇచ్చిన సమాధానం అతడిలోని రాక్షసత్వానికి అద్దం పడుతుంది. "జన సమూహాన్ని చెదరగొట్టడానికి కాల్పులు జరపలేదు. పార్కు నుండి తప్పించుకొని పారిపోవడానికి ప్రయత్నించిన వారిపై కాల్పులు జరిపాను. వీలైనంత ఎక్కువ మందిని చంపమని సైనికులను ఆదేశించాను". అందుకే సైనికులు తెచ్చిన మందుగుండు సామాగ్రి అయిపోయే వరకు "మ్యాడ్ మినిట్" పద్దతిలో కాల్పులు జరిపారు. కాగా మారణకాండలో మరణించిన వారి ప్రాణాలకు 5 వేల పౌండ్‌లు చొప్పున ప్రభుత్వం వెలకట్టింది. అయితే చాలామంది ఈ మొత్తాన్ని తీసుకోలేదు. 120 మంది మరణించిన బావిని అద్దాలతో మూసివేశారు. సంఘటన జరిగిన చోట స్మారక స్తూపం కట్టారు. ఇక్కడి గోడలపై కన్పించే తూటాల గుర్తులు చరిత్రకు ఆనవాళ్లు. ఆంగ్లేయ సైన్యాధికారుల రాక్షస క్రీడకు చిహ్నంగా చరిత్రలో నిక్షిప్తం చేయబడ్డాయి. ఇంతటి ఘన చరిత్ర ఉన్న మట్టిలో పుట్టడమే మనకు గర్వకారణం.

Sources:

1) Jallianwala Bhag Massacre (ed) by V.N. Datta and Settar

2) Khooni Vaisakhi by Nanak Singh

డా. కాశింశెట్టి సత్యనారాయణ

విశ్రాంత ఆచార్యుడు



ఆధునిక కాలపు అత్య పంచ పరివర్తన జీవన

శాస్త్ర సాంకేతిక రంగాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. నిన్నటి ఆవిష్కరణ నేడు పాతబడి పోతున్నది. నేటి సాంకేతికత రేపటి మార్పునకు పునాది అవుతున్నది. నిత్య మార్పులను ఆకళింపు చేసుకుంటూ ప్రయాణం చేయవలసిన అగత్యం ఏర్పడింది. నిత్యం అప్‌డేట్ కాకపోతే అవుట్‌డేట్ కావలసి వస్తున్నది. మారుతున్న శాస్త్ర సాంకేతిక విప్లవంతో మానవాళి జీవితాల్లో పెనుమార్పులు చోటుచేసుకుంటున్నాయి. భూమి కుగ్రామం అయిపోయింది. దూరాలు కాగితాలకు మాత్రమే పరిమితం అయ్యాయి. దేశ సరిహద్దులు రేఖలుగా మిగిలిపోతున్నాయి. స్మార్ట్ తెరలపై కొనవేళ్లతో తాకుతూ ప్రపంచాన్ని చుట్టేస్తున్నాం. డిజిటల్ మానవుడి జీవనశైలిలో సమూల మార్పులు కనిపిస్తున్నాయి. తినే తిండి నుండి ఆర్థిక లావాదేవీల వరకు అన్నీ డిజిటల్ మయం అవుతున్నాయి. అతి సుఖానికి, అత్యాశల సంపాదనకు మరిగిన మనిషిలో స్వార్థం పెరిగిపోతున్నది. నేటి దురాశతో రేపటి ఆరోగ్యకర పర్యావరణంతో రణం చేస్తున్నాడు. మానవ విలువలు, కుటుంబ పునాదులు కదులుతున్నాయి. ఒకప్పటి ఉమ్మడి కుటుంబాలు అంతరించి న్యూక్లియర్ ఫ్యామిలీలు వెలుస్తున్నాయి. నాటి నాగరికత, మానవీయ విలువలతో కూడిన పౌర సమాజం నేడు విధ్వంసం వైపు వేగంగా పరుగిడుతున్నది.

పంచ పరివర్తన్ - ఐదు సానుకూల మార్పులు

ఈ ప్రతికూల మార్పులకు అడ్డుకట్ట వేయాల్సిన అగత్యం ఏర్పడిందని గమనించిన ఆర్ఎస్ఎస్ సంస్థ తన శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఐదు ప్రధాన అంశాలను "పంచ పరివర్తన్ (ఐదు సానుకూల మార్పులు)" అనే పేరుతో గుర్తించి విస్తృత ప్రచారం నిర్వహించడం జరుగుతుంది. ఈ విధంగా గుర్తించిన ఐదు సమస్యలపై పోరాడి పునరుద్ధరించడానికి తగు ప్రజా చైతన్యం కల్పిస్తున్నారు. పంచ పరివర్తన్ సూత్రాలు నేడు ప్రపంచ మానవాళి, ముఖ్యంగా భారతీయ సమాజానికి అత్యవసరం అని గమనించాలి. ఆర్ఎస్ఎస్ గుర్తించి చేపట్టిన ఐదు (సకారాత్మక) మార్పుల్లో పర్యావరణ పరిరక్షణ, కుటుంబ (ప్రబోధన్) విలువల పునరుద్ధరణ, సమరసత లేదా హిందుస్థాన్‌లో సమైక్యత సాధన, స్వదేశీ ఉద్యమం, పౌర విధుల నిర్వహణ అనే అంశాలు ఉన్నాయి.

1. పర్యావరణ పరిరక్షణ

దినదినం పర్యావరణానికి ప్రమాదం వాటిల్లుతున్నది. ప్రకృతి విధ్వంసం జరుగుతున్నది. పీల్చే గాలి గరళం అవుతున్నది. తాగే నీరు విషతుల్యం అవుతున్నది. నడిచే నేల ఎడారిగా, కాలుష్యాల కుప్పలుగా మారుతున్నది. అభివృద్ధి పేరుతో పర్యావరణం విధ్వంసం అవుతున్నది. మానవ ఆధునిక జీవనశైలితో కాలుష్యం కోరలు చాస్తున్నది. నేడు కావలసినది కేవలం అభివృద్ధి కాదు, సుస్థిరాభివృద్ధి కావాలనే నినాదాలు హోరెత్తుతున్నాయి. పర్యావరణ పరిరక్షణకు కట్టుబడిన అభివృద్ధి కావాలని గుర్తిస్తున్నాం. రేపటి తరం ఆరోగ్యంగా బతకడానికి నేడు పర్యావరణ పరిరక్షణకు బీజాలు పడాలి. తాత్కాలిక లాభాలకు లొంగి శాశ్వత వినాశనం కోరుకోరాదు. ప్లాస్టిక్ వాడకం భూగోళాన్ని సంక్షోభంలోకి నెడుతున్నది. ఓజోన్ పొర పలుచన అవుతున్నది. అడవులు, హరిత క్షేత్రాలు అదృశ్యం అవుతున్నాయి. భూతాపం భయపెడుతున్నది. కార్బన్ ఉద్గారాలు ప్రజారోగ్య సమస్యలకు కారణం అవుతున్నాయి. సారవంతమైన నేలలు నిస్సార ఎడారులుగా మారిపోతున్నాయి. నేడు మనం కూర్చున్న కొమ్మను మనమే నరుక్కుంటున్నాం. మన బొందను మనమే తవ్వుకుంటున్నాం. వ్యవసాయంలో ప్రమాదకర రసాయనాలు, క్రిమిసంహారక మందులు విచక్షణారహితంగా వాడుతూ, రేపటి ప్రమాదానికి నేడు బీజాలు వేస్తున్నాం. తినే ఆహారం విషతుల్యం అవుతున్నది. ప్రజారోగ్యం గాల్లో దీపం అవుతున్నది. మన జీవనశైలిలో స్వల్ప మార్పులతో పర్యావరణ పరిరక్షణకు పట్టం కట్టడం నేటి అత్యవసర కార్యంగా గుర్తించాలి. శిలాజ ఇంధనాలకు బదులు తరగని సాంప్రదాయేతర ఇంధనాలను వాడాలి. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలి. జల సంరక్షణకు కంకణబద్దులం కావాలి. మొక్కలు నాటడంతో పాటు అడవులను కాపాడుకోవాలి. ప్రకృతిని దేవతగా పూజించే పౌర సమాజం దానిని సంరక్షించుకోవాలి. రేపటి సమాజానికి సంపద, ఆస్తులతో పాటు ఆరోగ్యకర వాతావరణాన్ని బహుమతిగా ఇవ్వాలి. స్వచ్ఛమైన పర్యావరణం లేని పక్షంలో మన సంపాదన అనుభవించే ఆరోగ్యకర కుటుంబాలు ఉండవు. పర్యావరణ పరిరక్షణ దిశగా పటిష్ట అడుగులు వేయాలి. నాటి సహజ ప్రకృతిని నేడు తిరిగి పునఃప్రతిష్టించాలి.

2. విలువలతో కూడిన కుటుంబ ప్రబోధన్) వ్యవస్థ

భారతీయ కుటుంబ వ్యవస్థకు ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు ఉన్నది. ఉమ్మడి కుటుంబాలు ప్రేమతో కలిసిమెలిసి కష్టసుఖాలు పంచుకుంటాయి. నేడు చిట్టి కుటుంబాలు, సహజీవన సంసారాలు, డేటింగ్ సంస్కృతులు, సిచువేషన్‌షిప్ రిలేషన్స్ లాంటి విపరీత (అక్రమ) సంబంధాలు సర్వసాధారణం అయిపోయి విలువల పతనానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. పాశ్చాత్య సంస్కృతి వరదలో నేటి యువత కొట్టుకుపోతున్నారు. ప్రేమ, వాత్సల్యాలకు కొత్త నిర్వచనాలు పుట్టుకు వచ్చాయి. పెళ్లిళ్లు పెటాకులు అవుతున్నాయి. మామిడి తోరణాలు వాడక ముందే విడాకుల విపరీతాలు సంభవిస్తున్నాయి. మంగళసూత్రం అప్పుడప్పుడు వాడుకునే అలంకార ఆభరణం అయ్యింది. భార్యాభర్తలు, తోబుట్టువులు మధ్య హింసాత్మక ధోరణులు పెరుగుతున్నాయి. తల్లిదండ్రులు సంతానానికి భారమైపోతున్నారు. కలిసి భోజనం చేయడం అరుదైపోతున్నది. అనురాగం, ఆప్యాయత, త్యాగం, మమతానుబంధాలు పలుచబడుతున్నాయి. మన సంస్కృతి, సాంప్రదాయాలకు విరుద్ధంగా కొత్త కొత్త, పొట్టి పొట్టి వేషధారణలు ఫ్యాషన్ అయిపోయాయి. మన వాతావరణానికి తగిన దుస్తులకు బదులు ప్రతికూల ప్రభావం చూపే పరాయి దేశాల వస్త్రాలకు గిరాకీ పెరుగుతోంది. మాతృభాష పలకడం అవమానకరం అన్న భావనలు మొలుస్తున్నాయి. మన నగరాలు/పల్లెలు కాంక్రీట్ జంగిల్స్ అయ్యాయి.

వసరం – సూత్రాలు

మన గృహాలు అనారోగ్య సంబంధాలకు హేతువులుగా మారాయి. మనం నివసిస్తున్న గృహాలను ఆనందభవనాలు, శాంతి నివాసాలు అనే బదులు నేడు అశాంతి నెలవులు అనే దుస్థితి దాపురించింది. ఇంట్లో ప్రశాంతత, నిర్మలత్వం, పవిత్రత కరువైపోతున్నాయి. నాడు ఇంటిని స్వర్గంగా భావించాం. నేడు ఇంటిని విరామ (లాడ్జింగ్) కేంద్రంగా మార్చేసాం. నాడు ఇంటి గోడలను ప్రేమల ఇటుకలతో కట్టుకున్నాం. నేడు షరతులతో కూడిన గోడలు కట్టుకుంటున్నాం. బాధ్యత, త్యాగాలను మరిచి పోతున్నాం.

3. సమైక్యత - సమరసత

కులమతాల అడ్డుగోడలతో పౌర సమాజం విచ్ఛిన్నం అవుతున్నాయి. హింసాత్మక ధోరణులు పెరుగుతున్నాయి. కులం, మతం ముందు మానవత్వం వెలవెలబోతున్నది. హిందూస్థాన్‌లో జీవిస్తున్న జనాభా సంఘటితం కావాలనే ఉద్యమం చేవట్టాలి. కులమతాలకు అతీతంగా ఏకం కావలసిన అగత్యం ఏర్పడింది. శాంతియుత సమైక్య పౌర సమాజం పునర్–నిర్మాణం జరగాలి. ఆరు ముఖ్య మతాలు, 3000లకు పైగా కులాలు, 25,000 వరకు ఉపకులాలు ఉన్న హిందూ భారతం నేడు సమైక్య శక్తిగా ఎదగాలి. బడుగు, బలహీన వర్గాలు, బలమైన అగ్ర వర్గాలు కాకుండా బాధ్యతగల పౌర వర్గాలుగా పునరేకీకరణ కావాలి. అంటరానితనం అంతం కావాలి. కులం పేరుతో పాతాళంలోకి కూరుకు పోరాదు.

మతం పేరుతో మానవత్వం మరువరాదు. అందరం కలిసిమెలిసి కదం తొక్కాలి. ప్రపంచానికి సమైక్య భారతీయ సమాజం దారి దీపం కావాలి. సమరసత భావనలను సమాజంలోకి విస్తరించడానికి విహెచ్‌పి చేస్తున్న కృషి శ్లాఘనీయం. ఉన్నవాడు, లేనివాడు, అగ్ర, నిమ్న వర్గాలు లాంటి పదాలకు తావులేకుండా మేధావులు, శ్రమజీవులు అనే పదాలకు కట్టుబడి ఉండాలి. కులమతాల విభేదాలకు ఆజ్యం పోస్తున్న దేశద్రోహులను ఏరి పారేయాలి, పాతరేయాలి.

4. స్వదేశీ

డిజిటల్ ప్రపంచంలో 4వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించింది. భారత్ సుస్థిరాభి వృద్ధిలో దూసుకుపోతున్నది. విదేశీ సంబంధాలు పటిష్టం అవుతున్నాయి. మన ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి విదేశీ దిగుమతు లను తగ్గించడం, ఎగుమతులను పెంచడం జరగాలి. దిగుమతులను తగ్గించడానికి స్వదేశీ వస్తువుల ఉత్పత్తి, వినియోగం పెరగాలి. భారతీయ ఉత్పత్తు లను అక్కున చేర్చుకోవాలి. విదేశీ వస్తువుల వినియోగం తగ్గించాలి. యువభారతం నైపుణ్య విద్య కలిగిన మహోన్నత శక్తిగా ఎదగాలి. దేశీయ వస్తు సేవలకు పట్టం కట్టాలి. స్వదేశీ దుస్తులు, ఆహార ఉత్పత్తులు, గృహ నిర్మాణాలు, నిత్య అవసరాలను తయారు చేసే కేంద్రంగా భారత్ కొత్తపుంతలు తొక్కాలి. విదేశీ వస్తు దిగుమతుల వరదలకు అడ్డుకట్ట పడాలంటే ప్రత్యామ్నాయ స్వదేశీ వస్తు ఉత్పత్తులు, వినియోగం విరివిగా జరగాలి. నేటి మన యువత రేపటి టెక్నోక్రాట్లు, సైంటిస్టులు, ఇన్నొవేటర్స్, క్రియేటర్స్, ఎంటర్‌ప్రూనర్స్, బిజినెస్‌మెన్, ట్రేడ్స్‌మెన్, రీసెర్చర్స్ కావాలి. భారతదేశం విదేశాలను ఆదర్శంగా నిలవాలి.

5. పౌర విధులు - బాధ్యత కలిగిన పౌర సమాజం

భారత రాజ్యాంగం మనకు హక్కులతో పాటు బాధ్యతలను కూడా ఇవ్వడం జరిగింది. హక్కులు అనుభవించే పౌరులు బాధ్యతలు కూడా భుజాన వేసుకోవాలి. పౌర విధులు తూచా తప్పకుండా పాటించాలి. స్వీయ క్రమశిక్షణ మన శాశ్వత ఆభరణం కావాలి. పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉండాలి. పౌర నియమనిబంధనలను పాటించడం మరువరాదు. ప్రభుత్వ ఆస్తులను కాపాడుకోవాలి. పన్నులను విధిగా చెల్లించాలి. మన విధులను మనస్ఫూర్తిగా నిర్వహించాలి. అక్రమాలు, అవినీతి, లంచగొండితనాలకు తావులేని భారతం నిర్మితం కావాలి. క్రమశిక్షణ కలిగిన సైనికుల వలె మన జీవనశైలి క్రమబద్ధం కావాలి. రోడ్డు నియమాలు పాటించాలి. జాతీయ ఆదాయానికి దోహదపడాలి. చట్టాలను గౌరవించాలి. నైతికతతో కూడిన రాజకీయ వ్యవస్థ కావాలి. ఉద్యోగులు తమ విధులకు కట్టుబడి ఉండాలి. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి. దేశ రక్షణ విషయంలో ప్రాణాలకు తెగించి ముందుకు రావాలి. జాతి సహజ వనరులపై దొంగ చూపు సారించే ప్రబుద్ధుల కళ్లు పీకేయాలి. మన గాలి, మన నీరు, మన నేల అనే నినాదం నిత్య మంత్రం కావాలి.

రాబోయే రోజుల్లో అగ్ర రాజ్యాల సరసన అభివృద్ధి చెందిన దేశంగా మనదేశం నిలువడానికి పంచ పరివర్తన్ సూత్రాలు ఎంతగానో ఉపయోగ పడతాయి. పర్యావరణాన్ని సంరక్షించుకుంటూ, కుటుంబ విలువలకు పట్టం కడుతూ, స్వదేశీ వస్తు వినియోగాలకు ఊతం ఇస్తూ, సమైక్యతకు పెద్ద పీట వేస్తూ, పౌర విధులకు ప్రాణం పోస్తూ ముందుకు సాగుతున్న భారతావనికి భవ్య భవిష్యత్తు నిక్కంగా కనిపిస్తున్నది. 1.47 బిలియన్ల భారత్ జనాభా పంచ పరివర్తన్ సూత్రాల పునాదులపై ఏకతాటిపై నిలిస్తే, మన ఎదుగుదల పరాయి దేశాలకు ఈర్ష్యజనకంగా, స్వదేశీయులకు గర్వకారణంగా నిలుస్తుందనడంలో అతిశయోక్తి లేదు. జై జవాన్, జై కిసాన్, జై విద్వాన్, జై అనుసంధాన్ !

రాబోయే రోజుల్లో అగ్ర రాజ్యాల సరసన అభివృద్ధి చెందిన దేశంగా మనదేశం నిలువ డానికి పంచ పరివర్తన్ సూత్రాలు ఎంతగానో ఉపయోగ పడతాయి. పర్యావరణాన్ని సంరక్షించుకుంటూ, కుటుంబ విలువలకు పట్టం కడుతూ, స్వదేశీ వస్తు వినియోగాలకు ఊతం ఇస్తూ, సమైక్యతకు పెద్ద పీట వేస్తూ, పౌర విధులకు ప్రాణం పోస్తూ ముందుకు సాగుతున్న భారతావనికి భవ్య భవిష్యత్తు నిక్కంగా కనిపిస్తున్నది.

డా. బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

నడిచే భూ

విశ్వంలో అద్భుతమైన సృష్టి 'భూమి' అయితే, ఆ సృష్టిలో అత్యంత సంక్లిష్టమైన నిర్మాణం 'మానవ శరీరం'. పచ్చని ప్రకృతి ఒక మహా కావ్యం అయితే, మనిషి అందులో ఒక అక్షరం. భూమికి, శరీరానికి ఉన్న సంబంధం కేవలం నివాసానికి సంబంధించింది కాదు. ఇది తల్లికి, బిడ్డకు మధ్య ఉండే నాభి బంధం వంటిది.

విశ్వం ఒక మహా సముద్రం అయితే, భూమి అందులో ఒక ద్వీపం. ఆ ద్వీపంలోని మట్టి, నీరు, గాలి, అగ్ని తత్వాల కలయికతో తయారైన ఒక అద్భుత యంత్రమే మానవ శరీరం. మనం భూమి మీద నివసించడం లేదు, నిజానికి మనం ఈ భూమిలో ఒక భాగమై జీవిస్తున్నాం. మన దేహం భూమి సజీవ ప్రతిరూపం. ఆధునిక ఖగోళ భౌతిక శాస్త్రం ప్రకారం, కోట్లాది ఏళ్ల క్రితం నక్షత్రాల విస్ఫోటనం ద్వారా విడుదలైన మూలకాలే భూమిగా మారాయి. మన శరీరంలోని 97% మూలకాలు (కార్బన్, నైట్రోజన్, ఆక్సిజన్, కాల్షియం, ఇనుము) అచ్చం భూమి పొరల్లో ఉన్నవే. మన రక్తంలో ప్రవహించే ఇనుము, ఎముకల్లోని కాల్షియం మట్టి నుండి వచ్చినవే. అందుకే మనిషిని "నడిచే మట్టి" అని పిలవడం శాస్త్రీయంగా నూటికి నూరు పాళ్లు నిజం.

దేహం ఒక దేవాలయం అయితే, భూమి ఆ దేవాలయానికి పునాది. పునాది బలహీనపడితే కట్టడం కూలిపోతుంది. అందుకే భూమిని రక్షించుకోవడం అంటే మనల్ని మనం రక్షించుకోవడమే. ప్రకృతితో కలిసి జీవించడమే నిజమైన ఆరోగ్యం.

మన శరీరంలోని ఏడు చక్రాలలో మొదటిది 'మూలాధార చక్రం'. ఇది 'పృథ్వీ తత్వానికి' సంబంధించింది. భూమి మనకు ఎలాగైతే ఆధారాన్ని ఇస్తుందో, మూలాధార చక్రం శరీరానికి స్థిరత్వాన్ని, భద్రతను ఇస్తుంది. యోగాలో శరీరాన్ని ఐదు పొరలుగా (కోశాలు) చూస్తారు. అందులో మొదటిది 'అన్నమయ కోశం'. ఇది పూర్తిగా భూమి నుండి వచ్చే ఆహారంపై ఆధారపడి ఉంటుంది. అంటే మన భౌతిక శరీరం కేవలం "రూపాంతరం చెందిన మట్టి" మాత్రమే.విశ్వంలో నిండి ఉన్న ప్రాణశక్తి మనలో శ్వాస రూపంలో ప్రవహిస్తుంది. భగవత్ చింతన ద్వారా మనం ప్రకృతిలోని శక్తితో అనుసంధానం అవుతాము. ఆధునిక విజ్ఞాన శాస్త్రం కూడా భూమికి, శరీరానికి మధ్య ఉన్న పరమాణు స్థాయి బంధాన్ని ధృవీకరిస్తోంది. పురాణాల ప్రకారం మన శరీరం "పంచభూతాల" (పృథ్వి, ఆపస్సు, తేజస్సు, వాయువు, ఆకాశం) కలయిక. శాస్త్రీయంగా చూసినా భూమిలో ఉండే మూలకాలే మన శరీరంలోనూ ఉన్నాయి.

స్టార్ డస్ట్ (నక్షత్ర ధూళి) సైన్స్ ప్రకారం, భూమి ఏర్పడటానికి కారణమైన అదే మూలకాలు (కార్బన్, నైట్రోజన్, ఆక్సిజన్) మన శరీర నిర్మాణంలోనూ ఉన్నాయి. అందుకే శాస్త్రవేత్తలు మనల్ని "నక్షత్రాల బిడ్డలు" అని పిలుస్తారు. ఎలక్ట్రో మాగ్నెటిక్ ఫీల్డ్ (అయస్కాంత క్షేత్రం) భూమికి ఒక ఉత్తర ధృవం, దక్షిణ ధృవం ఉన్నట్టే, మానవ శరీరానికి కూడా సూక్ష్మమైన విద్యుదయస్కాంత క్షేత్రం ఉంటుంది.

భూమి ఒక భారీ విద్యుత్ క్షేత్రం. మన హృదయం, మెదడు కూడా విద్యుత్ సంకేతాల (Bio-electricity) ద్వారానే పనిచేస్తాయి. మనం చెప్పులు లేకుండా భూమిపై నడిచినప్పుడు, భూమిలోని 'నెగటివ్ ఎలక్ట్రాన్లు' మన శరీరంలోకి ప్రవేశిస్తాయి. ఇది శరీరంలో ఉన్న ఫ్రీ రాడికల్స్‌ను తటస్థం చేసి, రోగ నిరోధక శక్తిని పెంచుతుందని ఆధునిక 'ఎర్థింగ్ సైన్స్' నిరూపిస్తోంది. మనం భూమితో అనుసంధానమై ఉన్నప్పుడే మన శరీరం గరిష్ట ఆరోగ్యంతో ఉంటుంది. మనం భూమిపై నగ్న పాదాలతో నడిచినప్పుడు భూమిలోని ఎలక్ట్రాన్లు మన శరీరంలోకి ప్రవేశించి వాపులు తగ్గడానికి, ఒత్తిడి తగ్గడానికి సహాయపడతాయని విజ్ఞాన శాస్త్రం చెబుతోంది.

భూమిలోని మట్టిలో కోట్లాది సూక్ష్మజీవులు ఉండి మట్టిని సారవంతం చేస్తాయి. అలాగే మన పేగుల్లో కూడా కోట్లాది బ్యాక్టీరియాలు ఉండి జీర్ణక్రియను, రోగనిరోధక శక్తిని కాపాడతాయి. మట్టిలోని జీవవైవిధ్యానికి, మన శరీరంలోని జీవవైవిధ్యానికి పోలిక ఉంది.

నదులు కలుషితమైతే భూమి నిస్సారమవుతుంది. రక్తం అశుద్ధమైతే శరీరం రోగగ్రస్తమవుతుంది. భూమిపై నీటి లభ్యత శరీరంలో నీటి శాతం (దాదాపు 70%) సరిగ్గా ఒకేలా ఉండటం ప్రకృతి వైచిత్రి.

"యథా పిండే తథా బ్రహ్మాండే" – అంటే ఈ విశ్వంలో ఏముందో, అది మన శరీరంలోనూ ఉంది అని అర్థం. ప్రకృతి, మానవ శరీరం వేర్వేరు కావు. భూమి ఒక పెద్ద జీవ వ్యవస్థ అయితే, మన శరీరం దానిలోని ఒక సూక్ష్మ రూపం. భూమిని 'ధరణీ మాత' అని పిలవడంలో ఉన్న పరమార్థం ఏమిటంటే, మనల్ని నిర్మించే ప్రతి అణువు ఆ భూమి నుండి వచ్చినదే. భూమికి అడవులు ఊపిరితిత్తుల వంటివి. అవి గాలిని శుద్ధి చేసి జీవరాశికి ప్రాణవాయువును అందిస్తాయి. మన శరీరంలో ఊపిరితిత్తులు కూడా అదే పనిని చేస్తాయి. అడవులను నరికివేయడం అంటే భూమి శ్వాసను అడ్డుకోవడమే, అది పరోక్షంగా మనిషి శ్వాసకోస వ్యవస్థపై ప్రభావం చూపుతుంది.

మట్టిలో ఉండే మెగ్నీషియం, కాల్షియం, ఇనుము వంటి ఖనిజాలే మన ఎముకల బలానికి, గుండె పనితీరుకు మూలం. మనం తీసుకునే ఆహారం భూమి నుండి వస్తుంది. భూమి రసాయనాలతో నిండిపోతే, ఆ

గోళం.. మన దేహం..!

విషం ఆహారం ద్వారా మన శరీరంలోకి ప్రవేశిస్తుంది. అంటే "మట్టి ఆరోగ్యం – మనిషి ఆరోగ్యం" ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. శాస్త్రీయంగా చూస్తే, భూమి పొరలలో ఉండే ఇనుము, కాల్షియం, పొటాషియం, సోడియం వంటి మూలకాలే మన రక్తంలోనూ, ఎముకల్లోనూ ఉన్నాయి. మనం భూమి నుండి పండిన ఆహారాన్ని తిన్నప్పుడు, ఆ మట్టిలోని సత్తువ మన శరీరానికి బలాన్ని ఇస్తుంది. మరణించిన తర్వాత శరీరం తిరిగి మట్టిలోనే కలిసిపోతుంది.

భూమి తన చుట్టూ తాను తిరుగుతూ రుతువులను, పగలు రాత్రిని ఎలా మారుస్తుందో, మన శరీరం కూడా అలాగే స్పందిస్తుంది. సూర్యోదయంతో శరీరంలోని హార్మోన్లు ఉత్తేజితం కావడం, రాత్రి కాగానే నిద్రకు ఉపక్రమించడం వంటివన్నీ భూమి గమనంతో ముడిపడి ఉన్నాయి.

భూమి మనకు ఆహారాన్ని, నీటిని, నివాసాన్ని ఇస్తుంది. మన శరీరం ఆ పోషణను గ్రహించి అభివృద్ధి చెందుతుంది. భూమిపై చెట్లు ఆక్సిజన్‌ను విడుదల చేసి కార్బన్ డై ఆక్సైడ్‌ను గ్రహిస్తాయి. మన శరీరం దానికి విరుద్ధంగా ఆక్సిజన్‌ను పీల్చి కార్బన్ డై ఆక్సైడ్‌ను వదులుతుంది. ఈ రెండింటి మధ్య ఒక అద్భుతమైన పరస్పర ఆధారిత బంధం ఉంది. భూమికీ, మానవ శరీరానికి మధ్య ఉన్న సంబంధం చాలా లోతైనది.

మట్టిలో తిరిగే పిల్లల్లో రోగనిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని శాస్త్రవేత్తలు గుర్తించారు. మట్టిలోని 'మైకోబాక్టీరియం వాక్కే' (Mycobacterium vaccae) వంటి సూక్ష్మజీవులు మానవ మెదడులో సెరోటోనిన్ అంటే ఆనందాన్ని ఇచ్చే హార్మోన్ విడుదలకు దోహదపడతాయని నిరూపితమైంది.

భూమి కలుషితమైతే మానవ ఆరోగ్యమూ దెబ్బతింటుంది అనడానికి ఇదే నిదర్శనం. మట్టితో సంబంధం కోల్పోయిన మనిషి తన రోగనిరోధక శక్తిని కోల్పోతాడని 'హైజీన్ హైపోథెసిస్' చెబుతోంది. మన శరీరం లోపల కూడా ఒక చిన్న 'పర్యావరణ వ్యవస్థ' నిరంతరం పనిచేస్తూనే ఉంటుంది.

భూమి మన భారాలను మోస్తూ, విచక్షణా రహితంగా మనం చేసే గాయాలను భరిస్తూ తిరిగి మనకు ఫలాలను ఇస్తుంది. శరీరం కూడా మనం చేసే తప్పులను (చెడు అలవాట్లు, సరైన నిద్ర లేకపోవడం) భరిస్తూ నిరంతరం మనల్ని కాపాడటానికి ప్రయత్నిస్తుంది. కానీ రెండింటికీ ఒక హద్దు ఉంటుంది, ఆ హద్దు దాటినప్పుడు విపత్తులు సంభవిస్తాయి. నేడు మనం భూమిని ఒక వస్తువులా చూస్తున్నాం, కానీ అది మన శరీరంలో ఒక భాగమని గుర్తించాలి. భూమికి రసాయనాలు దూరంగా ఉంచితే, మన శరీరానికి వ్యాధులు దూరంగా ఉంటాయి. మనల్ని పోషిస్తున్న మట్టిని, నీటిని గౌరవించడం నేర్చుకోవాలి. మన సనాతనాచారాలు మనల్ని 'అంతర్ముఖంగా' ప్రకృతితో కలుపుతుంటే, విజ్ఞాన శాస్త్రం 'బాహ్యంగా' మన మధ్య ఉన్న భౌతిక బంధాన్ని నిరూపిస్తోంది. భూమిని తల్లిగా భావించినా లేదా ఒక జీవ వ్యవస్థగా చూసినా.. దాని ఆరోగ్యం పైనే మన మనుగడ ఆధారపడి ఉందనేది అక్షర సత్యం.

2017లో వైద్య శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందిన పరిశోధన ప్రకారం.. భూమి వెలుతురు, చీకటి చక్రాలకు అనుగుణంగా మన శరీరంలోని జన్యువులు పనిచేస్తాయి. భూభ్రమణానికి వ్యతిరేకంగా మనం జీవించినప్పుడు (నిద్ర లేకపోవడం, సరైన సమయానికి తినకపోవడం), అది క్యాన్సర్, మధుమేహం వంటి వ్యాధులకు దారితీస్తుంది. అంటే మన ఆరోగ్యం భూమి గమనంతో ముడిపడి ఉంది.

> **నేడు మనం భూమిని ఒక వస్తువులా చూస్తున్నాం, కానీ అది మన శరీరంలో ఒక భాగమని గుర్తించాలి. భూమికి రసాయనాలు దూరంగా ఉంచితే, మన శరీరానికి వ్యాధులు దూరంగా ఉంటాయి.**

శాస్త్రవేత్త జేమ్స్ లవ్‌లాక్ ప్రతిపాదించిన ఈ సిద్ధాంతం ప్రకారం, భూమి అనేది ఒక నిర్జీవమైన రాయి కాదు, అది ఒక "సెల్ఫ్-రెగ్యులేటింగ్ ఆర్గనిజం" (తనను తాను నియంత్రించుకునే ఒక జీవి). భూమి తన ఉష్ణోగ్రతను, సముద్రాల ఉప్పదనాన్ని ఎలాగైతే స్థిరంగా ఉంచుకుంటుందో మానవ శరీరం కూడా తన ఉష్ణోగ్రతను, రక్తంలోని pH స్థాయిని అలాగే స్థిరంగా ఉంచుకుంటుంది. భూమి ఉపరితలంపై ప్రవహించే నీరు, మన రక్త ప్రసరణ వ్యవస్థకు అద్దం పడుతుంది. భూమి తన చుట్టూ తాను తిరుగుతూ వెలుతురును, చీకటిని మారుస్తుంది. దీనికి అనుగుణంగానే మన శరీరంలో ఒక "జీవ గడియారం" పని చేస్తుంది. భూమిపై సూర్యరశ్మి మారినప్పుడు, మన శరీరంలో మెలటోనిన్, కార్టిసాల్ వంటి హార్మోన్లు విడుదలవుతాయి. భూభ్రమణ వేగంతో మన శరీర జీవక్రియలు ముడిపడి ఉండటం ఒక అద్భుతమైన శాస్త్రీయ అనుబంధం.

విజ్ఞాన శాస్త్రం ప్రకారం, భూమి ఒక 'సూపర్ ఆర్గానిజం'. అందులో మానవ శరీరం ఒక చిన్న కణం వంటిది. భూమి పర్యావరణం దెబ్బతింటే, మన శరీరంలోని రసాయన సమతుల్యత కూడా దెబ్బతింటుంది. అందుకే భూమిని కాపాడుకోవడం అంటే మన జన్యువులను (DNA) కాపాడుకోవడమే.

భూమికి, శరీరానికి మధ్య ఉన్నది కేవలం భౌతిక సంబంధం మాత్రమే కాదు, అది ఒక ఆత్మీయ బంధం. భూమిని మనం గౌరవించడం అంటే మన శరీరాన్ని మనం గౌరవించుకోవడమే. భూమికి చేసే ఏ హానీ అయినా, అది నేరుగా మన శరీర కణజాలానికి చేసుకునే 'గ్లానీ' అని సైన్స్ కూడా హెచ్చరిస్తోంది. ప్రకృతిని కలుషితం చేయడం అంటే మనల్ని మనమే విషతుల్యం చేసుకోవడమే. అందుకే "ప్రకృతిని రక్షించండి – అది మిమ్మల్ని రక్షిస్తుంది".

భూమి ఉపరితలంపై 70% నీరు ఉన్నట్టే, మానవ శరీరంలో కూడా సుమారు 70% నీరు ఉంటుంది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, సముద్రపు నీటిలోని లవణీయత, మన రక్తంలోని ప్లాస్మాలో ఉండే లవణాల శాతం దాదాపు ఒకేలా ఉంటాయి. భూమిపై నదులు ఎలాగైతే భూభాగానికి ప్రాణాన్ని ఇస్తాయో, మన రక్తనాళాలు శరీరంలోని ప్రతి కణానికి అలా ప్రాణవాయువును చేరవేస్తాయి.

భూమి తన చుట్టూ తాను తిరుగుతూ పగలు, రాత్రిని ఏర్పరుస్తుంది. మన శరీరంలోని ప్రతి కణంలో ఒక 'జీవ గడియారం' ఉంటుంది, ఇది భూమి భ్రమణానికి అనుగుణంగా పనిచేస్తుంది. సూర్యోదయంతో మన జీవక్రియలు మొదలవ్వడం, సూర్యాస్తమయంతో శరీరం విశ్రాంతికి సిద్ధమవ్వడం ప్రకృతితో మనకున్న విడదీయలేని బంధానికి నిదర్శనం. భూమి లయ తప్పితే, మన ఆరోగ్యం కూడా తప్పుతుంది. భూమికి గాయమైతే అది మన శరీరానికి తగిలిన గాయం లాంటిదే. భూమిలోని నీరు కలుషితమైతే మన రక్తం అశుద్ధమవుతుంది, భూమిపై అడవులు అంతరిస్తే మన శ్వాస భారమవుతుంది. మన శరీరం భూమి నుండి విడివడిన ముక్క కాదు, భూమి విస్తరణ మాత్రమే. అందుకే భూమిని ప్రేమించడం అంటే మనల్ని మనం ప్రేమించుకోవడమే. ప్రకృతితో మమేకమై జీవించడమే నిజమైన విజ్ఞానం, ఆరోగ్యం... ఆహ్లాదం.

తిరిగొప్పుల వి.ఎల్లెన్ మూర్తి
8008577834

భాగం-31

మార్క్సిజం-శ్రీరామరాజ్యం

మార్క్సవాద ఆవిర్భావం

మార్క్స్ వాదం రూపొందడానికి కారణమైన రాజకీయ పరిస్థితులను గురించి శ్రీకరపాత్రీ స్వామి ఈ వ్యాసంలో పేర్కొంటున్నారు. సోవియట్ రష్యాలో నిజానికి ప్రజాస్వామ్యం లేకపోయినప్పటికీ మార్క్స్ వాదులు దాన్ని ప్రజాస్వామ్య దేశంగా పేర్కొనడం వెనుకగల పరిస్థితులను వివరిస్తున్నారు.

మన శాస్త్రాలు మత్స్యన్యాయంతో (చిన్నచేపను పెద్దచేప తినేయడం) బాధపడుతున్న ప్రజలను రక్షించడానికే, వారి కోరిక ప్రకారం విశిష్ట శక్తి, గుణ సంపన్నులైన పాలకులు ఈశ్వరుని ద్వారా నియుక్తులవుతారు' అని స్పష్టంగా చెప్పాయి. ప్రజారంజకంగా పాలించడం రాజు పరమ కర్తవ్యం. అందువల్ల ప్రజాస్వామ్యానికి, 'ధర్మ నియంత్రితమైన రామరాజ్యం వంటి పాలనా వ్యవస్థను పూర్తిగా ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉంది. కేవలం ప్రజల వల్ల రూపొందినంత మాత్రాన పాశ్చాత్యుల రాజ్యభావన గొప్పదేమీ కాదు.

హాబ్స్ చెప్పిన 'దీర్ఘకాయుల రాజ్యం' వ్యక్తుల ద్వారానే ఏర్పడినంత మాత్రాన అది నిరంకుశమైనది కాకపోదు. కనుకనే ఆ సిద్ధాంతాన్ని లాంక్, రూసో హానికారకంగా పేర్కొన్నారు. ఆధునికులైన ఆలోచనాపరులు, 'సోషల్ కాంట్రాక్ట్ – సామాజిక ఒప్పందం లేదా అంగీకార పత్రా'న్ని అప్రామాణికంగా చెబుతారు.

బెంథమ్ మొదలైనవారు చెప్పేదేమిటంటే, 'వ్యక్తులకు సంఘజీవులుగా బతకడం హితకారకం కాబట్టి, సంఘం ఉపయోగించుకోవడానికి వీలుగా రాజ్యాన్ని రూపొందిస్తుంది. రాజ్యాన్ని ఒక కృత్రిమ సంస్థగా భావించడం వల్ల పౌరులు దానిలో మార్పుచేర్పులు చేయడం సాధ్యమవుతుందని అర్థం చేసుకోవచ్చు. కానీ, 'రాజ్యం ఈశ్వరీయ సంస్థయే'... అనే అభిప్రాయాన్ని అతడు చెప్పలేదు.

అలాగే రాజ్యంలో ఎటువంటి లోపాలు ఉండవు. ఇంకా దానిలో సంస్కరణలు అవసరం లేదు అనేది కూడా ఒప్పుకోలేదు. మానవుడి శరీరమే ఈశ్వరీయమైనది. హెగెల్ అనుయాయి అయిన మార్క్స్ తన గురువు చెప్పిన ద్వంద్వ వాదానికి 'ద్వంద్వాత్మక భౌతికవాదం' అనే రూపాన్ని ఇచ్చాడు. హెగెల్ వంటివారు ఆదర్శ రాజతంత్రాన్ని పరిపూర్ణంగా సమర్థించారు. అలాగే మార్క్స్ కూడా శ్రామికవర్గం అధినాయకత్వాన్ని సమర్థించాడు. రష్యాలో అతడి భావాలే బలంగా పాదుకున్నాయి.

హెగెల్ వాదులు, మార్క్స్ వాదులు ఆ రకంగా అధినాయక వాదానికి ప్రాధాన్యం కల్పించారు. దీనితో ప్రజాస్వామ్యానికి ఎలాంటి పోలిక, పొంతన లేదు. సోవియట్ రష్యాలో అభివృద్ధి అవశ్యం అయింది. కానీ అక్కడ వ్యక్తిగత స్వతంత్రత వంటి విలువైన వస్తువు అదృశ్యమైంది. ఒక పక్షి కూడా కమ్మని పళ్లు తిని, చల్లటి నీళ్లు తాగి బంగారు పంజరంలో బందీగా ఉండడానికి ఇష్టపడదు. దానికి బదులుగా స్వేచ్ఛగా ఉంటూ పుల్లని పళ్లు తినడానికి, ఉప్పునీళ్లు తాగి బతకడానికి ఇష్టపడుతుంది. అటువంటప్పుడు మానవులు మాత్రం అటువంటి పక్షికంటే ఏం తక్కువ? అతడు కూడా స్వేచ్ఛగా బతకాలనుకుంటాడు కదా! సంకెళ్లలో స్వేచ్ఛను కోరుకుంటాడా?

మార్క్స్ వాదుల ప్రకారం రాజ్యం రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి– పౌరుల హక్కులను కాలరాసే నియంతృత్వం; రెండోది– పెట్టుబడిదారుల కనుసన్నలలో నడిచే రాజ్యం. రష్యాలో ప్రభుత్వం రాజనీతి శాస్త్రానికి విరుద్ధంగా ఉంటుంది. ప్రజాస్వామ్యానికి ముఖ్యాంగాలు... మాట్లాడే స్వేచ్ఛ, పనిచేసే హక్కు, సంఘంగా ఏర్పడే హక్కు... ఈ హక్కులకి రష్యాలో తావులేదు. సోవియట్ వ్యవస్థకు విరుద్ధంగా అక్కడ ఎవరూ తమ వ్యక్తిగత అభిప్రాయాలను వ్యక్తం చేయలేరు. ఎటువంటి సంఘ నిర్మాణానికీ ఆస్కారం ఉండదు. అయినప్పటికీ మార్క్స్ వాదులు రష్యాలోని ప్రభుత్వాన్ని ప్రజాస్వామ్యంగా పిలిచే సాహసం చేస్తుంటారు.

స్టాలిన్ అభిప్రాయం ప్రకారం పెట్టుబడిదారీ వ్యవస్థ ఉన్న దేశాల్లో వివిధ వర్గాల మధ్య వర్గ సంఘర్షణను రాజకీయ పార్టీలు ప్రతిబింబిస్తాయి.

అంటే ఒక రాజకీయ పార్టీ ఒక వర్గానికి లేదా కొన్ని వర్గాల సంఘర్షణకు ప్రతినిధిత్వం వహిస్తూ ఉంటుంది. సోవియట్ రష్యాలో వర్గభావాలు అంతరించి పోయాయి. అందువల్ల అక్కడ రాజకీయ పార్టీల అవసరం లేదు. కానీ రాజనీతి శాస్త్రం ప్రకారం రాజకీయ పార్టీల అవసరం లేదు.

కానీ రాజనీతి శాస్త్రం ప్రకారం రాజకీయ పార్టీలను ప్రజాస్వామ్యానికి ప్రాణతుల్యంగా భావిస్తారు. పార్టీలను వర్గాలకు చెందినవాటిగా గుర్తించి, వ్యవస్థకు పార్టీలు అనవసరం అని చెప్పడం ప్రజాస్వామ్య ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుంది. ప్రతిపక్షం లేకుండా వాస్తవికంగా ప్రజాస్వామ్యం నిలబడడం అసాధ్యం. అయినప్పటికీ ఎక్కడైతే మాట్లాడే హక్కు, రాసి ప్రచురించే హక్కు, సంఘంగా రూపొందే హక్కు ఉంటాయో అక్కడే, 'వర్గాలు అంతమయ్యాయి' అని చెప్పడం అనుభవంలోకి వస్తుంది.

మార్క్సిస్టుల ప్రకారం, శ్రామికవర్గం అధికారంలోనికి రావడం అనేది కాల పరివర్తనకు చెందినది. అంతిమంగా దీనిలో ఉత్పత్తి, ఆర్థిక వృద్ధితో పాటు సువ్యవస్థ ఏర్పడడం ద్వారా రాజ్యభావన పూర్తిగా లోపిస్తుంది. వర్గవిహీన, రాజ్యవిహీన సమాజ స్థాపన జరుగుతుంది. కానీ స్టాలిన్ ఏం చెప్పాడంటే... 'సోవియట్ రాజ్యం పెట్టుబడి దారీ రాజ్యాల మధ్య ఇరుక్కుని ఉంది. బహుశా రాజ్యభావన అంతమై పోవాలని చెప్పిన స్టాలిన్, అంతర్జాతీయంగా ఏర్పడబోయే పరిస్థితులను అంచనా కట్టలేకపోయాడు.

మార్క్సిస్టులు మాస్కోలో జరిగిన చరిత్రాత్మక న్యాయపోరాటాలను సోవియట్ ఆదర్శాలకు విరుద్ధంగా జరిగిన కుట్రలని చెబుతూ, 'సోవియట్ దేశానికి ఆయుధాలను భారీ ఎత్తున సమకూర్చడం, గూఢచర్యం వహించేందుకు పకడ్బందీ అయిన పోలీసు వ్యవస్థను ఏర్పరచడం... దేశాన్ని పూర్తిస్థాయిలో దృఢంగా తీర్చిదిద్దడం అవసరం' అని చెప్పారు. అందువల్ల రాజ్యభావన లోపించడం అనే కల్పన కేవలం ఆలోచనలకు మాత్రమే పరిమితం అయింది.

హిందీమూలం : కరపాత్రీ స్వామి
అనువక్త : నేతి సూర్యనారాయణశర్మ

ధర్మబద్ధమైన సంపాదనే సంపద

సమాజానికి పునాదిగా సంపద (ధనం) కేవలం భౌతిక లక్ష్యం మాత్రమే కాదు–అది ఒక గౌరవనీయమైన సమాజానికి నిజమైన వెన్నెముక. ఆర్థిక బలం లేకుండా ఏ నాగరికత కూడా విద్యను, ఆరోగ్యాన్ని, సాంస్కృతిక కొనసాగింపును లేదా సామాజిక స్థిరత్వాన్ని నిలబెట్టుకోలేవు. పేదరికం వ్యక్తులను మాత్రమే కాదు, మొత్తం సమాజాలను బలహీన పరుస్తుంది. విశ్వాసాన్ని, సామర్థ్యాన్ని, ఐక్యతను క్షీణింపజేస్తుంది. ధార్మిక దృష్టికోణంలో సంపదను తిరస్కరించరు. ధర్మబద్ధంగా సంపాదించినప్పుడు అది పవిత్రమైన, గౌరవప్రదమైన నియంత్రణకు నోచుకుంటుంది. "ధర్మేణ అర్థః ప్రభవతి" అంటే ధర్మం నుండి సంపద ఉద్భవిస్తుంది.

ప్రాచీన అర్థశాస్త్రం అర్థాన్ని (సంపదను) రాజనీతికి, సామాజిక వ్యవస్థకు కేంద్రంగా ఉంచుతుంది. ధర్మం, మోక్షం కూడా భౌతిక స్థిరత్వంపై ఆధారపడుతున్నాయని గుర్తిస్తుంది. సంపద లేకుండా నైతిక జీవితం గానీ, మానవ ఆశయాలు గానీ నిలవవు అని కౌటిల్యుడు ఎప్పుడో సూచించాడు. స్వామి వివేకానంద కూడా ఇదే వాస్తవాన్ని ప్రతిధ్వనిస్తూ, ఖాళీ కడుపుతో ఆధ్యాత్మికత వికసించదని గుర్తుచేశాడు. డా. బి. ఆర్. అంబేద్కర్ ఈ సత్యాన్ని ఆధునిక రూపంలో బలపరుస్తూ, ఆర్థిక సంస్కరణలే సామాజిక సంస్కరణలకు పునాది అని పేర్కొన్నారు. భగవద్గీత కూడా ఒక లోతైన సూత్రాన్ని అందిస్తుంది: "యజ్ఞార్థాత్ కర్మణోన్యత్ర లోకోయం కర్మబంధనః" (గీతా 3.9) ఉన్నత లక్ష్యంతో చేసిన పని విముక్తి ఇస్తుంది. లేనిపక్షంలో అది బంధనంగా మారుతుంది. అందువల్ల, లక్ష్యంతో ఏర్పడిన సంపద విముక్తిని ఇస్తుంది, అవినీతిని ఇవ్వదు. అది ధర్మానికి విరుద్ధం కాదు. వాస్తవానికి అది ధార్మిక సహజ ఫలితం.

సంపద సృష్టికి ధర్మం ఒక ప్రేరేపణ శక్తి. ధర్మం సంపద సృష్టికి సహాయపడుతుందా? సమాధానం కేవలం అవుననే కాదు, అది ప్రాథమికంగా అవసరం. ధర్మం విశ్వాసాన్ని నిర్మిస్తుంది. విశ్వాసం లావాదేవీల ఖర్చును తగ్గిస్తుంది. ధర్మం క్రమశిక్షణను కల్పిస్తుంది, అది ఉత్పాదకతను పెంచుతుంది. ధర్మం నైతిక ప్రవర్తనను నిర్ధారిస్తుంది. అది దీర్ఘకాల ప్రతిష్టను నిర్మిస్తుంది. ధర్మం సంఘ బలాన్ని పెంపొందిస్తుంది. అది విస్తరణ, సహకారాన్ని సాధ్యం చేస్తుంది. ఇవి ఆలోచనాత్మక సిద్ధాంతాలు మాత్రమే కావు. ఇవే ఆధునిక ఆర్థిక వ్యవస్థల ప్రాథమిక స్తంభాలు. ఇవన్నీ చాలా కాలం క్రితమే ధార్మిక ఆలోచనలలో నిక్షిప్తమై ఉన్నాయి. అందుకే **'యత్ర యత్ర ధర్మ ఉద్భవతి, తత్ర తత్ర సంపద్ వర్ధతే.'** అంటే ఎక్కడయితే ధర్మం ఉంటుందో, అక్కడ సంపద కూడా పెరుగుతుందని అర్థం. ధర్మం నుండి ధనానికి మార్పు ఒక స్పష్టమైన మార్గాన్ని అనుసరిస్తుంది. వ్యక్తులు తమ స్వధర్మాన్ని (సరైన కర్తవ్యాన్ని) అర్థం చేసుకున్నప్పుడు, వారు తమ పనిని నైపుణ్యంతో సమన్వయం చేస్తారు. వారు కర్మయోగాన్ని ఆచరించినప్పుడు, ఉత్తమ ఉత్పత్తి చేస్తారు. ధార్మిక ఐక్యతతో సంఘటిత శక్తిగా ఏర్పడి, పరస్పర సహకారంతో విస్తరిస్తారు. సత్యం, న్యాయాన్ని పాటించినప్పుడు, నమ్మకం ఏర్పడుతుంది. అది వ్యాపార విస్తరణకు ఎంతో దోహదపడుతుంది.

సమృద్ధి సాధించిన ధార్మిక సమాజాలు

1) బసవన్న ఆధ్వర్యంలోని లింగాయత్ ఉద్యమం ద్వారా కాయకాన్ని, పనిని పూజగా భావిస్తూ, శ్రమకు గౌరవాన్ని కల్పించి, బలమైన వ్యాపార సంస్కృతిని పెంపొందించింది. అభివృద్ధి చెందిన వర్గంగా మారింది. 2) జైన సమాజం అహింస, అపరిగ్రహ సూత్రాల ఆధారంగా క్రమశిక్షణ, మితవ్యయం, నైతిక వాణిజ్యంతో సంపదను నిర్మించింది. దేశంలో అత్యంత సంపన్నులను సృష్టించింది. 3) స్వామినారాయణ (BAPS) నెట్వర్క్ భక్తి, క్రమశిక్షణ, గ్లోబల్ అనుసంధానాన్ని కలిపి, వ్యాపార విజయంతో గుర్తింపు పొందిన ప్రవాస సమాజాన్ని సృష్టించింది. 4) దావూదీ బోహ్రా సమాజం, తన బలమైన అంతర్గత ఐక్యత, నాయకత్వంతో, అత్యంత సమర్థవంతమైన వాణిజ్య నెట్వర్క్లు, సహకార మార్కెట్లను అభివృద్ధి చేసింది. 5) సిక్కు సంప్రదాయం "కిరత్ కర్ణి" (నిజాయితీగా పని), "వండ్ చక్కనా" (పంచుకోవడం) ఆధారంగా బలమైన వ్యవసాయ, వ్యాపార ఆధారాన్ని నిర్మించింది. 6) పార్సీలు మంచి ఆలోచనలు, మంచి మాటలు, మంచి పనుల సిద్ధాంతంతో పరిశ్రమల నాయకత్వాన్ని సాధించారు. గొప్ప వ్యాపార సామ్రాజ్యాలను స్థాపించారు. 7) యూదు సమాజం విద్య, గుర్తింపును ఆధారంగా చేసుకుని, జ్ఞానాన్ని ప్రపంచ ఆర్థిక ప్రభావంగా మార్చుకుంది. 3000 ఏండ్లుగా అనేక ఒడిదొడుకులు ఎదుర్కున్న ప్రపంచాన్ని శాసిస్తుంది. 8) మార్వారీ, వైశ్య సంప్రదాయాలు లక్ష్మీ పూజ, నైతిక వాణిజ్యంపై ఆధారపడి, విశ్వాసం, ధైర్యం, పునఃనివేశం ద్వారా శక్తివంతమైన ఆర్థిక నెట్వర్క్లను నిర్మించాయి. 9) ఆగా ఖాన్ ఇస్మాయిలీ సమాజం, ఇమామ్ ఆధ్వర్యం లోని ఆధ్యాత్మిక మార్గదర్శకత్వంతో, విద్య, క్రమ శిక్షణ, సంస్థాగత మద్దతుతో గ్లోబల్ వ్యాపార విజయాన్ని సాధించింది. 10) నారాయణ గురు SNDP ఉద్యమం "ఒకే కులం, ఒకే మతం, ఒకే దేవుడు" అనే సిద్ధాంతంతో సమానత్వం, స్వాభిమానాన్ని ప్రోత్సహించి విద్య ఆధారిత ఆర్థిక అభివృద్ధిని సాధించింది. 11) మటువా ఉద్యమం భక్తి, ఐక్యత, గౌరవాన్ని ప్రోత్సహిస్తూ, సంఘ సహకార వ్యవస్థల ద్వారా స్థిరమైన సామాజిక, ఆర్థిక అభివృద్ధిని సాధించింది. వీటిలో తత్వశాస్త్రంలో తేడాలు ఉన్నప్పటికీ, ఒక సామాన్య సూత్రం ఉంది. వీటిలో బలమైన గుర్తింపు, క్రమశిక్షణ, అంతర్గత సహకారం, ఆర్థిక నెట్వర్కింగ్ కనిపిస్తాయి. ముగించే ముందు భగవద్గీతలో శ్రీ కృష్ణుడు బోధించిన వ్యక్తి వికాస సూత్రం "ఉద్ధరేదాత్మనాత్మానం" అంటే నిన్ను నువ్వే ఉద్ధరించుకోవాలే తప్ప అది వ్యక్తి కాని, సమాజం కాని, నిన్ను ఉద్ధరించలేవు.

డా. బూర నరసయ్య గౌడ్
అధ్యక్షుడు, ధార్మిక హిందూ పరిషత్

కథ

భానువారం. అలుపెరగని ఈ జీవన ప్రయాణంలో ఉద్యోగి ఒడలికి కాస్త బడలిక తీరే రోజు.

తొలిసంధ్య వేళ రాఘవాచార్యులు సంధ్యా వందనం ముగించి వసారాలో మడత కుర్చీలో కూర్చోని కాలాన్ని కరిగించడానికి దినపత్రికని నిదానంగా చదువుతున్నాడు.

"ఏవండీ కాఫీ" అంటూ చేతికి అందించింది భార్య జానకి.

* * *

రాఘవాచార్యులు పాత తరానికి ప్రతినిధి. నడుస్తున్న తరానికి ఓ సాక్షి. కొత్త తరానికి వారధి.

త్రికాల సంధ్యలు క్రమం తప్పకుండా పాటిస్తాడు. వేకువజాము నడక, మితమైన ఆహారం, మితభాషి. నాలుగు వేదాలు ఔపోసన పట్టిన చతుర్వేది. ఇంచుమించు ఆరడుగుల ఆజానబాహుడు. విశాలమైన నుదురు, నుదుటికి ఎప్పుడూ ఉండే ఊర్ధ్వపుండ్రం. మనిషి మాటలోనూ నడతలోనూ దైవత్వం ఉట్టిపడుతుంది.

రాఘవాచార్యుల గతమెంతో ఘనకీర్తి. తాత ముత్తాతల గొప్పదనాలు గోడమీదకి పటాలుగా చేరాయి. నూనూగు మీసాల వయసులో కుటుంబ భారాన్ని పైన వేసుకుని... ఇంకా ఎంతో చదవాలని ఉన్నా ఆ ఆశని వదిలి చదివిన చదువుకి వచ్చిన కోర్టు గుమస్తా ఉద్యోగంలో చేరాడు.

మన అనుకునే వాళ్లు ఏ సాయానికి ముందుకు రాకపోయినా గుచ్చి గుచ్చి అడిగేవారు "గుమస్తా గిరి చేస్తున్నావా?" అని. విద్యతో వచ్చిన జ్ఞానం వయసుకు మించి వచ్చిన ఓర్పుతో ఓ చిరునవ్వు నవ్వి నిష్క్రమించేవాడు. మేనమామ మాత్రం తనకి అంత స్తోమత లేకపోయినా అవసరానికి వీలైన సహాయం చేసేవాడు. అందుకేనేమో మేనరికం వద్దన్నా మేనమామ కూతురు జానకిని అర్ధాంగిగా చేసుకున్నాడు. జానకి అందం అణుకువ కలగలిపిన బాపుగారి బొమ్మలా ఉంటుంది. స్కూలు విద్యతో ఆపేసింది.

"చిన్న కుటుంబం చింతలేని కుటుంబం" నినాదం బాగా మనసుకి చేరి ఒక్క సంతానంతోనే ఆపేశారు. కాలానికి అనుగుణంగా కొడుకుకి "మాధవ్" అని నామకరణం చేశారు

* * *

జానకి భర్తకి కాఫీ అందించి తను ఓ కప్పు తీసుకుని అరుగుమీద కూర్చుంది. ఆమె కూర్చునే భంగిమ చూసి మనసులో అనుకున్నాడు "ఏదో కోరిక కోరబోతుంది అని"

"ఏమేవ్ మన మాధవ్ ఎక్కడ?" అని జానకిని అడిగాడు.

"వాడు ఆటల్లో ఉన్నాడు అండి" అంటూ భర్త మనసెరిగిన జానకి నిదానంగా విషయానికి వచ్చింది."ఏమండీ! మన మాధవ్‌కి ఇప్పుడు ఎనిమిదేళ్లు వచ్చాయి..." అంటూ భర్త వైపు చూసింది. భర్త ముఖంలో ఏ మార్పు... ఆసక్తి లేకపోయేసరికి స్వరం పెంచి "ఏమండీ... మన మాధవ్‌కి ఇప్పుడు ఎనిమిదేళ్లు వచ్చాయి..!"

తనకి తెలుసు భార్య ఇంకా ఏమి చెప్పబోతుందో. ఐనా ముభావంగా అడిగాడు "ఐతే...?".

జానకికి ఓర్పు కాస్త సడలి చిరుకోపంతో "మీకు తెలియదా...?... ఇప్పుడు ఏమి చేయాలో..? అది కూడా నా నోటినుండే చెప్పించాలా?

ఇహ తప్పదన్నట్టు ఖాళీ కాఫీ గ్లాసుని పక్కన

పెడుతూ...." నాకు తెలుసే, వాడికి ఏడేళ్లు నిండి ఎనిమిదో ఏడు. ఇప్పుడు ఉపనయనం చేయాలి అంతే కదా?".

"మరి అంతా తెలిసి దానిగురించి ఆలోచించరేం?"

"చూడు జానకీ! దానికి యజ్ఞోపవీతం ఒక్కటే సరిపోదు కదా? ఎంత తంతో నీకూ తెలుసు! ఒక పెళ్లికి అయ్యేంత ఖర్చు. అందుకే మౌనంగా ఉన్నాను". కాస్త ఆగి ఓ నిట్టూర్పుతో "నేనా చిరుద్యోగిని ...పైసా పైసా కూడబెడుతున్నది వాడి చదువు కోసం. నా పరిస్థితి వాడికి రాకూడదు. అందుకే ఒక వైపు ఇన్సూరెన్స్ కడుతున్నాను. నాకేమైన.. జరిగితే...". అని పూర్తి చేసేలోపు జానకి తన చేతిని భర్త నోటికి అడ్డం పెట్టి, "ఆపండి శుభవిషయానికొస్తే అశుభ మాటలు..'.అంటూ గదమాయించింది.

భర్త ఆలోచనని అర్థం చేసుకున్న జానకి... లాలనగా అడిగింది "మరేం చేద్దామనుకున్నారు?" అని.

"ఇంకా ఏమనుకోలేదు... ఆలోచిస్తున్నా!". అని మనసులో ఉన్న తన ఆలోచనని బయటకు రానీయకుండా నిట్టూర్పుగా అన్నాడు.

జానకి వెంటనే "ఏమండీ మీరేమి కోపగించు

రేపటి వారధులు

డా. నరేంద్రబాబు సింగూరు



కోరంటే నాదో సలహా!"

"నేనెందుకు కోపగించుకుంటాను? చెప్పు"

"మరేమీ లేదండీ... వచ్చే నెల రామాలయంలో సామూహిక ఉపనయనం చేస్తున్నారట. కాస్త సంభావన, వస్త్రాల ఖర్చు మాత్రమే మనం భరించాలి అంతే. మిగతాదంతా ఆలయ కమిటీ చూసుకుంటుందంట. మనము మన మాధవ్ పేరు ఇద్దామంటరా?" అని చెప్పాల్సిన విషయం చెప్పి "అయినా మీ ఇష్టం" అంటూ కొసమెరుపుగా తగిలించింది.

"ఈ విషయం నీకు ఎలా చెప్పాలా...ఎలా ఒప్పించాలా..అని మనసులో తర్జనభర్జన... పడుతున్నాను. ఇంకేముంది.. అంతా నీ ఇష్టమే... ఆ... రాములువారి అనుగ్రహం మనమీద ఉంది కాబట్టి ఈ భారాన్ని ఇలా గట్టెక్కిస్తున్నాడు" అని మనసులోని బరువుని దింపి చిరునవ్వు చిందిస్తూ చెప్పాడు. మనస్సులో భక్తితో రాముని స్మరించుకున్నాడు.

అలా...ప్రతి ఆపదలోను నమ్మిన దైవం మనిషి రూపంలో ...మరో రూపంలోనో గట్టెక్కించేది.. దానికి తోడు అన్నీ అర్థం చేసుకునే భార్య ...చెప్పిన మాట వినే పిల్లాడు. ప్రశాంత జీవితం అంటే ఇదేనేమో!.

ఇప్పుడు మాధవ్ పెరిగి పెద్దయి, ప్రఖ్యాత ఐఐటీలో ఇంజనీరింగ్ పాసయ్యాడు. అన్నీ అనుకూలించాయి. పేరుగాంచిన బహుళ జాతీయ కంపెనీలో మంచి జీతంతో ఉద్యోగం. రాఘవాచార్యులు, జానకిల సంతోషం అంబరాన్ని అంటింది. కానీ వెంటనే పెళ్లి విషయం వచ్చేసరికి సంతోషం ఆవిరి అయిపోయింది. అబ్బాయి ఇష్టపడ్డ అమ్మాయి "మాధురి"తో తప్పనిసరి పరిస్థితుల్లో పెళ్లి తతంగం ముగించారు. పెళ్లైన వెంటనే కొడుకు, కోడలు అమెరికా వెళ్లిపోయారు. ఏదైతేనేం ఓ బాధ్యత తీరినందుకు వారి మనసుకు కాస్త ఊరట.

కొడుకు ప్రయోజకుడు అయ్యాడన్న ఆనందం కంటే ఎన్నో యోజనాలు దూరంగా వెళ్లాడు అన్న బాధే ఎక్కువగా ఉండేది. మాధవ్ మాత్రం తన ఎదుగుదలే చూసుకున్నాడు. కొడుకు కోడలు ఉద్యోగరీత్యా అమెరికాలో స్థిరపడ్డారు.

కాలం పరుగులు తీస్తూనే ఉంది. వయసుతో బాటు వేదన కూడిన శ్రమతో ఇద్దరి ఆరోగ్యంక్షీణిస్తోంది. జానకి ఆరోగ్యం ఇంకా ఎక్కువగా క్షీణిస్తోంది. ఒక్కగానొక్క కొడుకు ప్రయోజకుడు అవ్వాలన్న ఆశ వారి ఆరోగ్యాన్ని కూడా లెక్కచేయనివ్వలేదు. మందులకు పెట్టే ఖర్చులు చదువుకి ఆటంకం కాకూడదు అని.

రాఘవాచార్యులు జానకిలు తాతయ్య నాన్నమ్మలు అయ్యారు. మనవడి పేరు మహేష్. వయసు అంకెలు రాఘవాచార్యులుకి ఉద్యోగ విరమణ తెచ్చాయి దాంతో ఇంట్లో, మనసులో తెలియని నిశ్శబ్దం ఆవహించింది.

మాధవ్ మొదట్లో తల్లితండ్రులను తనతో తీసుకెళ్లాలి అన్న ప్రయత్నం మాత్రం ఫలించలేదు. కొన్నాళ్లు గడిచాయి. మనిషి ఆశలు.. అంతస్తులు

పెరిగాయి. ఆలోచనా పరిధి మారింది. ఒకప్పటి ఆచారాలు ఇప్పుడు అపచారాలు అయ్యాయి. నేటి సాంకేతిక అడవిలో మనుషులు మర మనుషులు అయ్యారు. కాలం ఇవేమీ పట్టించుకోకుండా... పరిగెడుతూనే ఉంది.

మనవడికి ఆలనా పాలనా అంతా ఆయాల చేతుల మీదే. వాళ్ల అవసరాలకు సెలవులకు ఈ దేశం వచ్చేటప్పుడు ఏదో అరపేరకొర అవకాశం జానకికి వచ్చేది. తనివితీరా మనవడితో ఊసులు ఆడే అవకాశం లేక ఆ బాధని తనలోనే దిగమింగు కుంది. దూరం ఎప్పుడూ మనసుకి భారమే.

ఇప్పటి అంతర్జాల కాలంలో అంతరాలు ఇంకా పెరిగాయి. మనవడు ఇప్పుడు ఎనిమిదో ఏట అడుగు పెట్టాడు. మనసుని ఎంత స్వాంతన పరిచినా జానకికి మనవడి ఉపనయనం పైనే ధ్యాస. కనీసం ఇదొక్కటి తన కళ్ల ముందు జరగాలని. ఎందుకంటే అప్పుడు కొడుకుకి స్తోమత లేక సామూహికంగా చేసేసారు. ఇప్పుడు ఉన్నత స్థితిలో ఉన్నారు. భర్తతో చెప్పింది తన మనసు గోడు "ఏవండీ మనవడి ఉపనయనం చేయాలి . వాళ్లని ఇక్కడకు రమ్మనండి ..లేదా మనమే అక్కడకు వెళ్దాం"

"ఏదో పని ఉందని ఈ ఏడు ఎలాను ఇక్కడికే వస్తున్నారు. పనిలో పని నీ ముచ్చట తీరుతుంది" అని చెప్పి భార్యని స్థిమిత పరిచాడు రాఘవా చార్యులు. కానీ...మనసులో ఏదో తెలియని అనుమానం. కొడుకు కోడలు ఇష్టాలు ఏమిటా అని! ఎందుకంటే అన్నీ మొక్కుబడి మాటలే. ఎక్కువగా మాటలు పెదాల నుంచే వచ్చేవి.ఏ మాట ఎద లోతుల్లోనుంచి వచ్చేది కాదు. అందుకే తన మాట చెల్లుతుందా? అని ఓ అనుమానం.

కొడుకు కోడలు మనవడు వచ్చే రోజు రానే వచ్చింది. వయసు అంత సహకరించపోయినా మనోల్లాసంతో జానకి వేకువజామునే లేచి ఇల్లంతా శుభ్రం చేసి కొడుకుకి ఇష్టం అని నానేసిన మినపప్పు రుబ్బి పాకం గారెలు చేసింది. కొడుకు అప్పటి ఇష్టాలు తెలుసు. కానీ మనవడి ఇష్టాలే తెలీదు. తెలుసుకునే అవకాశం రాలేదు .

రాఘవాచార్యులు కొడుకు వద్దన్నా విమానా శ్రయానికి వెళ్లాడు. కాస్త చూపు మందగించినా, రక్తసంబంధం దూరం నుంచే పసిగట్టేసింది. మనవడు "గ్రాండ్ ఫా" అంటూ పరిగెత్తుకుంటూ వచ్చి గట్టిగా హత్తుకున్నాడు. రాఘవాచార్యుల ఆనందం అనంతం. 'నేను తాతయ్యను రా' అంటూ మనవడిని ముద్దులతో ముంచేశాడు. అందరూ ఇంటికి చేరారు. గుమ్మంలో ఎదురుచూస్తున్న జానకి వాళ్లకి దిష్టి తీసి లోపలకి సాగనంపింది.

సాయం సంధ్య వేళ ప్రయాణ బడలిక తీర్చుకుని కొడుకు కోడలు మనవడు హాల్లోకి వచ్చారు.

జానకి కాఫీ చేసి అందరికీ ఇచ్చింది. మనవడికి హార్లిక్స్ కలిపి తాగించింది. మనవడిని తన ఒడిలోకి తీసుకుని వాడి ముద్దుముద్దు తెలుగు మాటలకు

"ఏదో పని ఉందని ఈ ఏడు ఎలాను ఇక్కడికే వస్తున్నారు. పనిలో పని నీ ముచ్చట తీరుతుంది" అని చెప్పి భార్యని స్థిమిత పరిచాడు రాఘవచార్యులు. కానీ...మనసులో ఏదో తెలియని అనుమానం. కొడుకు కోడలు ఇష్టాలు ఏమిటా అని! ఎందుకంటే అన్నీ మొక్కుబడి మాటలే. ఎక్కువగా మాటలు పెదాల నుంచే వచ్చేవి.ఏ మాట ఎద లోతుల్లోనుంచి వచ్చేది కాదు. అందుకే తన మాట చెల్లుతుందా? అని ఓ అనుమానం.

మురిసిపోతూ తన మనసులో మాటని బయట పెట్టింది జానకి "ఒరేయ్ కన్నా! నీకు మీ నాన్నకంటే గొప్పగా ఉపనయనం చేయాలి రా!"

మనవడు "గ్రాండ్ మా ఉపనయనం అంటే ఏంటి...ఎందుకు చేయాలి?" అని అమాయకంగా అడిగాడు.

"మీ తాతయ్య నీకు చాలా చక్కగా వివరించి చెబుతారు. అడుగు బాబూ! "అంటూ మనవడిని రాఘవాచార్యులు వద్దకు పంపి "ఏవండీ వాడి సందేహం తీర్చండి" అని చెప్పింది .

రాఘవాచార్యులు చిరునవ్వు నవ్వి " రారా ఇలా" అని మనవడిని తొడలపై కూర్చోబెట్టుకుని "నీకు ఇప్పుడు ఏడేళ్లు అదే సెవెన్ ఇయర్స్ కంప్లీట్ అయ్యాయి. ఉపనయనం చేయాలి. అంటే నీకు జంధ్యం.. శాక్రెడ్ త్రెడ్ వేయడం. అది మన ఇంటి సంప్రదాయం..ట్రడిషన్. మన ఉనికి, అస్తిత్వానికి ప్రతీక. అవర్ రూట్స్, సింబలైజింగ్ అవర్ ప్రెజెన్స్ అండ్ ఎగ్జిస్టెన్స్. ఉపనయనం వేదాలతో, విజ్ఞానంతో సంబంధం కలిగించే గొప్ప ప్రక్రియ. గ్రేట్ ప్రాసెస్ ఆఫ్ రిలేటింగ్ టు వేదాస్. ఇది కేవలం సంప్రదాయం కాదు, మన శాస్త్రీయ విజ్ఞానానికి, సనాతన ధర్మానికి మార్గ దర్శనం బాబూ. ఇట్ ఈస్ సైంటిఫిక్ నాలెడ్జ్ విత్ అర్తోడొక్స్... పెద్దయ్యాక నీకే తెలుస్తుంది."

జానకి లేచి మనవడిని తల మీద చేతితో తడుముతూ కొడుకుని ఉద్దేశించి "ఒరేయ్ మాధవ చిన్నప్పుడు నీకు ఉపనయనం చెయ్యడానికి అప్పట్లో అంత స్తోమత లేక ఏదో అలా కానిచ్చేసాం. ఇప్పుడు మనకి ఆ దేవుని దయవలన అన్నీ ఉన్నాయి. ఎలానూ వీడికి ఏడేళ్లు నిండాయి. సమయానికి మీరందరూ ఇండియా వచ్చారు. ముహూర్తం చూసి మీరు వెళ్లే లోపు ఆ ఉపనయనం చేసేద్దాము రా.!" అంటూ కొడుకు సమాధానం కోసం ఎదురు చూడకుండా "మీరేమంటారు?" అని రాఘవా చార్యులు వైపు చూసింది.

విమానాశ్రయంలో తనని కోడలు పలకరించిన తీరు గుర్తొచ్చి "నువ్వు చెప్పింది బాగుంది... కానీ వాడు, కోడలు ఆలోచించుకోని" అంటూ కొడుకు వైపు చూసి ఒరేయ్ మాధవ "నువ్వేమంటావ్ రా?"

జానకి మధ్యలో కలుగజేసుకుని "దీంట్లో ఆలోచించడానికి ఏముందండీ..? ఎలాగూ చెయ్యాలి కదా ఇప్పుడు చేసేద్దాము అంతే! మీరు ముహూర్తం ఎప్పుడో చూడండి" అంటూ ఆజ్ఞ వేసింది.

ఇంతలో కోడలు కలగజేసుకుని "అత్తగారూ ఏంటి ...అంతా మీ ఇష్టమేనా? మా అభిప్రాయం తెలుసుకోరా?" అంటూ "నువ్వు చెప్పొచ్చు కదా మాధవ్ మీ అమ్మకి" అంటూ చూపు మాధవ్ వైపు తిప్పింది.

ఊహించని కోడలు తీరుకి జానకి స్థాణువై.. కోపం తెచ్చుకోలేక అలానే మౌనంగా ఉండి పోయింది. కళ్లు తెలియకుండానే చెమ్మగిల్లాయి.

రాఘవాచార్యులు పరిస్థితి అర్థం చేసుకుని "మీ ఇష్టం అమ్మా.!ముందు మీరు వచ్చిన పనులు పూర్తి అయ్యాక తీరిక ఉండే సమయం చెప్తే అప్పుడు మాట్లాడదాం, ఆలోచిద్దాం ఏమి చేయాలో"

మాధురి వెంటనే కోపంగా "దీంట్లో మాట్లాడే దేముంది? ఆలోచించేదేముంది? మీవన్నీ పాత పద్ధతులు. మీరు ఇంకా అక్కడే ఆగిపోయారు. కాలం మారిపోయింది. ఇప్పుడు ఉపనయనం అనేది అవసరమా? నాకు ససేమిరా ఇష్టం లేదు. వాడికి ఆ వేలాడే దారం ఇబ్బంది. పైగా అందరిలో నామోషీగా ఉంటుంది. వద్దు అంటే వద్దు"

మాధవ్ ఏమీ మాట్లాడలేకపోయాడు. కోడలి ఆలోచనకు కోపం వచ్చినా కొడుకు ఏమీ మాట్లాడక పోయేసరికి ఏమీ అనాలో పాలుపోలేదు రాఘవా చార్యులకు. జానకిదీ అదే పరిస్థితి. జానకి నియంత్రించుకోలేక కోడలి మీద, మౌనంగా ఉన్న కొడుకు మీద కోపం వచ్చి "పద్ధతులకు పాత కొత్త ఉండదు. ఇది మన కుటుంబ ఆచారం. చదువుకున్న

దానివి. ఉపనయనం, ద్విజులు అంటే తెలీదా? అయినా మన సంప్రదాయం మనకి ఎందుకు ఇబ్బంది అవుతుంది? దీంట్లో నామోషీ చెందేది ఏమీ లేదు. పద్ధతులు తెలియక పోతే తెలుసుకోండి అంతే కాని ఇలా అధునాతనం అని సనాతనాన్ని గంగలో కలిపేయ కండి" ఆగి కొడుకు వైపు చూస్తూ "ఏరా బెల్లం కొట్టిన రాయిలా అలా ఉన్నావేమిటిరా? నీకు తెలుసుకదా? చెప్పి ఒప్పించడం తెలీదా?"

తను ఎప్పుడూ చూడని కోపంతో జానకి కొడుకుని కోడలికి ఇలా చీవాట్లు పెట్టడం చూసి ఆశ్చర్యం వేసింది రాఘవాచార్యులకు. అయినా ఈ విషయాన్ని పెద్దది చేయడం ఇష్టం లేక మనవడి అవస్థ చూసి "జానకీ! ఇంక ఆపు.తల తిరుగుతుంది నువ్వు వెళ్లి కాస్త కాఫీ కలిపి తీసుకు రా! మనవడుని కూడా లోపలికి తీసుకెళ్లు" అంటూ అక్కడి నుండి పంపించే ప్రయత్నం చేశాడు.

కానీ కోడలు కోపంగా "వాడు ఇక్కడే ఉంటాడు" అని పిల్లాడిని చేయి పట్టుకుని జోరుగా లాగింది. పిల్లాడు ముందుకు పడబోయి తమాయించు కున్నాడు. ఇంకా కోపంతో మాధవ్ వైపు చూస్తూ "అయినా నన్ను ఇలా తిట్టించాలనే కదా మీ ప్లాన్. డైరెక్ట్‌గా మా అమ్మ వాళ్ల ఊరు వెళ్దాం అన్నాను. కానీ నా మాట వినక ఈ కొంపకి తీసుకువచ్చారు" అంటూ అత్తమామల మీద, మాధవ్ మీద రుస రుస లాడింది.

రాఘవాచార్యులు "వదిలేయ్ అమ్మాయి ఆ విషయం. మీరు వచ్చిన పని కానీయండి. మీకు ఇష్టం లేకపోతే వద్దులే. మీ అత్త ఏదో పిచ్చిది. అప్పట్లో డబ్బులు లేక వీడికి ఉపనయనం ఏదో గుంపులో గోవిందలా కానిచ్చేసాం. ఇప్పుడు డబ్బుకు ఏ లోటూలేదు. అందుకే దాని ముచ్చట తీరుతుందని ఏదో ఆశతో చేద్దాం అంది. ఎలానూ చేయాల్సిన తంతు కదా అని. పిల్లాడి వయసు మీరితే కుదరదు"

"ఒంటి మీద దారం పోగులు వేయడం ఓ సంప్రదాయం, పైగా వేయడానికి పెద్ద ఖర్చు.."

ఆమె మాటకు రాఘవాచార్యులు వచ్చిన కోపాన్ని పంటికింద అణుచుకుని "చూడమ్మాయ్.. మీకు ఇష్టం లేకపోతే లేదు. కానీ కుటుంబ పద్ధతులను, సనాతన ఆచారాలని, ధర్మాలను తక్కువచేసి మాట్లాడకూడదు. ఈ దేశంలో పుట్టి పెరిగావు పైగా చదువుకున్నావ్. పాటించడం సంగతి అటువైపు ఉంచు కానీ ఈ దేశ హైందవ సంస్కృతి తెలుసుకోవడం భారతీ యురాలుగా కనీస ధర్మం. నువ్వు అన్నట్టు దారం పోగులు కావు.. దారంతో చేసిన యజ్ఞోపవీతం పరమ పవిత్రమైనది. దారాల పోగులు ఆత్మ స్థితులను, గుణాలను తెలియజేస్తాయి. ఈ మూడు పోగులను ధరించినప్పుడు అవి మనకు రుషి ఋణం, పితృరుణం, దేవరుణాలను గుర్తు చేస్తాయి. ఆ మూడు పోగులను కలిపి ముడి వేయబడిన బ్రహ్మ గ్రంథి త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను కలిసి ఏకంగా ఉండడాన్ని సూచిస్తుంది. పైగా ఉపనయనం వాడికి అర్హతను తెచ్చిపెడుతుంది"

అంతా విన్నాక "మరి మీ అబ్బాయి ఏమీ అనలేదు ..అంటే నా మాటకు ఓకే అన్నాడు కదా? మరి మీ అబ్బాయికి ఎందుకు నేర్పలేదు ఈ సనాతన... సంస్కృతి" అంటూ వ్యంగ్యంగా మాధురి తన మామని నిలదీసింది.

ఉరుము ఉరిమి మంగలం మీద పడ్డట్లు ఊహించని ఈ ప్రశ్నకు మాధవ్ ఉలిక్కిపడ్డాడు కానీ ఏమీ మాట్లాడలేదు. రాఘవాచార్యులు మాత్రం "ఔనమ్మా తప్పు నాదే. కొడుకు ప్రయోజకుడు అవ్వాలని చదువు చదువు అంటూ వెంటబడ్డాను.. అల్లారు ముద్దుకి చెడిపోతాడు అని హాస్టల్‌లో ఉంచి చదివించాను. మంచి ఉద్యోగం లక్షల్లో జీతాలు అనే సరికి దేశం దాటుతాను అంటే ఒప్పుకున్నాను. నచ్చిన అమ్మాయిని చేసుకుంటాను అంటే సరే అన్నాను కానీ ఇలా కుటుంబ సాంప్రదాయాలను, మూలాల్ని విస్మరిస్తాడు అనుకోలేదు. ప్రతి తరం వారి సంస్కృతిని సాంప్రదాయాలను కాపాడితేనే అవి సజీవంగా నిలుస్తాయి" తండ్రిని మాధురి అలా అనడం, తండ్రి ఆవేదన చూసి మాధవ్ కోపంతో "మాధురి.. ఇంక నువ్వు ఆపుతావా? లోపలకి వెళ్లు" అని గట్టిగా అరిచాడు.

"లోపలికి కాదు ..ఇప్పుడే మనం ఇక్కడి నుండి బయలుదేరాలి. మీరు వస్తారా లేక నన్నే వెళ్లి పోమంటారా" అంటూ పిల్లాడిని లాక్కొని బయటకు వెళ్లబోతే మాధవ్ భార్యని ఆపి "అక్కరలేదు అందరం వెళ్దాం" అని విసవిసా నడుచుకుంటూ బయటకు వెళ్లిపోయాడు. కొంతసేపటికి మాధవ్ టాక్సీతో వచ్చాడు. ముగ్గురు బయలుదేరారు. రాఘవా చార్యులు జానకి ఎంత వారించినా వినలేదు.

వాళ్లు వెళ్లిపోతున్న బాధ కంటే రాఘవాచార్యు లుకు తరం మధ్య ఆలోచనా భేదాలు, కొడుకు కోడలి సాంకేతిక ప్రపంచ దృక్పథం, అధునాతనం, ఆచారాలకు సంబంధించిన అభిప్రాయ భిన్నతలు మనసును వేధించాయి. ఆపడం ఇక అనవసరం అనిపించి "ఒరేయ్ నీ ఇష్టం వెళ్తే వెళ్లు. వయసు వచ్చిన కొడుకుకి నేను ఇంతకన్నా ఏమీ చెప్పలేను. నువ్వు మమ్మల్ని ఎదిరించి వెళ్తున్నావు అనుకుంటున్నా వేమో కాదు... నువ్వు నీ మూలాల్ని ఎదిరించి వెళ్తున్నావు. ఎక్కడ ఉన్నా ఒకటి మాత్రం గుర్తుంచుకో సాంప్రదాయం సనాతన ధర్మం అనేది జీవన విధానం, అది కాలానుగుణంగా మలచుకోవడం నేర్పుతుంది. కానీ మన ధర్మం, విజ్ఞానం, ఆచారాల విలువ ఎప్పటికీ ఉంటాయి. వాటిని మరిచిపోకు. వాటిని జాగ్రత్తగా కాపాడుకుంటూ ముందుకు సాగు. నీ భవిష్యత్తు, దేశ భవిష్యత్తు అందులోనే ఉంది" అంటూ మనవడిని ఎత్తుకుని గుండెకు గట్టిగా హత్తుకున్నాడు.

ఏమీ తెలియని పసిమనసు "మీరు మాతో రండి గ్రాండ్ ఫా... తాతయ్య" అన్న మాటకు రాఘవచార్యు లుకు కళ్లల్లో నీళ్లు తిరిగాయి. పిల్లాడిని దింపి కండువాతో కళ్లు తుడుచుకున్నాడు.

"లోపలికి కాదు ..ఇప్పుడే మనం ఇక్కడనుండి బయలుదేరాలి. మీరు వస్తారా లేక నన్నే వెళ్లి పోమంటారా" అంటూ పిల్లాడిని లాక్కొని బయటకు వెళ్లబోతే మాధవ్ భార్యని ఆపి "అక్కరలేదు అందరం వెళ్దాం" అని విసవిసా నడుచుకుంటూ బయటకు వెళ్లిపోయాడు. కొంతసేపటికి మాధవ్ టాక్సీతో వచ్చాడు. ముగ్గురు బయలు దేరారు. రాఘవా చార్యులు జానకి ఎంత వారించినా వినలేదు.

వాళ్లు వెళ్లాక నోటికి పైట చెంగు అడ్డం పెట్టుకుని ఏడుస్తూ "ఉదయాన్నే వచ్చిన చుట్టం ఉదయాన్నే వచ్చిన వాన ఉండవు అంటారు..కానీ ఉదయాన్నే వచ్చిన కొడుకు కూడా ఉండడు అని తెలియలేదు .. అంతా నాతలరాత".

రాఘవాచార్యులు జానకి భుజం మీద చేయి వేసిలోపలికి తీసుకువెళ్లాడు.

కొడుకు మాధవ్ అమెరికా వెళ్లిపోయి మూడు నెలలు అయింది. సాయం సంధ్య. రాఘవాచార్యులు వాలు కుర్చీలో కూర్చుని ఆలోచనలతో శూన్యం లోకి చూస్తూ ఉన్నాడు. ఆలోచనలను చీలుస్తూ గదిలో పురాతనమైన గోడ గడియారం శబ్దం మాత్రం స్పష్టంగా వినపడుతుంది. లోపల భార్య జానకి కాఫీ తీసుకు వచ్చింది.

మాధవ్ వెళ్లినప్పుడు నుంచి ఏదో రెండు మూడు సార్లు మొక్కుబడిగా ఫోన్ చేశాడు. ఓసారి ఫోన్‌లో

"కన్నవాళ్లను ఇలా అనాథల్లా వదిలేసావు కదరా" అని జానకి అంటే "అక్కడ నాన్న గారిని ఇల్లు అమ్మేసి మీరిద్దరూ ఇక్కడికి వచ్చేయండి" అని అన్నాడు. "మేము అక్కడికి రాము రా నువ్వే ఇక్కడకు వచ్చేయ్" అనేసరికి చాలా కోపంగా మాట్లాడాడు "అక్కడే ముంది ఇక్కడ మంచి దేశం ఎన్నో సౌకర్యాలు ఉన్నాయి. మీరు ఒక్కసారి ఇక్కడకు వస్తే మీరు మీ ఆలోచనలు మీ సనాతనాలు అన్నీ మారిపోతాయ్"

"ఒరేయ్ నువ్వు చూస్తున్నది ఓ మాయా ప్రపంచం. జీవితం అంటే జీవించి ఉండడం కాదు మన అనే నలుగురితో ఆనందంగా జీవించడం. ఎప్పటికీ నీవు అక్కడ పరాయి వాడివే అది మాత్రం గుర్తుంచుకో " అంటూ ఫోన్ పెట్టేశాడు.

ఈటె పోటు మానుతుంది కాని మాట పోటు మానదు. వాగ్యుద్ధం తరువాత రాఘవాచార్యులు మనోవేదనతో బాధపడుతున్నాడు. ఎప్పుడో తరాలు నాడు తమ తాతలు కట్టిన ఈ మండువాలోగిలి ఇప్పుడు మాధవ్ అమ్మకం పెట్టమన్నాడు. తమను కూడా దేశం దాటమంటున్నాడు. వాడు ఎందుకిలా మారిపోయాడు అని ఆలోచనలో పడ్డాడు.

"ఏంటండీ అదోలా ఉన్నారు ..ఇంకావాడి గురించే ఆలోచిస్తున్నారా?"

"అవును జానకి.."

"వాడు మారతాడు లెండి"

"లేదు జానకి.. ఏ ఆకు రాలినా ఈతాకు రాలదు అంటారు. వీడు మారతాడు అనే ఆశ పోతుంది"

"కాలం మారుతుంది...వాడిని మారుస్తుంది అని నా ఆశ"

"ఉహ్.. మనం కాలం మారుతుంది అనుకుంటాం. కానీ చూశావా ఆ గోడ గడియారం మాత్రం తనపని తానే చేసుకుంటుంది నేను మా రలేదు. నా పేరు చెప్పి మీరే మారిపోతున్నారు అని చెప్తున్నట్టు ఉంది కదూ"

జానకి భర్త దగ్గరగా వచ్చి చిన్నపిల్లలా ఆయన ఒడిలో తలపెట్టి "ఎందుకండీ ఇంత వైరాగ్యం! మిమ్మల్ని ఇలా చూస్తుంటే ఏమైపోతారో అని నాకు భయమేస్తుంది"

"లేదు జానకి, వాడు అమ్మమన్నది ఇల్లు కాదు తరాల సంస్కృతిని, సాంప్రదాయాన్ని. పూర్తిగా ఇక్కడ అస్తిత్వాన్ని ఉనికిని రూపుమాపాలని విదేశీ మోజులో పడి ఇక్కడ తమ తరాల అస్తిత్వాన్ని మర్చిపోతున్నాడు. మార్పు జీవిత ఎదుగుదలలో రావచ్చు కానీ వీళ్లు చేస్తున్నది ఏమిటి? ఎక్కడో డాలర్ల మోజులో పడి మన హైందవ ధర్మాన్ని నియమనిష్టలను మంటగలిపి నియాన్ లైట్ల కాంతిలో విలాస భవనాల్లో గడపటమా వీళ్ల సుఖం? వీళ్లు భ్రమ పడుతున్న ఈ జీవితాలు శాశ్వతం కాదు. మండుతున్న అగ్ని కూడా కాసేపటికి ఆవిరి అయిపోవాల్సిందే... అలాగే మధ్యలో వచ్చే ఈ కించెత్ భోగాలు కూడా సగంలోనే కూలి పోతాయి. మట్టివాసన పీల్చని మహానగరాల్లో కాలుష్యాన్ని ఎంతకాలమని తాగుతారు. గాలి వేయని కృత్రిమ గాలుల మధ్య ఎంత కాలమని ఊగుతారు. పచ్చని చెట్లు పక్షులు కిలకిల రావాలు, వర్షించే మేఘాలు వీళ్లు ఎప్పుడైనా చూసారా చూడాలనుకున్నా అక్కడ కనిపించవు. వేకువ జామున కోకిల పాటలు, రాత్రులు కీచు రాళ్లు ధ్వనులు వినిపించవు. ఇదా వీళ్లు బతుకుతున్న కంటికి కనిపించని అంబరాల్లో అద్భుతమైన జీవితం. దీన్ని జీవితమందామా?...దీని కోసమా మనం ..మన కడుపు మాడ్చుకున్నాం?"

"మనమే కదండీ వాడు ప్రయోజకుడు అవ్వాలని కలలు గన్నాం"

"అవును ...కలలు కన్నాము ..వాడి బాగు కోసం ..ఏదో ఉద్యోగం చేసి వాడు కొన్నాళ్లకు ఈ లోగిలి కి వస్తాడు అనుకున్నాను. వాడు అక్కడే ఆ దేశంలో ఉండి పోతాడు అనుకోలేదు. వాడి చదువుకి నేనే కాదే ఈ దేశం కూడా ఖర్చు పెట్టింది. ఏమి జీవితమే మనది ...ఆఖరికి మన మనవడితో ముచ్చటగా మూడు గంటలు కూడా తృప్తిగా గడపలేక పోయాం"

"ఇంకా ఆ విషయం వదిలేయండి. మన బాధ్యత నెరవేర్చాము. ఎక్కడున్నా వాడు సంతోషంగా ఉంటే చాలు"

"లేదు జానకీ! మనం వాడు ఉన్నతంగా ఎదగడమే మన భాద్యత అనుకున్నాము.. ఇప్పటి తరం ఇంతే లే అనుకుని మనల్ని మనం మోసం చేసుకుని వాడికి మన సంస్కృతి ఆచారాలు పూర్తిగా నేర్పలేక పోయాం. భారతీయ సంస్కృతి తరతరాలుగా ధర్మం, ఆచారాలు, శాస్త్రాలు, విజ్ఞాన సంపదను పరిరక్షిస్తూ ముందుకు సాగిపోవడానికి వారే నే వారధులు...జీవన వారధులు బహుశా నేను సరిగా నిర్మించలేకపోయానేమో. తప్పు మనది కూడా జానకీ"

"హర్షించాల్సిన సమయంలో తప్పొప్పులు ఎందుకులేండి" నిట్టూరుస్తూ అంది.

"ఆకలితో అలమటించలేని అభాగ్యుల్లేని ఆ దేశంలో ఆస్తులు కూడపెట్టుకుని అర్ధాంతరంగా మాయమవడాన్ని మనం హర్షిద్దామా జానకీ? ఇది నా ఆవేదన మాత్రమే. వాడొక్కడినే ఉద్దేశించి అన్న మాటలు కావు. నేడు నా దేశం నుండి వలసలు పోతున్న మాధవ్ లాంటి యువత గురించి, మనలాగే వారి తల్లి తండ్రులు పడే వేదన గురించి. పెద్ద చదువులు చదువుకోవడానికి వెళుతున్నారు. చదువుకుంటూ ఏ రెస్టారెంట్లలోనో, ఏ మాల్‌లో, పెట్రోల్ బంకుల్లోనో పని చేస్తూ జీవితం గడుపుతూ మధ్యలోనే కొన్నిసార్లు తుపాకీ గుండ్లకు బలైపోయిన యువకుల గురించి పేపర్లో చదువుతుంటే నా గుండె బరువెక్కుతుంది. ఇక్కడే మన పిల్లలను ఉన్న దాంట్లో కడుపు నింపుకుని పెంచుకుంటే ఈ మొక్కలు పెరిగి మహా వృక్షాలై మళ్లీ తిరిగి పిల్లలని పెడతాయి కదా జానకి".

సమయం గడుస్తూ వేదన మనసుని కదిపినా మనిషిని కదపలేక మెల్లగా అలానే ఆమె అతనిని ఓదారుస్తూ చిన్నపిల్లలా అతని ఒడిలో అలా నిద్రలోకి జారుకుంది. జానకిని అలానే చూస్తూ తనని లేపడం ఇష్టం లేక అతను కూడా నిద్రలోకి జారుకున్నాడు. గడియారం మాత్రం మెలకువగానే ఉంది టిక్ టిక్ మంటూ.

కాలం అనేది మనసుకి అయ్యే గాయాల మాన్పుకి మందు. కరిగిపోయిన వేదనతో మెలకువ వచ్చి చూశాడు. తొలి వేకువ ఝాము... భానుడు కిరణాలతో చీకటిని మెలమెల్లగా ఎత్తుతూ పార బోస్తున్నాడు. సంధ్యావందన సమయం అవుతుందని గోడగడియారం వైపు చూసాడు.. అది అర్ధరాత్రే ఆగిపోయింది. జానకిని లేపబోతే శరీరం గడ్డ కట్టుకు పోయింది. వరద ఉధృతికి వేర్లు తెగిన మానులా, మెల్లగా కిందకు ఒరిగిపోయింది.

జానకీ అంటూ ఒక్కసారిగా గుండెలు పగిలేలా అరిచాడు. అప్పుడే కొడుకు చేస్తున్న కాల్‌కి ఫోన్ రింగ్ అవుతూ ఉంది. ★

మనకు ఫీఫా ప్రపంచకప్ అర్హత యోగం ఎప్పుడో?

20 దేశాలు తలపడే క్రికెట్లో అగ్రగామిగా ఉన్న భారత్ 200 దేశాలు పోటీపడే ప్రపంచ క్రీడ ఫుట్‌బాల్‌లో మాత్రం పాతాళానికి పడిపోయింది. ప్రపంచకప్ అర్హత మనకు అందని ద్రాక్షలా మారింది. ప్రపంచంలోనే అత్యధిక జనాదరణ పొందిన క్రీడ, 200కు పైగా దేశాలు తలపడే క్రీడ ఫుట్‌బాల్‌లో మరో ప్రపంచకప్ సమరానికి కౌంట్ డౌన్ ప్రారంభమయ్యింది.

ఒలింపిక్స్ తరువాత ఈ భూఖండంలోనే అతిపెద్ద క్రీడాసంరంభంగా పేరుపొందిన 2026 ఫీఫా ప్రపంచకప్‌లో తలపడే తుది 48 జట్ల జాబితా ఖరారయ్యింది. వివిధ ఖండాలలోని ప్రాంతాల వారీగా గత మూడేళ్లుగా సాగిన ప్రపంచకప్ అర్హత పోటీలలో 204 దేశాలు తలపడితే గతంలో ఎన్నడూలేని విధంగా ప్రపంచ ఫుట్ బాల్ సమాఖ్య 48 జట్లకు ఫైనల్ రౌండ్లో తలపడే అవకాశం కల్పించింది. కేప్ వర్దీ, సెర్బియా-హెర్జిగోవినా, హైతీ లాంటి బుల్లిదేశాలు టైటిల్ రౌండ్‌కు అర్హత సాధిస్తే, ప్రపంచంలోనే జనాభా పరంగా అతిపెద్ద దేశాలుగా పేరుపొందిన చైనా, భారత్‌లు విఫలమయ్యాయి.

మూడుదేశాల ఆతిథ్యం

నాలుగేళ్లకోసారి జరిగే ప్రపంచ ఫుట్‌బాల్ సంబరానికి మూడుదేశాలు కలసి జూన్ 11, 2026 నుంచి ఆతిథ్యమివ్వనున్నాయి. నెలరోజుల ఈ మహా సమరానికి కెనడా, అమెరికా, మెక్సికో దేశాలలోని పలు ప్రధాన స్టేడియాలు వేదికలు కానున్నాయి. గత ప్రపంచకప్ వరకూ ఫైనల్ రౌండ్లో కేవలం 32 దేశాలజట్లు తలపడితే.. ప్రస్తుత 2026 ప్రపంచకప్ నుంచి అదనంగా మరో 16 దేశాల జట్లకు పోటీపడే అవకాశాన్ని ఫీఫా (ప్రపంచ ఫుట్ బాల్ సమాఖ్య) కల్పించింది. అర్హత రౌండ్ల నుంచి ఫైనల్ రౌండ్‌కు చేరిన మొత్తం 48 జట్లను 12 గ్రూపులుగా విభజించి లీగ్ దశ పోటీలను నిర్వహించ డానికి 2026 ప్రపంచకప్ నిర్వాహక సంఘం ఏర్పాట్లు చేసింది.

ఆసియాఖండం నుంచి ఏడు దేశాలు

ప్రపంచకప్ ఫైనల్ రౌండ్‌కు అర్హత సాధించిన మొత్తం 48 జట్లలో ఆసియాఖండానికి చెందిన ఏడు దేశాలు (జపాన్, దక్షిణ కొరియా, ఇరాన్, ఇరాక్, ఖతార్, సౌదీ అరేబియా, ఆస్ట్రేలియా, జోర్డాన్) ఉన్నాయి. గ్రూప్-ఏలో చెక్ రిపబ్లిక్, దక్షిణాఫ్రికా, మెక్సికో, దక్షిణ కొరియా, గ్రూప్-బీలో కెనడా, బోస్నియా అండ్ హెర్జిగోవినా, ఖతార్, స్విట్జర్లాండ్, గ్రూప్-సీలో బ్రెజిల్, హైతీ, మొరాకో, స్కాట్లాండ్, గ్రూప్-డీలో ఆస్ట్రేలియా, పరాగ్వే, తుర్కియో, అమెరికా, గ్రూప్-ఈ లీగ్‌లో ఈక్వెడార్, కొసావో, జర్మనీ, ఐవరీ కోస్ట్ తలపడనున్నాయి. గ్రూప్-ఎఫ్‌లో నెదర్లాండ్స్, ట్యునీసియా, జపాన్, స్వీడన్, గ్రూప్-జీలో బెల్జియం, ఈజిప్టు, ఇరాన్, గ్రూప్-హెచ్‌లో కేప్ వెర్దీ, సౌదీ అరేబియా, స్పెయిన్, ఉరుగ్వే, గ్రూప్-ఐలో ఫ్రాన్స్, నార్వే, సెనెగల్, ఇరాక్, గ్రూప్-జెలో అర్జెంటీనా, అల్జీరియా, ఆస్ట్రియా, జోర్డాన్, గ్రూప్-కెలో పోర్చుగల్, కొలంబియా, కాంగో, ఉజ్బెకిస్థాన్, గ్రూప్-ఎల్‌లో క్రొయేషియా, ఇంగ్లండ్, ఘనా, పనామా పోటీపడతాయి.

పాపం.. ఇటలీ!

నాలుగుసార్లు విజేత, అలనాటి సాకర్ దిగ్గజజట్లలో ఒకటైన ఇటలీ లేకుండానే 2026 ప్రపంచకప్ సమరం జరుగనుంది. గత 12 సంవత్సరాల కాలంలో ప్రపంచకప్ ఫైనల్ రౌండ్‌కు ఇటలీ అర్హత సాధించలేకపోడం ఇది వరుసగా మూడోసారి. ఫుట్‌బాల్‌నే ఊపిరిగా భావించే ఇటలీ అభిమానులకు ఇది ఏమాత్రం జీర్ణించుకోలేని చేదు నిజం. మెక్సికో వేదికగా ముగిసిన ప్రపంచకప్ ఇంటర్ కాంటినెంటల్ అర్హత ఫైనల్స్ పోరులో బోస్నియా-హెర్జిగోవినా చేతిలో ఇటలీ 1-2 గోల్స్‌తో పరాజయం పొందడం కలకలమే రేపింది. 1932, 1938, 1982, 2006 ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీల విజేతగా నిలిచిన ఇటలీ 2018, 2022, 2026 టోర్నీలకు అర్హత సాధించలేకపోయింది. ప్రపంచ సాకర్ చరిత్రలో అత్యంత విజయవంతమైన జట్లలో ఒకటిగా నిలిచిన ఇటలీ ప్రస్తుత పరిస్థితి ఇంతబతుకూ బతికి ...అన్నట్లుగా తయారయ్యింది.

క్రికెట్ మర్రి చెట్టు నీడన భారత్ ఫుట్‌బాల్

ప్రపంచ ఫుట్ బాల్‌లో భారత్ పరిస్థితి నానాటికీ తీసికట్టుగా తయారవుతోంది. క్రికెట్ మర్రి చెట్టు నీడన కునారిల్లిపోతున్న మొక్కలా భారత ఫుట్‌బాల్ భవిష్యత్ అయోమయంగా మారింది. ప్రపంచ ఫుట్‌బాల్ ఫైనల్ రౌండ్‌కు అర్హత సాధించడం సంగతి అటుంచి ఆసియా జోనల్ రౌండ్ మ్యాచ్‌ల్లో నెగ్గటమే తలకు మించిన భారంగా మారింది. భారత ఫుట్‌బాల్ సమాఖ్య, భారత ప్రభుత్వం ఎంతగా ప్రయత్నించినా పరిస్థితి ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నచందంగా తయారయ్యింది.

అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య తాజా ర్యాంకింగ్స్ ప్రకారం భారతజట్టు 136వ ర్యాంక్‌లో కొనసాగుతోంది. మొత్తం 204 దేశాలలో భారత్ ర్యాంకు 136 అంటే మన ఫుట్‌బాల్ పరిస్థితి ఎంతటి దారుణమో, దయనీయమో మరి చెప్పాల్సిన పనిలేదు. మన ఇరుగుపొరుగు దేశాలు అఫ్ఘనిస్థాన్, మయన్మార్, బాంగ్లాదేశ్, మాల్దీవులు లాంటి జట్లను ఓడించడానికే మన జట్టు నానాపాట్లు పడుతోంది. రానున్న దశాబ్దాల కాలంలో ఏదైనా అద్భుతం జరిగితే మినహా మన ఫుట్‌బాల్ జట్టు ఫీఫా ప్రపంచకప్ ఫైనల్ రౌండ్‌కు అర్హత సాధించడం అసాధ్యమని చెప్పకతప్పదు. గతంలో ఒలింపిక్స్ కాంస్య పతకం సాధించిన భారత్ ఫుట్‌బాల్ జట్టు ప్రమాణాలు రానురాను క్షీణించిపోయాయి. మన ఆసియా ఖండానికే చెందిన ఖతార్ లాంటి అతిచిన్న దేశం ప్రపంచకప్ ఫైనల్ రౌండ్లో వరుసగా రెండోసారి పాల్గొనటానికి అర్హత సాధించడం చూస్తే అపారమైన మానవవనరులు, భారీమార్కెట్ కలిగిన మన ఫుట్‌బాల్ జట్టు సాధించాల్సింది ఎంతో ఉందని చెప్పకతప్పదు.

కృష్ణారావు చాప్పరపు
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

నారాయణపేట : మహాంకాళి బస్తీలో ఏప్రిల్ 5న జరిగిన హిందూ సమ్మేళనంలో ప్రసంగిస్తున్నవారు తెలంగాణ ప్రాంత కార్యకారిణి సభ్యులు డాక్టర్ అన్నదానం సుబ్రహ్మణ్యం.

పాలమూరు : మక్తల్ ఖండ జక్లేర్ ఉపమండలం సమ్మేళనంలో ఉత్సవ సమితి అధ్యక్షులు భరత్‌కుమార్, ముఖ్యఅతిథిగా శ్రీశ్రీశ్రీ ఆదిత్యపరాశక్తి స్వామి, శ్రీపంచమసిద్ధ లింగ మహాస్వామి నేరేడుగం, వక్తగా విభాగ్ సంఘచాలక్ ఏమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పాలమూరు : మక్తల్ హిందూ సమ్మేళనంలో ప్రసంగిస్తున్నవారు తెలంగాణ ప్రాంత గోసేవాప్రముఖ్ వెంకటనివాస్. కార్యక్రమంలో 2097 పురుషులు, మహిళలు 1315 పాల్గొన్నారు.

నారాయణపేట : ఏప్రిల్ 5న శక్తినగర్‌లో జరిగిన హిందూ సమ్మేళనంలో ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత సేవాప్రముఖ్ శివశంకర్, పూజ్యశ్రీ శంకరస్వామి పాల్గొన్నారు. కార్యక్రమంలో పురుషులు, 1681, మహిళలు 1381 పాల్గొన్నారు.

పల్నాడు : నరసరావుపేట నగరంలోని ఎస్ఎస్ఎన్ కాలేజీలో ఏప్రిల్ 5న జరిగిన 'వైభవం భారతం' సమావేశంలో దక్షిణమధ్య క్షేత్ర ప్రచారక్ భరత్‌కుమార్, విభాగ్ ప్రచారక్ డాక్టర్ కెవిస్ఎన్‌చారి పాల్గొన్నారు. 383 మంది వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

కావలి : నెల్లూరు జిల్లా కావలిలో ఏప్రిల్ 5న జరిగిన 'వైభవం భారతం' సమావేశంలో ప్రసంగిస్తున్న ఆర్ఎస్ఎస్ ఆంధ్రప్రదేశ్ ప్రాంత ప్రచారక్ ఆదిత్య. ఈ కార్యక్రమానికి కావలి ఎమ్ఆర్ఓ శ్రవణ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 254 మంది పురప్రముఖులు పాల్గొన్నారు.

బాపట్ల : పౌర్ణమి సందర్భంగా ఏప్రిల్ 1న బాపట్ల జిల్లా, చీరాల మండలం, వాడరేవు గ్రామం (సముద్ర తీర ప్రాంతం) లో హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో అత్యంత వైభవోపేతంగా జరిగిన సామూహిక సాగర హారతి కార్యక్రమంలో వేదిక జిల్లా సంయోజక్ బండారు జ్వాలా నరసింహం, సాగర హారతి కన్వీనర్, బిజెపి నాయకులు తాడివలస దేవరాజు, భజన బృందం వారు, మాతృమూర్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వరంగల్ : ఏప్రిల్ 5 వరంగల్ మహానగర్‌లోని న్యూసాయంపేట బస్తి హిందూ సమ్మేళనంలో విశ్వబ్రహ్మ పూజ్యశ్రీవీరధర్మస్వామి, విశ్వహిందూపరిషత్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఆకారపు కేశవరావు, ప్రముఖ జర్నలిస్ట్ దేవికారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 3,650(పురుషులు 1700, మహిళలు 1950) పాల్గొన్నారు.

బాల జాగృతి



అభిప్రాయం

కథ

ఒక పండితుడు తాను రాసిన కొన్ని పద్యాలను వినిపించడానికి తెనాలి రామలింగడి దగ్గరకు వచ్చాడు. తన పాండిత్యాన్ని రామలింగడి ముందు ప్రదర్శించాలనేది ఆయన కోరిక. అప్పుడు పని ఒత్తిడిలో ఉన్న రామలింగడు, "పండితావర్యా! మీరు మీ పద్యాలను ఇక్కడ ఉంచి వెళ్లండి. నేను తీరిక దొరికినప్పుడు తప్పకుండా చదివి నా అభిప్రాయం చెబుతాను" అని సూచించాడు. కానీ, రామలింగడి మాటలను నమ్మని ఆ పండితుడు, పద్యాలను ఇప్పుడే వినాలంటూ పట్టుబట్టాడు.

పండితుడి మొండి వైఖరి రామలింగడికి కొంత అసహనం కలిగించినా, పైకి మాత్రం "సరే! మొదలుపెట్టండి" అని గోడకు ఆనుకుని కూర్చున్నాడు. పండితుడు పద్యాలు చదవడం ప్రారంభించాడు. మొదటి రెండు మూడు పద్యాలకు "ఊ" కొట్టిన రామలింగడు, ఆ తర్వాత మెల్లగా గాఢ నిద్రలోకి జారుకున్నాడు. అయినా పండితుడు మాత్రం తన పద్యాల పఠనాన్ని ఆపలేదు.

కాసేపటి తర్వాత రామలింగడు నిద్రలేచాడు. వెంటనే పండితుడు, "అయ్యా! నా పద్యాలను మరోసారి వినిపించమంటారా?" అని అడిగాడు. దానికి రామలింగడు, "ఎందుకు? నేను ఇందాకే నా అభిప్రాయం చెప్పాను కదా!" అన్నాడు. ఆ మాటలకు ఆశ్చర్యపోయిన పండితుడు, "అభిప్రాయమా? ఎప్పుడు? మీరు నిద్రపోతున్నారు కదా!" అన్నాడు.

అప్పుడు రామలింగడు చిరునవ్వుతో, "అవును నిజమే! నేను నిద్రలోకి జారుకోవడమే నా అభిప్రాయం. మీ పద్యాలు వింటుంటే నాకు అంత హాయిగా నిద్ర వచ్చిందంటే, అవి ఎంత 'నిద్రపుచ్చేవిగా' ఉన్నాయో అర్థం చేసుకోండి" అని వ్యంగ్యంగా బదులిచ్చాడు.

రామలింగడి చతురతకు, ఆ పరోక్ష విమర్శకు పండితుడు నివ్వెరపోయాడు. తన పద్యాల్లోని లోపాన్ని ఎత్తిచూపిన తీరుకు బాధపడాలో లేక రామలింగడి సమయస్ఫూర్తిని మెచ్చుకోవాలో అర్థంకాక అక్కడి నుండి మౌనంగా వెళ్లిపోయాడు. ★

మంచిమాట

వివేకవంతుడు మనసును శాసిస్తాడు, మూర్ఖుడు దానికి బానిస అవుతాడు.

మెదడుకు మేత

కడుపులో పిల్లలు. అరుపేమో ఉరుము. ఎరుపంటే భయం. ఎవరది?

ఇరై : ఇఎఇఇ

పద్యం

ఆకొన్నకూడె యమృతము
తాకొందక నిచ్చువాడె దాత ధరిత్రిన్
సోకోర్చువాడె మనుజుడు
తేకువ గలవాడె వంశతిలకుడు సుమతీ

భావం : ఈ భూమి మీద బాగా ఆకలివేసినప్పుడు తిన్న అన్నమే అమృతం. అది చాలా రుచిగా ఉంటుంది. ఎవరైనా దానం కోరితే విసుక్కోకుండా దానం చేసేవాడే నిజమైన దాతృత్వం కలిగినవాడు. అలాగే ఎదురైన కష్టాలను ఓర్చుకోగలవాడే నిజమైన మానవుడు. ధైర్యం ఉన్నవాడే వంశానికి మంచి పేరు తేగలుగుతాడు.

శ్లోకం

పరోక్షే కార్యహన్తారం
ప్రత్యక్షే ప్రియవాదినం
వర్జయే త్తాదృశం మిత్రం
విషకుంభం పయోముఖం

భావం : మన ఎదుట ముఖ ప్రీతికోసం మంచిగా మాట్లాడుతూ, పరోక్షంగా పనులను భంగపరచేవారిని విడిచిపెట్టాలి. తాము మిత్రులుగా చెప్పుకుంటున్నా పరిత్యజించాలి. పయోముఖ విషకుంభం లాంటి వ్యక్తులు ప్రమాదకారులు.

జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

దేశబంధు	మదన్ మోహన్ మాలవీయ
దీనబంధు	రవీంద్రనాథ్ ఠాగూర్
సరిహద్దు గాంధీ	చిత్తరంజన్ దాస్
గురుదేవ్	అబ్దుల్ గఫార్ ఖాన్
పండిట్	సీఎస్ ఆండ్రూస్

[illegible]

నిర్వహణ : నయనశ్రీ

శాస్త్రవేత్తలు

విల్హేల్మ్ కన్రాడ్ రాంట్జెన్

(మార్చి 27,1845-1923 ఫిబ్రవరి 10)



జర్మన్ దేశ భౌతిక శాస్త్రవేత్త. ప్రపంచంలో వైద్యరంగంలో రోగనిర్ధారణకు (రేడియోగ్రఫీ), రోగ నిర్మూలనకు (రేడియో థెరపీ) కోసం ఉపయోగించే ఎక్స్ కిరణాలను కనుగొన్న శాస్త్రవేత్త. ఆయన కనుగొన్న ఎక్స్ కిరణాలు వైద్యరంగములోనే కాక భద్రతా రంగంలో కూడా ఉపయోగ పడుతున్నాయి. 1895 నవంబర్ 8న విద్యుదయస్కాంత తరంగాలలో వివిధ తరంగ దైర్ఘ్యాల అవధులలో గల ఎక్స్-కిరణాలను కనుగొన్నాడు. ఈ పరిశోధనవల్ల 1901లో భౌతిక శాస్త్రంలో మొదటిసారి నోబెల్ బహుమతి పొందారు. ఈయన చేసిన కృషికిగాను ఆవర్తన పట్టికలో 111 పరమాణు సంఖ్య గల మూలకానికి రాంట్ జీనియమ్ అనిపేరు పెట్టారు.

జనరల్ నాలెడ్జ్

1. 'మై మ్యూజిక్, మై లైఫ్' అనేది ఎవరి ఆత్మకథ?
2. పోచంపాడు ప్రాజెక్టు ఏ నదిపై ఉంది?
3. వాతావరణంలో ఎత్తును కొలవటానికి వాడే యంత్రం ఏది?

సమాధానాలు: 1. పండిట్ రవిశంకర్; 2. గోదావరి; 3. ఆల్టిమీటర్.

భక్తాగ్రేసరులు

వీరబ్రహ్మేంద్ర స్వామి



'కా'లజ్ఞానం' గురించి తెలియని, దానిని ఏదో ఒక సందర్భంలో ప్రస్తావించని తెలుగువారు ఉండరు. దాని కర్త వీరబ్రహ్మేంద్రస్వామి. ఆయన అసలు పేరు వీరనారాయణ. ముద్దుపేరు వీరప్ప. వీరన్న, వీరంభట్లు,వీరాచారి, వీరంభట్లయ్య, బ్రహ్మం,వీరగురు, వీరయ్యదాసు లాంటి అనేక పేర్లు ఉన్నాయని ఆయన తత్త్వ సాహిత్య చరిత్ర చెబుతోంది. చిన్నతనం నుంచి ఆధ్యాత్మికతను అలవరచుకున్న ఆయన పన్నెండవ ఏట తీర్థయాత్రలకు బయలుదేరారు. వారించిన తల్లిని తన బోధతో మెప్పించాడు. రామేశ్వరం, ధనుష్కోటి, చిదంబరం దర్శించి, కంచి చేరుకొని సూర్యోపాసనతో తపస్సు చేశారు. అక్కడి నుంచి శ్రీశైలం, మహానంది, యాగంటి క్షేత్రాలు సందర్శిస్తూ బనగానపల్లి చేరారు. ఎక్కడికక్కడ తత్త్వాలు రాస్తూ, పాడుతూ ప్రజలను చైతన్యవంతులను చేశారు. బనగానపల్లెలో కాలజ్ఞానం రాశారు. మత సామరస్యాన్ని బోధించారు. నాటి సమాజంలోని మూఢ విశ్వాసాలను పాటలు గేయాలు, సంవాదాల రూపంలో ఖండించారు. ఆయన స్త్రీ పక్షపాతిగా ప్రసిద్ధులు. వారిని పురుషులతో సమానంగా చూడాలని అనేవారు. ఆధ్యాత్మిక తత్త్వవేత్త అయిన తన మనుమరాలు ఈశ్వరమ్మను తన ఆధ్యాత్మిక వారసురాలిగా ప్రకటించారు. ★

వారఫలాలు

13-19 ఏప్రిల్, 2026

సింహంభట్ల సుబ్బారావు
6300674054

మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

రాబడి ఆశాజనకంగా ఉంటుంది. శత్రువులు కూడా స్నేహితులుగా మారతారు. సమాజంలో గౌరవం పెరుగుతుంది. పరిచయాలు పెరుగుతాయి. వ్యాపారస్తులు మరింత ఉత్సాహవంతంగా ముందుకు సాగుతారు. ఉద్యోగస్తులకు హోదాలు దక్కే అవకాశం. పారిశ్రామికవేత్తలు, కళాకారుల ప్రయత్నాలు సఫలం. 17,18 తేదీల్లో ఆస్తి వివాదాలు. ఆకస్మిక ప్రయాణాలు. ఆదిత్య హృదయం పఠించండి.

వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

కొత్త కాంట్రాక్టులు దక్కించుకుంటారు. వివాహ, ఉద్యోగ యత్నాలు సానుకూలమవుతాయి. ఆస్తుల వ్యవహారాలలో చిక్కులు తొలగుతాయి. విద్యార్థులకు శుభవర్తమానాలు. వ్యాపారస్తులకు మరింత లాభాలు దక్కుతాయి. ఉద్యోగస్తులకు పనిభారం కొంత తగ్గుతుంది. రచయితలు, క్రీడాకారులు, కళాకారులు అంచనాలు నిజమవుతాయి. 13,14 తేదీల్లో వృథా ఖర్చులు. స్వల్ప అస్వస్థత. మానసిక అశాంతి. దత్తాత్రేయుని పూజించండి.

మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

ప్రత్యర్థులను సైతం ఆకట్టుకుంటారు. ప్రయాణాలలో మార్పులు. వాహనాలు, భూములు కొంటారు. కోర్టు వ్యవహారాలు కొలిక్కి వస్తాయి. వ్యాపారస్తులకు పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగులు అనుకున్న మార్పులు ఉండవచ్చు. రాజకీయ, పారిశ్రామిక వేత్తలు, కళాకారులకు కార్యసిద్ధి. 14,15 తేదీలలో దేవాలయ దర్శనాలు. కుటుంబంలో ఒత్తిడులు. ఆరోగ్య సమస్యలు. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.

కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

సన్నిహితుల సలహాలు స్వీకరిస్తారు. మీ నిర్ణయాలను అందరూ స్వాగతిస్తారు. ఇంటి నిర్మాణాలపై నిర్ణయం తీసుకుంటారు. ఏ బాధ్యత అప్పగించినా నేర్పుగా పూర్తి చేస్తారు. వ్యాపారస్తులకు కొత్త ఆశలు చిగురిస్తాయి. ఉద్యోగులకు పనిభారం నుంచి విముక్తి. రచయితలు, కళాకారులు, క్రీడాకారులకు ప్రోత్సాహకరమైన కాలం. 15,16 తేదీల్లో స్వల్ప శారీరక రుగ్మతలు. ఖర్చులు పెరుగుతాయి. దూర ప్రయాణాలు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

దూరప్రయాణాలు చేస్తారు. కాంట్రాక్టర్లకు మరింత ఉత్సాహవంతంగా ఉంటుంది. వాహనాలు, ఆభరణాలు కొంటారు. వ్యాపారస్తులకు అనూహ్యమైన లాభాలు దక్కుతాయి. ఉద్యోగులకు విధుల్లో అవాంతరాలు తొలగుతాయి. రాజకీయవేత్తలు, క్రీడాకారులకు ఊహించనిఆహ్వానాలు. 18,19 తేదీల్లో ఇంటాబయటా ఒత్తిడులు. దుబారా వ్యయం. ఆరోగ్య సమస్యలు. దుర్గాదేవిని పూజించండి..

కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

వాహనాలు, స్థలాలు కొనుగోలు. రియల్టర్లకు మరింత సానుకూలమైన కాలం. దేవాలయాలు సందర్శిస్తారు. వ్యాపారస్తులకు కొత్త పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగస్తులకు అదనపు హోదాలు. రచయితలు, క్రీడాకారులు, కళాకారులకు విశేష గుర్తింపు లభిస్తుంది. 17,18 తేదీల్లో అదనపు ఖర్చులు. ఆకస్మిక ప్రయాణాలు. ఆకస్మిక ప్రయాణాలు. ఆంజనేయ దండకం పఠించండి.

తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

నిరుద్యోగుల శ్రమ ఫలించే సమయం. ఇంటి నిర్మాణయత్నాలు ముమ్మరం. వేడుకలకు హాజరై ఉత్సాహంగా గడుపుతారు. ఉద్యోగస్తులకు అదనపు బాధ్యతలు తప్పకపోవచ్చు. రాజకీయవేత్తలు, కళాకారులు, పరిశోధకులకు ఆకస్మిక విదేశీ పర్యటనలు ఉండవచ్చు. 15,16 తేదీల్లో వ్యయప్రయాసలు. బంధువులతో తగాదాలు. ఆరోగ్యం మందగిస్తుంది. నవగ్రహ స్తోత్రాలు పఠించండి.

వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

అనుకున్న ఆదాయం సమకూరుతుంది. గతంలో జరిగిన లోటుపాట్లు సరిదిద్దుకుని ముందడుగు వేస్తారు. వ్యాపారస్తులకు మరింతగా పెట్టుబడులు సమకూరతాయి. ఉద్యోగస్తులకు పనిఒత్తిడులు తగ్గవచ్చు. రాజకీయవేత్తలు, కళాకారులకు ఊహించని అవకాశాలు దక్కుతాయి. 17,18 తేదీల్లో లేనిపోని సమస్యలు. ఆరోగ్యం కొంత చికాకు పరుస్తుంది. ఆకస్మికప్రయాణాలు. కనకధారా స్తోత్రం పఠించండి..

ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

చేపట్టిన కార్యక్రమాలలో అవాంతరాలు. నిర్ణయాలు వాయిదా వేస్తారు. కాంట్రాక్టర్లకు ఎట్టకేలకు అనుకూలిస్తుంది. కొత్త వ్యక్తుల పరిచయం. ఉద్యోగస్తులకు బాధ్యతలు పెరుగుతాయి. రాజకీయవేత్తలు, కళాకారులు, క్రీడాకారులకు విదేశీ పర్యటనలు వాయిదా పడతాయి. 15,16 తేదీల్లో శుభవార్తలు. వాహనయోగం. ప్రముఖులతో చర్చలు సాగిస్తారు. అంగారక స్తోత్రాలు పఠించండి.

మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

సమయానికి కొత్త నిర్ణయాలు తీసుకుంటారు. ఆస్తుల వ్యవహారాలు కొలిక్కి తెచ్చుకుంటారు. వివాహాది వేడుకల నిర్వహణకు సన్నద్ధమవుతారు. ఉద్యోగస్తులకు పనిభారం తగ్గి ఊరట లభిస్తుంది. వైద్యులు, పారిశ్రామికవేత్తలు, కళాకారులకు కొత్త అవకాశాలు లభించవచ్చు. 18,19 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. శారీరక రుగ్మతలు. మానసిక ఆందోళన. గణేశాష్టకం పఠించండి.

కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

రాబడి గతంతో పోలిస్తే మెరుగ్గా ఉంటుంది. దేవాలయాలు సందర్శిస్తారు. వాహనాలు, భూములు సమకూర్చుకుంటారు. వ్యాపారస్తులకు పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగులు విధుల్లో మరింత అనుకూలతఉంటుంది. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, వైద్యులకు కొత్త ఆశలు చిగురిస్తాయి. 14,15 తేదీల్లో కుటుంబంలో చికాకులు. ఆరోగ్యం మందగిస్తుంది. ధనవ్యయం. హయగ్రీవస్తోత్రాలు పఠించండి.

మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

ఇంటి నిర్మాణయత్నాలలో ముందడుగు వేస్తారు. విద్యార్థులకు ఫలితాలు ఉత్సాహాన్నిస్తాయి. మీ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. కొన్ని సంఘటనలు ఆకట్టుకుంటాయి. వ్యాపారస్తులకు పెట్టుబడులు మరింత అందుతాయి. ఉద్యోగులకు విధుల్లో ప్రశంసలు. క్రీడాకారులు, పారిశ్రామిక వేత్తలు, కళాకారులు లక్ష్యాలు సాధిస్తారు. 17,18 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. శారీరక రుగ్మతలు. మానసిక ఆందోళన. హనుమాన్చాలీసా పఠించండి.

పదరసం-559

ఆధారాలు

అడ్డం

1. ఇంద్రధనుస్సే (4)
4. సర్పం (3)
7. భూమి, నేల (2)
9. చోటు, ప్రదేశం (2)
10. ఈయన ఒక గ్రహం (3)
11. తెలంగాణ రాష్ట్ర పుష్పం (2)
13. బురద, పంకం (3)
17 తింటే దీనినే తినాలట (2)
18. కన్యకు వికృతి (2)
19. మదురలో అమ్మవారు (3)
20. అమాత్యుడు (2)
21. స్వచ్ఛమైన (3)
22. బాధ, గోడు (2)
23. భద్రం, జాగ్రత్త (3)
24. కష్టం, వేదన (2)
25. పితృదేవతలకు తర్పణాలకు ప్రసిద్ధ క్షేత్రం (2)
27. దీని కోసం వచ్చి ముంతదాయడమా? (2)
28. ప్రార్థన, పిలుపు (2)
29. ధర్మశాల, మఠం (2)
30. ధనువు (2)
31. అధికం – ఎటు చదివినా ఒకటే (3)

నిలువు

2. ఆనవాయితి, అలవాటు (3)
3. గృహం తిరగబడింది (2)
5. వెండి (3)
6. సగంలో సగం (2)
8. రామపుత్రుల్లో ఒకరు (2)
9. రజ్జువు (2)
10. దర్భ, తృణం (2)
12. ఎగతాళి, హేళన (2)
13. తండ్రిని, అక్కను ఇలానూ పిలుస్తారు (2)
14. మంచి స్వరం కలది (3)
15. చంద్రిక, కౌముది (3)
16. అందలం, పల్లకి (2)
18. తామర (3)
19. తమరు – నీకు బహువచనం (2)
20. ఒక పర్వతం, కవ్వం (3)
21. రెండవ తిథి (2)
22. సేద్యం, సాగు (2)
23. శత్రువు, ప్రత్యర్థి (3)
24. అబద్ధాలు (3)
26. విచిత్రం చెల్లాచెదరు (3)
27. రుచి, అనుభవం (2)
28. అంకురం (2)
29. బేసి కాదు (2)



పదరసం - 558 సమాధానాలు



గత కొన్నేళ్లుగా సరైన విజయం లేక సతమత మౌతున్నాడు శర్వానంద్. ఎన్ని రకాల ప్రయోగాలు చేసినా... విజయలక్ష్మి మాత్రం అతన్ని వరించలేదు. అలాంటి సమయంలో ఈ యేడాది సంక్రాంతి కానుకగా విడుదలైన 'నారీ నారీ నడుమ మురారి' సినిమా అతన్ని సక్సెస్ ట్రాక్‌లోకి తీసుకొచ్చింది. నిజానికి దానికంటే ముందే రావాల్సిన 'బైకర్' కాస్తంత ఆలస్యంగా విడుదలై... ఇదీ పాజిటివ్ టాక్‌ను సంపాదించుకోవడం విశేషం. విశేషం ఏమంటే... ఈ సినిమా ఈ యేడాది శర్వాకు రెండో విజయాన్ని అందించడమే కాదు... ఈ చిత్ర నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ కూ సెకండ్ సక్సెస్‌ను ఇచ్చింది. ఆ మధ్య ఈ సంస్థ నిర్మించిన 'కపుల్ ఫ్రెండ్లీ' మూవీ విడుదలై, చక్కని విజయాన్ని అందుకుంది. ఆ వెనుకే వచ్చిన 'బైకర్' సైతం విజయం సాధించడం నిర్మాత సంస్థకు కొత్త ఊపును ఇచ్చింది.

శర్వా సక్సెస్ ట్రాక్‌లో BIKER



గత కొన్నేళ్లుగా సరైన విజయం లేక సతమత మౌతున్నాడు శర్వానంద్. ఎన్ని రకాల ప్రయోగాలు చేసినా విజయలక్ష్మి మాత్రం అతన్ని వరించలేదు. అలాంటి సమయంలో ఈ యేడాది సంక్రాంతి కానుకగా విడుదలైన 'నారీ నారీ నడుమ మురారి' సినిమా అతన్ని సక్సెస్ ట్రాక్‌లోకి తీసుకొచ్చింది. నిజానికి దానికంటే ముందే రావాల్సిన 'బైకర్' కాస్తంత ఆలస్యంగా విడుదలై పాజిటివ్ టాక్‌ను సంపాదించుకోవడం విశేషం. విశేషం ఏమంటే ఈ సినిమా ఈ యేడాది శర్వాకు రెండో విజయాన్ని అందించడమే కాకుండా ఈ చిత్ర నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్‌కూ సెకండ్ సక్సెస్‌ను ఇచ్చింది. ఆ మధ్య ఈ సంస్థ నిర్మించిన 'కపుల్ ఫ్రెండ్లీ' మూవీ విడుదలై, చక్కని విజయాన్ని అందు కుంది. ఆ వెనుకే వచ్చిన 'బైకర్' సైతం విజయం సాధించడం నిర్మాత సంస్థకు కొత్త ఊపును ఇచ్చింది.

తెలుగులో క్రీడా నేపథ్యంలో పలు చిత్రాలు వచ్చినా అందులో విజయం సాధించిన సినిమాలు చేతి వేళ్ల మీద లెక్కపెట్టగలిగేవే. అయితే క్రీడలలో రాణించాలని అనుకున్న వారికి ఎదురయ్యే ప్రతిబంధకాలు, రాజకీయపరమైన ఒత్తిడిలు, ప్రత్యర్థుల పన్నాగాలు వాటిని హీరో లేదా హీరోయిన్ ఎలా ఎదుర్కొన్నారు అనే అంశాల చుట్టూనే సహజంగా ఇలాంటి సినిమాలు సాగుతాయి. శర్వానంద్ 'బైకర్' సినిమా కూడా అందుకు మినహాయింపేమీ కాదు. విక్కీ అలియాస్ వికాస్ నారాయణ్ (శర్వానంద్) మోటో క్రాస్ రేసర్. అంతర్జాతీయ స్థాయిలో భారత కీర్తి పతాకాన్ని ఎగరేయాల్సిన అతను అనివార్య కారణాల వల్ల రేసింగ్ నుండి తప్పుకుంటాడు. దీనిని అతని తండ్రి సునీల్ నారాయణ్ (రాజశేఖర్) తట్టుకోలేకపోతాడు. ఎందుకంటే ఒకప్పుడు అతనూ మోటో క్రాస్ రేసరే. ఈ దేశంలో క్రికెట్ కాకుండా మోటో క్రాస్ రేసింగ్ క్రీడకూ తగిన గుర్తింపు రావాలని అతను కలలు కంటాడు. తాను చేయలేకపోయిన పనిని కొడుకు ద్వారా చేయించాలని, అతన్ని బెస్ట్ రేసర్‌గా తీర్చి దిద్దుతాడు. కానీ అంతర్జాతీయ రేసింగ్‌లో మూడో స్థానంతో సరిపెట్టుకున్న వికాస్ పూర్తి స్థాయిలో రేసింగ్‌కు గుడ్ బై చెప్పడం తండ్రికి అస్సలు నచ్చదు. అయితే కొన్నేళ్ల పాటు రేసింగ్‌కు, తండ్రికీ దూరంగా బతికేసిన వికాస్ ఆ తర్వాత తిరిగి తన గత పథంలోకి అడుగు పెడతాడు. ఒకప్పుడు రేసింగ్‌ను వదిలేసిన అతను ఇప్పుడు ఎందుకు మనసు మార్చుకున్నాడు? మొదట్లో ఎందుకు తండ్రి అభిమతానికి విరుద్ధంగా ప్రవర్తించాడు? ఇందులో అతని జీవితంలోకి వచ్చిన అనన్య (మాళవిక నాయర్) ప్రమేయం ఏమిటీ? సునీల్ కొడుకు ద్వారా నెరవేర్చుకోవాలని అనుకున్న కోరిక తీరిందా? అనేది మిగతా కథ.

క్రీడా ప్రధానమైన ఇలాంటి కథలలో భావోద్వేగాలకు ఎంత ప్రాధాన్యమిస్తే అంత బాగా పండుతుంది. అయితే దర్శకుడు అభిలాష్ ఎంచుకున్న నేపథ్యం కొత్తదే అయినా తండ్రీ కొడుకుల సెంటిమెంట్ సీన్స్, స్పోర్ట్స్ ఆడే నాటకాలు, ప్రేమబంధాలు ఇవన్నీ గతంలో చాలా సినిమాల్లో ఉన్నవే. దాంతో రొటీన్ కథే అనిపిస్తుంది. తండ్రీ కొడుకుల బంధానికి, ఎడబాటుకు కూడా బలమైన కారణాలను చూపించలేదు. దాంతో ఆ సన్నివేశాలు పెద్దంతగా పండలేదు. కాకపోతే ఈ సినిమా మెయిన్ ఎసెట్ నటీనటులు. హీరో శర్వానంద్ ఈ సినిమా కోసం ఏకంగా 23 కేజీల బరువు తగ్గాడు. అంతేకాదు తెర మీద వయసు కూడా బాగా తగ్గినట్టు కనిపించడంలో సఫలీకృతుడయ్యాడు. రేసర్‌గా శరీరాకృతి ఎలా ఉండాలా? అలా తనను తాను మలుచుకున్నాడు. తన మేకోవర్ తో సినిమాకో కొత్త కలర్‌ను అద్దాడు. అలానే ఇంత కాలం హీరోగా నటించిన డాక్టర్ రాజశేఖర్ ఇప్పుడీ సినిమాలో శర్వా తండ్రిగా నటించాడు. ఆ మధ్య వచ్చిన 'రాబిన్ హుడ్' మూవీలో పోలీస్ అధికారిగా నటించినా ఆ సినిమా పరాజయం పాలైంది. పైగా అదేమంత చెప్పుకోదగ్గ పాత్ర కాదు. కానీ ఇందులో పోషించిన పాత్ర రాజశేఖర్‌కు సరిగ్గా సెట్ అయ్యింది. చాలా కాలం తర్వాత మళ్లీ పూర్తి స్థాయిలో రాజశేఖర్‌ను ఈ పాత్రలో చూడటం ఆయన అభిమానులను సైతం సంతోష పర్చింది. తండ్రీ కొడుకుల మధ్య సన్ని వేశాలు అంత బలంగా లేకపోయినా వీరి నటనతో సీన్స్‌ను పండించారు. అలానే మాళవిక నాయర్ కూడా తన అందం, అభినయంతో బాగా చేసింది. ఇతర ప్రధాన పాత్రలను బ్రహ్మాజీ, అతుల్ కులకర్ణి, తులసి తదితరులు చేశారు. ఈ సినిమాకు మెయిన్ ఎసెట్ గిబ్రాన్ నేపథ్య సంగీతం, అలానే యువరాజ్ సినిమాటోగ్రఫీ సైతం బాగుంది. 'మా నాన్న సూపర్ హీరో' మూవీతో దర్శకుడైన అభిలాష్ రెడ్డి కంకర ఈ సినిమాతో చక్కని గుర్తింపు తెచ్చుకున్నారు. క్రీడా నేపథ్య చిత్రాలను ఇష్టపడేవారికి 'బైకర్' నచ్చే ఆస్కారం ఉంది. అలానే ఇది పూర్తి స్థాయి స్పోర్ట్స్ మూవీ అనుకోవడానికి లేదు. ఫ్యామిలీ సెంటిమెంట్స్‌కూ బాగానే పెద్ద పీట వేశారు. మొత్తం మీద శర్వానంద్, యూవీ క్రియేషన్స్, అభిలాష్ రెడ్డి, మాళవిక నాయర్ వీరందరికీ 'బైకర్' గౌరవప్రదమైన విజయాన్ని అందించిందని చెప్పొచ్చు.

– అరుణ, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్

జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు



వెల : ₹.80/-

వెల : ₹.60/-



వెల : ₹.400/-

వెల : ₹.300/-



వెల : ₹.54/-

వెల : ₹.800/900 : 999/1200



వెల : ₹.250/-

వెల : ₹.130/-

వెల : ₹.200/-



వెల:₹.999/- సెట్



వెల:₹.450/-



వెల :₹.699/-



వెల : ₹.400/-



వెల : ₹.145/-

పై పుస్తకములకు మరియు కొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి..

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

సాహిత్య నికేతన్ : వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠీ, హైదరాబాద్. 9440589722,

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, రామమందిరంవీధి, గవర్నరు పేట, విజయవాడ - 2. 8333812687

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 78 Issue : 26